ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 31.01.2026 | సంపుటి : 12 సంచిక : 192 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# చుక్క నీరూ వదులుకోం



## పోలవరం-నల్లమలసాగర్ లింక్‌ను పూర్తిగా వ్యతిరేకించాం

- రాష్ట్ర నీటి ప్రయోజనాలపై రాజీపడబోం
- హరీష్‌రావు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి
- పదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్
- మండిపడ్డ మంత్రి ఉత్తమ్

హైదరాబాద్(జనంసాక్షి): కేంద్ర జలసంఘం ఛైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు అంశాన్ని అధికారులు పూర్తిగా వ్యతిరేకించినట్టు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించేలా అవసరమైన వాదనలను అధికారులు వినిపించారని చెప్పారు. పోలవరం - బనకచర్ల లేదా నల్లమల సాగర్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని శుక్రవారం నాటి సమావేశంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ స్పష్టంగా చెప్పారన్న మంత్రి... గతంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా లిఖితపూర్వకంగా తెలిపారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగిందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం మిగతా 2లో..

## తెలంగాణ నీళ్లను ఏపీకి తీసుకెళ్లే కుట్ర

**పథకం ప్రకారమే నల్లమలసాగర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారు : హరీశ్‌రావు**

హైదరాబాద్(జనంసాక్షి): ఏపీ సీఎం చంద్రబాబుతో సీఎం రేవంత్‌రెడ్డి దోస్తీ కట్టి తెలంగాణకు అన్యాయం చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. చంద్రబాబుతో మిగతా 2లో..

## అజెండా అంశాలు ఖరారయ్యాకే తదుపరి భేటీ

- వారంలోగా ఖరారు చేసి లిఖితపూర్వకంగా ఇవ్వండి
- ఏపీ,తెలంగాణ రాష్ట్రాలకు సూచించిన సీడబ్ల్యూసీ ఛైర్మన్
- అజెండాలో 12 అంశాలు చేర్చాలని తెలంగాణ ప్రతిపాదన
- అందులో పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టును పెట్టొద్దని వినతి
- ముగిసిన కేంద్ర జలవివాదాల పరిష్కార కమిటీ సమావేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర జలవివాదాల పరిష్కార కమిటీ సమావేశం ముగిసింది. దాదాపు రెండు గంటలపాటు ఈ భేటీ జరిగింది. అజెండాలో 12 అంశాలు చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. పోలవరం, నల్లమల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టవద్దని మిగతా 2లో..

# కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు



- ఎర్రవల్లిలో విచారణ కుదరదు
- మాజీ సీఎం విజ్ఞప్తిని తిరస్కరించిన సిట్
- నందినగర్ ఇంట్లోనే విచారిస్తామని వెల్లడి
- ఆదివారం సిద్ధంగా ఉండాలని సూచన
- నోటీసులపై బీఆర్ఎస్ నిరసన

హైదరాబాద్(జనంసాక్షి): ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శుక్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కాగా, గురువారం సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్లి నోటీసులు అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటలకు విచారణకు అందుబాటు లో ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న కేసీఆర్ అభ్యర్థనను సిట్ తిరస్కరించింది. హైదరాబాద్ నందినగర్లోని నివాసంలో అందుబాటులో ఉండాలని కేసీఆర్ కు సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని జనవరి 29న 160 సీఆర్ పీసీ కింద సిట్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉండగా..బంజారాహిల్స్ లోని నందినగర్ లో ఆయన నివాసంలో అధికారులు నోటీసులు అందించారు. జనవరి 30న మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని తెలిపారు. అయితే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచారణకు హాజరుకాలేనని సిట్ అధికారులకు కేసీఆర్ లేఖ రాశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలని అధికారులకు సూచించారు. అలాగే భవిష్యత్ లోనే ఎలాంటి నోటీసులైనా.. ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ అడ్రస్ కే పంపాలని విన్నవించారు. అయితే కేసీఆర్ మిగతా 2లో..

## హార్వర్డ్‌వర్సిటీలో సీఎం రేవంత్ వారం రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి




సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలోని కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లోఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను విజ యవంతంగా పూర్తి చేశారు. లీడర్ షిప్ అనే కోర్సును పూర్తిచేసి సంబంధిత మిగతా 2లో..

## పోలీసులకు కౌశిక్‌రెడ్డి క్షమాపణలు

**ఉద్దేశపూర్వకంగా అనలేదని వెల్లడి**



హైదరాబాద్(జనంసాక్షి): కరీంనగర్ జిల్లా వీణవంకలో సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా పోలీసులపై భారత రాష్ట్రసమితి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో పోలీసులకు క్షమాపణలు చెబుతున్నట్లు కౌశిక్ రెడ్డి తెలిపారు. తాను ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదని, పోలీసుల మనోభావాలు దెబ్బతింటే క్షమించాలన్నారు. సీఎం ప్రోద్బలంతో తనపై, తన కుటుంబంపై రాజకీయ కక్ష సాధిస్తు న్నారని చెప్పారు. పోలీసులు, అధికారులంటే తన కు ఎంతో గౌరవమన్నారు. జాతరకు వెళ్తుండగా అడ్డుకుని తీవ్ర ఒత్తిడి చేశారని.. ఆ సమయంలో నోరు జారానని, ఉద్దేశపూర్వక మాటలు కావని పేర్కొన్నారు.

ఏం జరిగిందంటే?

కరీంనగర్ జిల్లా వీణవంకలో సమ్మక్క-సారలమ్మ జాతరలో దళిత సర్పంచి సరోజను కొబ్బరికాయ కొట్టనివ్వడం లేదని ఎమ్మెల్యే మిగతా 2లో..

## వనదేవతల సన్నిధిలో డీజీపీ ప్రత్యేక పూజలు



- మేడారం జాతరలో మొక్కులు చెల్లించుకున్న శివధర్‌రెడ్డి
- తల్లుల రాకతో జనసంద్రంగా మహాజాతర

హైదారాబాద్(జనంసాక్షి): మేడారంలోని అడవి తల్లులు సమ్మక్క-సారలమ్మల మహాజాతరలో అత్యంత కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. భక్తజనసందోహం పోటెత్తిన వేళ.. క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి శుక్రవారం మేడారంలో పర్యటించారు. ఈ సందర్భంగా హెలికాప్టర్‌లో విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి దర్శనం చేసుకున్నారు. అంతకు ముందు, గద్దెల వద్దకు చేరుకున్న డిజిపి వనదేవతలను దర్శించుకుని మొక్కుల రూపంలో 'నిలువెత్తు బంగారం' (బెల్లం) సమర్పించుకున్నారు. జాతరలో రద్దీ పెరిగిన నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను ఆయన స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా తనను కలిసిన మీడియాతో డిజిపి మాట్లాడుతూ.... జాతర చరిత్రలో తొలిసారిగా ప్రవేశపెట్టిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం భద్రతలో కీలక మార్పులు తీసుకొచ్చిందని వివరించారు. 'మేడారం 2.0' పేరుతో అమలు చేస్తున్న 'టీజీ-క్వెస్ట్' కృత్రిమ మేధ ఆధారిత డ్రోన్ పోలీసింగ్ వ్యవస్థ ద్వారా సుమారు 30 చదరపు కిలోమీటర్ల మిగతా 2లో..



## దానం అనర్హతపై ముగిసిన విచారణ

- కౌశిక్ రెడ్డి పిటిషన్ ఆధారంగా క్రాస్ ఎగ్జామిన్
- సమయం కోరిన బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డి
- 18న విచారణకు హాజరు కావాలని గడువు



హైదరాబాద్(జనంసాక్షి): పార్టీ ఫిరాయింపు కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తయ్యింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టారు. దానంపై అనర్హత వేటు వేయాలని పాడి కౌశిక్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి పిటిషన్‌లు దాఖలు చేశారు. ముందుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. దానం తరఫున న్యాయవాదులు కౌశిక్ రెడ్డిని క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. దానంపై పిటిషన్ ఎందుకు వేశారు?.. పార్టీ మారారని చెప్పేందుకు గల ఆధారాలపై పాడి కౌశిక్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తన వద్ద ఉన్న ఆధారాలను స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్ఎస్ నుంచి దానం పోటీ చేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందడం, ఆ తరువాత కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేయడం, దానం ప్రచార ఫొటోలు, వీడియోలు.. దానం కాంగ్రెస్ కండువా వేసుకున్న ఫొటోలను స్పీకర్ ముందు ఉంచారు పాడి కౌశిక్ రెడ్డి. దీంతో స్పీకర్ ఎదుట పాడి కౌశిక్ రెడ్డి విచారణ ముగిసింది. ఇక, దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై సాక్ష్యాలను అఫిడవిట్ రూపంలో దాఖలు చేశారు బీజేఎల్పీ నేత మిగతా 2లో..

## దానంపై అనర్హత వేటు వేయాలి

2లో..

**ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగాలి**
**స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కోరిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి**

మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్లు

## ముగిసిన గడువు

- భారీగా దాఖలు చేసిన అభ్యర్థులు
- సాయంత్రం క్యూలో ఉన్న వారికి అనుమతి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. ఆఖరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్‌ల దాఖలుకు గడువు మగియగా.. అప్పటికే క్యూలైన్‌లలో ఉన్నవారు నామినేషన్‌లు వేసేందుకు అనుమతించారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్‌ల ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు విధించారు. కాగా ఫిబ్రవరి 11న రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ మిగతా 2లో..






## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం

- కామన్ స్కూల్ ఉంటేనే సమాజం ఉమ్మడి కుటుంబంగా ఎదుగుతుంది
- దేశంలో భూసంస్కరణలకు ఆధ్యుడు బూర్గుల రామకృష్ణారావు
- ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ విద్య ఉండాలని మాజీ సీఎం వైయస్ఆర్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

రంగారెడ్డి ప్రతినిధి(జనంసాక్షి):కామన్ స్కూల్ ఉంటేనే సమాజం ఉమ్మడి కుటుంబంగా ఎదుగుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా అల్పాహారం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ ఆలోచన చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజక వర్గంలో మిగతా 2లో..

## ఆటిజం చికిత్సలో స్టెమ్‌సెల్స్ థెరపీ వాడొద్దు

**సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**



న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆటిజం క్లినికల్ చికిత్సకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దీని చికిత్సలో మూలకణ థెరపీని ఉపయోగించడం అనైతికమని, దీన్ని కొనసాగించడం ఉల్లంఘనే అవుతుందని పేర్కొంది. ఆమోదిత, వైద్య పర్యవేక్షణలో చేసే క్లినికల్ ట్రయల్స్ కోసం మాత్రమే ఈ థెరపీని అనుమతించాలని స్పష్టం చేసింది.స్టెమ్ సెల్స్ థెరపీతో ఆటిజం నయమవుతుందని విపరీతంగా ప్రచారం జరుగుతోందని పేర్కొంటూ ముంబయికి చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ఈ చికిత్స మిగతా 9లో..

## నెలసరి పరిశుభ్రత కూడా ప్రాథమిక హక్కే

9లో..

- అన్ని పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచిత శానిటరీ ప్యాడ్స్ అందించాలి
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలు, పాఠశాలలకు సుప్రీం కీలక ఆదేశాలు

క్యూబాకు చమురు విక్రయించారో

## జాగ్రత్త!



- భారీ టారిఫ్‌లు విధిస్తా
- ప్రపంచదేశాలకు ట్రంప్ హెచ్చరికలు
- కెనడాకు మరోసారి బెదిరింపులు

వాషింగ్టన్(జనంసాక్షి): క్యూబా లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ దేశానికి చమురు విక్రయించే ఏ దేశంపైనైనా టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. దీనికి సంబంధిం చిన ఉత్తర్వులపై ఆయన సంతకం కూడా చేశారు. క్యూబా విషయంలో జాతీయ అత్యవసర పరిస్థితి కింద ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ దేశ ప్రభుత్వం అమెరికా జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి తీవ్రమైన ముప్పుగా మారిందని పేర్కొన్నారు. ఈ తాజా ఉత్తర్వులు శుక్రవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానున్నాయి. ట్రంప్ తాజా చర్య మెక్సికోపై ఒత్తిడి పెంచనుంది. క్యూబా ప్రభుత్వం నుంచి దూరం కావాలని దానిపై ట్రంప్ ఒత్తిడి చేస్తున్నారు. ఇటీవల మెక్సికో దేశాధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ మాట్లాడుతూ.. క్యూబాకు చమురు రవాణాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, అమెరికా ఒత్తిడి కారణంగా ఈ నిర్ణయం తీసుకోలేదని ఆమె స్పష్టం చేశారు. అమెరికా- కెనడాల మధ్య సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. కెనడాపై ట్రంప్ మరోసారి టారిఫ్‌ల బెదిరింపులకు పాల్పడ్డారు. అమెరికాలోకి దిగుమతయ్యే కెనడాకు చెందిన విమానాలపై 50శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. జార్జియా కేంద్రంగా పనిచేస్తున్న అమెరికాకు చెందిన గల్ఫ్‌స్ట్రీమ్ ఏరోస్పేస్ జెట్‌లను సర్టిఫై చేసేందుకు కెనడా నిరాకరించిందని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. దీన్ని వెంటనే సరిదిద్దుకోకపోతే.. టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. వీటిపై కెనడా ఇంకా స్పందించలేదు. కాగా.. ఇటీవల చైనాతో ట్రేడ్ డీల్‌పై ముందుకెళ్తే ఆ దేశ దిగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తానని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరోసారి హెచ్చరికలు చేయడం గమనార్హం.



## హార్వర్డ్ వర్సిటీలో సీఎం రేవంత్ వారం రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి

ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. జనవరి 25న ఈ కోర్సు ప్రారంభమవగా జనవరి 30 వరకు అంటే వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ కోర్సులో సీఎం రేవంత్‌తో పాటు 62 మంది కోహోర్ట్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. దాదాపు 20కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు ఇందులో భాగస్వాములయ్యారు. అమెరికాలోని కేంబ్రిడ్జ్‌లో మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ రేవంత్ రెడ్డి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులకు హాజరయ్యారు. కేస్ స్టడీలు, గ్రూప్ డిస్కషన్లు, కన్సల్టేటివ్ వర్క్‌లతో కూడిన ఇంటెన్సివ్ ప్రోగ్రామ్‌లో భాగంగా అధికారం, నాయకత్వం, సంఘర్షణలు, అనిశ్చితి వంటి అంశాలపై శిక్షణ పొందారు. ప్రోగ్రామ్ ముగిసిన సందర్భంగా హార్వర్డ్ అధ్యాపకులు రేవంత్ రెడ్డితో పాటు మిగిలిన 62 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అయితే భారతదేశ చరిత్రలో అధికారంలో ఉండగానే హార్వర్డ్ నుంచి ఈ రకమైన సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రికార్డ్ సృష్టించారు.

## వనదేవతల సన్నిధిలో డీజీపీ ప్రత్యేక పూజలు



మేర ప్రతి అంగుళాన్ని నిశితంగా గమనిస్తున్నామన్నారు. ఈ డ్రోన్లు 'డిజిటల్ బీట్ ఆఫీసర్లు'గా వ్యవహరిస్తూ అటవీ ప్రాంతం, జంపన్న వాగు వంటి ప్రదేశాల నుంచి ఎప్పటికప్పుడు ప్రత్యక్ష సమాచారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా జనసందడిలో పిల్లలు తప్పిపోకుండా ఉండేందుకు ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ రిస్ట్ బ్యాండ్లు మంచి ఫలితాలనిస్తున్నాయని, పాత నేరస్తులను గుర్తించేందుకు ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్, అనుమానాస్పద వస్తువులను పసిగట్టేందుకు ఏఐ అలర్ట్స్ వాడుతున్నామని ఆయన పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం సుమారు 13 వేల మందికి పైగా పోలీస్ సిబ్బంది ఏడు రోజుల పాటు నిరంతరం విధుల్లో ఉంటారని డిజిపి వెల్లడించారు. వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా 2000 ఎకరాల్లో 37 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేసి, వాటిని ఏఎన్పీఆర్ నిఘా వ్యవస్థతో అనుసంధానించామన్నారు. దాదాపు 450 సీసీటీవీల ద్వారా జాతరలోని ప్రతి కదలికను హైదరాబాద్‌లోని రాష్ట్ర కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం 3800 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయని, జాతరలో ఎక్కడ ఏ సమస్య ఎదురైనా తక్షణమే స్పందించేలా 24 గంటల పాటు పోలీస్ హెల్ప్ డెస్కులు అందుబాటులో ఉన్నాయని డిజిపి వివరించారు. ఈ పర్యటనలో మల్టీ జోన్-1 ఐజీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, ములుగు ఎస్పీ కేకన్ సుధీర్ రామ్ నాథ్, మేడారం బందోబస్తు కోసం వచ్చిన ఐపిఎస్ అధికారులు డిజిపి వెంట ఉన్నారు.

## దానం అనర్హతపై ముగిసిన విచారణ

మహేశ్వర్ రెడ్డి. మహేశ్వర్ రెడ్డి తరపు న్యాయవాదులు.. స్పీకర్ ముందు హాజరయ్యారు. దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించేందుకు ఎవిడెన్స్ అఫిడవిట్‌ను పొందుపరిచానని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాను వ్యక్తిగతంగా హాజరుకాలేనని ఆయన తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కావాలంటే సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 20 తరువాత సమయం ఇస్తే తాను విచారణకు వ్యక్తిగతంగా హాజరవుతానని అఫిడవిట్‌లో మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో బీజేపీ పిటిషన్‌పై ఫిబ్రవరి 18న స్పీకర్ విచారించనున్నారు. ఇక, పార్టీ ఫిరాయింపుల కేసు కీలక దశకు చేరుకుంది. ఇప్పటివరకూ పది మంది ఎమ్మెల్యేలపై ఆరోపణలు రాగా.. ఎనిమిది మందికి సంబంధించిన విచారణ పూర్తి అయ్యింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణ జరగాల్సి ఉండగా... దానంను స్పీకర్ విచారించారు. దానం చెప్పే విషయాలను స్పీకర్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. గతంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ సమయంలోనూ ఇదే జరిగింది. విచారణ సమయంలో ఏ పార్టీలో ఉన్నారనే విషయాన్ని ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలను స్పీకర్ ప్రశ్నించగా.. వారంతా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని సమాధానం ఇచ్చారు. ఇక దానం నాగేందర్ కూడా మొన్నటి వరకు తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, అవసరమైతే ఉపఎన్నికకు వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే గత రెండ్రోజులుగా దానం యూటర్న్ తీసుకున్న పరిస్థితి. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, పార్టీకి ఇంకా రాజీనామా చేయలేదని చెప్పుకొచ్చారు. స్పీకర్ తనపై అనర్హత వేటు వేస్తే.. ఉప ఎన్నికకు సిద్ధమని దానం పదేపదే చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

## దానంపై అనర్హత వేటు వేయాలి

హైదరాబాద్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ చేపట్టిన విచారణకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ.. తాను హాజరైనట్లు తెలిపారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరాం. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగాలని విన్నవించాం. భాజపా, కాంగ్రెస్ ఒక్కటే.. వారి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ ఉంది" అని కౌశిక్ రెడ్డి అన్నారు. ఇక గురువారం జరిగిన ఘటనపై స్పీకర్‌కు ప్రివిలేజ్ మోషన్ ఇచ్చినట్లు కౌశిక్‌రెడ్డి తెలిపారు. తన సొంత గ్రామం వీణవంకలో పోలీసులు ఓవరాక్షన్ చేశారని ఆరోపించారు. ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. తనకు న్యాయం జరిగే వరకూ అధికారులను వదిలిపెట్టనని స్పష్టం చేశారు. తనకు న్యాయం జరిగే వరకూ అధికారులను వదిలిపెట్టనని స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా వీణవంకలో నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతరలో దళిత సర్పంచి సరోజను కొబ్బరికాయ కొట్టనివ్వడం లేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి గురువారం రాత్రి నిరసన తెలిపారు. సమ్మక్క గద్దెకు చేరిన తరువాత మొదటి కొబ్బరికాయ తామే కొడతామని ఆయన భీష్మించారు. దళిత మహిళా సర్పంచిని అవమానించిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, భక్తులకు ఇబ్బంది కలుగుతుందని పోలీసులు సర్దిచెప్పినా వినలేదు. దీంతో కౌశిక్‌రెడ్డితోపాటు ఆయన సతీమణిని బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది.

# చుక్క నీరూ వదులుకోం

చుక్క నీరు కూడా వదులుకోదని.. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాడుతున్నట్లు వివరించారు. నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమేనని అన్నారు. దిల్లీ సమావేశం గురించి మాజీమంత్రి హరీశ్ రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని ఉత్తమ్ సూచించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం 60, 70 టీఎంసీలను మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించారని.. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. ఆదిత్యనాథ్ దాస్ గురించి పదేపదే మాట్లాడడం తగదన్న ఆయన... తెలంగాణ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నందుకే ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నట్లు వివరించారు. కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం దాదాపు రెండు గంటల ఈ భేటీ సాగింది. ఈ అంశంపై తెలంగాణ



ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి 12 అంశాలు చర్చించాలని ప్రతిపాదించామన్నారు. పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టొద్దని స్పష్టం చేసినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య పలు జల వివాదాలు ఉన్నాయి.. కృష్ణా, గోదావరి జలాలపై అనేక అంశాలు ఉన్నాయి, అందుకే సమావేశానికి వచ్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీ తన అజెండాను చెప్పలేదని.. తదుపరి సమావేశం సీడబ్ల్యూసీ నిర్ణయిస్తుందన్నారు. అనంతరం.. ఈ అంశంపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. 'ఒక్క చుక్క నీరు కూడా వదులుకోం. ఢిల్లీలో జరిగిన మీటింగ్ గురించి హరీష్ రావు తెలుసుకుని మాట్లాడాలి.. మన నది జలాలను కాపాడుకోవడానికి ఎవరితోనైనా చర్చలకు సిద్ధం.. కానీ చుక్క నీరు కూడా వదులుకునేది లేదు.. తెలంగాణ అధికారులు.. నల్లమల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టడానికి ఒప్పుకోమని స్పష్టం చేశారు.. ఇంటర్ స్టేట్ ఇష్యూలు అజెండాలో పెట్టాలని కేంద్రానికి చెప్పారు. పోలవరం.. నల్లమల సాగర్ కి అనుమతి లేదని కేంద్ర మంత్రి నాకు లేఖ రాశారు.. ఇవాళ జరిగిన మీటింగ్ లో కూడా సీడబ్ల్యూసీ ఇదే చెప్పింది.. పదేళ్లు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి కట్టిన ప్రాజెక్టు కూలింది.. ఆ నాయకులు సిగ్గుపడాలి.. పదేళ్లలో ఎస్ఎల్‌బిసి పూర్తి చేయలేదు.. డిండి ప్రాజెక్టు పూర్తి చేయలేదు.. పదే పదే అబద్దాలు చెప్పి? నిజం చేయాలని అనుకుంటున్నారు.. పదేళ్ల లో కంటే ఈ రెండేళ్లలో ఎక్కువ నీటి వినియోగం, వరి దిగుబడి వచ్చిందని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

## తెలంగాణ నీళ్లను ఏపీకి తీసుకువెళ్లే కుట్ర

దోస్తీ కోసం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డిని తెలంగాణ సమాజం క్షమించదని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి హరీష్‌రావు మాట్లాడారు. కేసీఆర్ హయాంలో కేంద్రానికి 10 డీపీఆర్‌లు పంపి ఏడు ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ఒక్క అనుమతి కూడా తేలేదని ఎద్దేవా చేశారు. 'ఢిల్లీ మీటింగ్‌కు వెళ్లేందుకు ఆదిత్యనాథ్ మినహా తెలంగాణ సోయి కలిగిన ఒక్క ఇంజినీర్ దొరకలేదా..?' అని హరీష్‌రావు ప్రశ్నించారు. మన తెలంగాణ నీళ్లను ఏపీకి తీసుకువెళ్లే కుట్ర ఇది. తెలంగాణ సోయి ఉన్న ఒక్క ఇంజినీర్ దొరకలేదా..? దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు చేస్తున్నారు. పోనుపోను అంటూనే మీటింగ్‌లకు అటెండ్ కావడం ఏమిటి..? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పజెప్పడమే మీ చర్చల లక్ష్యమా..?' అని ప్రశ్నించారు. సమైక్య పాలనలో మనకు నీటి వాటాల్లో తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ.. నేడు మరో చారిత్రక ద్రోహం చేస్తున్నదని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. ఇవాళ్టి ఇరిగేషన్ మీటింగ్ ద్వారా రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు తెలంగాణకు మరణశాసనం రాయబోతున్నదని చెప్పారు. పోలవరం నల్లమలసాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తున్నది. ఆ కుట్రల తీరును ఒకసారి గమనించండి. పోను పోను అనుకుంటూనే ÷శివంత్ రెడ్డి నాడు ఢిల్లీ మీటింగ్‌కు వెళ్ళాడు. ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపాడు. పెట్టబోను అంటూనే సంతకంపెట్టి తెలంగాణ నదీ జలాల హక్కులను కాలరాశాడు. వేయను అంటూనే కమిటీవేసి ఏపీ జలదోపిడీకి రెడ్ కార్పెట్ వేశాడు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీంకోర్టుకు వెళ్ళి నల్లమలసాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపాడు. పసలేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమలసాగర్‌కు మద్దతు ప్రకటించాడు' అని రేవంత్ కుట్రలను వెల్లడించాడు. చంద్రబాబుకు రేవంత్ గురుదక్షిణ చెల్లిస్తున్నడు. ఏపీ ఒత్తిడితో ఇవాళ జరుగుతున్న ఢిల్లీ మీటింగ్‌లో ఇంజినీర్లు పాల్గొంటున్నారు. ఇది పేరుకు జలవివాదాల మీటింగ్ కానీ, మన 200 టీఎంసీల నీటిని గంపగుత్తగా తరలించుకుపోయే నల్లమలసాగర్ అనే ప్రాజెక్టుకు సంబంధించిన కుట్ర. ఇలాగే గతంలో కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన సమావేశంలో ఏపీ ఈ ప్రాజెక్టునే ఏకైక ఎజెండాగా ముందుపెట్టింది. ఇప్పుడు కూడా ఏపీ పాలకులు నల్లమలసాగర్ లింకు ప్రాజెక్టునే తెరమీదకు తెచ్చి చర్చ చేస్తున్నరు' అని హరీష్‌రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో గోదావరిలో 400 టీఎంసీలకు కేంద్రం నుంచి అనుమతులు తెచ్చారు. గోదావరి మీద 10 డీపీఆర్‌లు పంపి.. 7 ప్రాజెక్టులకు అనుమతులు సాధించారు. రెండేళ్లలో ఒక్క డీపీఆర్ పంపింది లేదు. ఒక్క అనుమతి తెచ్చింది లేదు. వార్ధా, కాళేశ్వరం మూడు టీఎంసీలకు సగం అనుమతులు వస్తే, పూర్తి చేయకుండా డీపీఆర్‌లు వాపస్ చేసింది. రేవంత్‌రెడ్డి పాలనలో డీపీఆర్‌లు వాపస్ వచ్చిన పరిస్థితి. నువు మన డీపీఆర్‌లు వాపస్ తెచ్చుకుంటవు, నల్లమలసాగర్‌కు జెండా ఊపుతవు. అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డీ నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు' అని హరీష్‌రావు వ్యాఖ్యానించారు.

## అజెండా అంశాలు ఖరారయ్యాకే తదుపరి భేటీ

కోరింది. ట్రైబ్యునల్ తీర్పు వచ్చే వర కు 50 శాతం వాడుకునే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ అధికారులు లేవనెత్తిన పలు అంశాలపై ఏపీ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. వారంలోగా అజెండా అం శాలు ఖరారు చేసి లిఖితపూర్వ కంగా ఇవ్వాలని సీడబ్ల్యూసీ ఛైర్మన్ తెలిపారు. అజెండా అంశాలు ఖరారయ్యాక భేటీ తేదీని ఖరారు చేస్తామని ఛైర్మన్ స్పష్టం చేశారు.

## తెలంగాణ టెట్ ప్రాథమిక 'కీ' విడుదల..

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ టెట్ ప్రాథమిక 'కీ' విడుదలైంది. టెట్ 2026 జనవరి కీ, రెస్పాన్స్ షీట్‌లను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఈ నెల 3 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. టెట్ 'కీ'పై అభ్యంతరాలను నేటి నుంచి ఫిబ్రవరి 1న సాయంత్రం 5గంటల వరకు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. తెలంగాణ టెట్ పేపర్ 1, పేపర్ 2కు కలిపి దాదాపు 2.37లక్షల దరఖాస్తులు రాగా.. వీటిలో 71,670మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఉన్నారు. మరిన్ని వివరాలను టెట్ అధికారిక వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

## కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు

వినతిపై న్యాయనిపుణులతో చర్చించిన సిట్ ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అలాగే ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3గంటలకు బంజారాహిల్స్ నందినగర్లోని కేసీఆర్ నివాసంలో విచారిస్తామని నోటీసు జారీ చేసింది. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు.

**నోటీసులపై బిఆర్ఎస్ నిరసన**



మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వడంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ లక్ష్మీదేవిపల్లి శ్రేణులు భగ్గుమన్నాయి. పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపుమేరకు లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు అధ్యక్షతన పార్టీ శ్రేణులు శుక్రవారం కండ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్‌కు సిట్ నోటీసులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బూటకపు కేసులు, విచారణలు పక్కనపెట్టి ముందు రాష్ట్ర అభివృద్ధి పనులపై దృష్టి సాధించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షుడు ఇగ్బాల్ పాషా, ప్రశాంతి నగర్ ఉప సర్పంచ్ ఎర్రబడి శ్రీను, శ్రీకాంత్ నాయక్, మాజీ సర్పంచులు తాడూరి రజాక్, కోరం చంద్రశేఖర్, పొదిలి వెంకటాచలం, బీఆర్ఎస్ మండల నాయకులు రాజావరపు మురళి, కల్లుగడ్డ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు కౌశిక్‌రెడ్డి క్షమాపణలు

పాడి కౌశిక్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి గురువారం రాత్రి నిరసన తెలిపారు. సమ్మక్క గద్దెకు చేరిన తరువాత మొదటి కొబ్బరికాయ తామే కొడతామని ఆయన భీష్మించారు. దళిత మహిళా సర్పంచిని అవమానించిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని, భక్తులకు ఇబ్బంది కలుగుతుందని పోలీసులు సర్దిచెప్పినా వినలేదు. దీంతో కౌశిక్‌రెడ్డితోపాటు ఆయన సతీమణిని బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులను గద్దెల వద్దకు రానివ్వకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని, కరీంనగర్ సీపీ గౌష్ ఆలం మెడలు పట్టి వెళ్లగొడుతున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో తమ ప్రభుత్వం రాగానే ఇలాంటి వారి అంతుచూస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు ఆయనను సైదాపూర్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అంతకుముందు కూడా హుజూరాబాద్ నుంచి వీణవంకకు బయలుదేరిన కౌశిక్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. జాతర నిర్వహణపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో పరిమిత వాహనాలనే అనుమతిస్తామని చెప్పడంతో ఆయన వాగ్వాదానికి దిగారు. అనంతరం భార్య, కుమార్తెతో కలిసి వరంగల్-కరీంనగర్ రహదారిపై బైఠాయించారు. తన స్వగ్రామానికి వెళ్లడాన్ని ఎలా అడ్డుకుంటారని ప్రశ్నించారు. పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో పోలీసులు నాలుగు వాహనాలకు అనుమతివ్వగా.. కౌశిక్‌రెడ్డి వీణవంకకు తరలివెళ్లారు. విద్వేషాలు ప్రేరేపించే విధంగా వ్యాఖ్యలు, అనుమతులు లేకుండా ఆందోళన చేయడంపై పలు సెక్షన్ల కింద కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ టి.కరుణాకర్ తెలిపారు.

ఐపీఎస్ అధికారిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఎవరినీ ఉద్దేశ్యపూర్వకంగా అన్న మాటలు కాదు.. మనోభావాలు దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నాను. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్బలంతో నాపై, నా కుటుంబం పై రాజకీయ కక్షకు తెగబడ్డారు. పోలీసులు, అధికారులు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. కానీ కొందరు.. మేము సమ్మక్క జాతరకు వెళ్తున్న క్రమంలో అడ్డుకొని, తీవ్ర ఒత్తిడికి గురి చేశారు. ఆ ఫ్రస్టేషన్, ఒత్తిడిలో తెలియకుండా నోరు జారాను. అంతే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా అన్న మాటలు కావు. నా మాటలతో ఎవరివైనా మనోభావాలు దెబ్బతింటే వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఈ విషయంలో కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని అందరిని వేడుకుంటున్నాను.' అని అభ్యర్థిస్తూ కౌశిక్ రెడ్డి వీడియో విడుదల చేశారు. గురువారం నాడు వీణవంకలోని స్థానిక సమ్మక్క సారలమ్మ జాతరకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఆ సమయంలో పోలీసులకు, కౌశిక్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన కౌశిక్ రెడ్డి.. ఐపీఎస్ అధికారిని మతం పేరుతో దూషించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం.. కౌశిక్ రెడ్డి తీరును తీవ్రంగా ఖండించింది.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం

అల్పాహార పథకం పైలెట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే ప్రారంభించామని వివరించారు. మా సంకల్పం గొప్పది ఆర్థిక పరిస్థితులు అనుకూలిస్తే, అన్ని వనరులు సమకూరితే తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకం ప్రవేశపెడతామని తెలిపారు. ఎదిగే వయసులో పిల్లలకు సరైన ఆహారం లేక పరిపూర్ణంగా ఎదగలేక పోతున్నారనే ఆలోచనతో ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేస్తుందని తెలిపారు. కామన్ స్కూల్ విధానం ఉంటేనే సమాజం ఉమ్మడి కుటుంబం గా ఎదుగుతుంది చిన్ననాటి నుంచే అందరం కలిసిపోయాం అనే భావన కులం, మతం, ధనిక , పేద తేడా లేదన్న నిర్మాణాత్మక ఆలోచన సమాజంలో పెరుగుతుందనే ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిసారి ఒక్కో పాఠశాలను 25 ఎకరాలు విస్తీర్ణంలో 200 కోట్ల బడ్జెట్ తో రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజక వర్గాల్లో 20వేల కోట్లు వెచ్చిస్తూ ఒకేసారి నిర్మాణాలు ప్రారంభించామని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడాలంటే గొప్ప మానవ వనరులు ఉండాలి, మానవ వనరులకు సానపడితేనే రాష్ట్రం ఆర్థికంగా బలపడుతుంది అందుకు కావలసింది ఉచితంగా అందరికీ విద్య, వైద్యం ప్రజా ప్రభుత్వం ప్రధానంగా ఈ రెండు అంశాలపైనే దృష్టి సారించి ముందుకు పోతుందని అన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే పాఠశాల నిర్వాహకులు పిలవగానే గత సంవత్సరం జనవరి మాసంలో సీఎం రేవంత్ రెడ్డి మొగిలిగిద్ద పాఠశాలకు వచ్చి పది కోట్లు కేటాయించారని వివరించారు. ఆ నిధులతో పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గత పాలకులు ఐటీలను అనాధలుగా వదిలేస్తే మారిన కాలానికి అనుగుణంగా వాటిలో శిక్షణ ఇవ్వాలని, ఆధునిక యంత్ర పరికరాలను తీసుకువచ్చి ప్రస్తుతం మార్కెట్లో ఉన్న పారిశ్రామికవేత్తలను తీసుకువచ్చి ఉపాధి పొందేందుకు అవసరమైన సిలబస్ను రూపొందించామని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోని ఐటిఐలను అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 15 రోజుల వ్యవధిలోనే అధికారులతో నివేదిక తెప్పించుకొని డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామని తెలిపారు. హైదరాబాద్ చుట్టూ ఆధునిక ఆసుపత్రుల నిర్మాణం జరుగుతుంది, జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికరించామని వివరించారు. రాష్ట్రంలోని మహిళలందరికీ నాణ్యమైన చీరలు ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి పంపిణీ చేస్తున్నాం వారిని మహాలక్ష్ములుగా గౌరవిస్తున్నామని తెలిపారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నాం మొదటి సంవత్సరం 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామంటే అంతా నవ్వారు కానీ మేం పట్టుదలతో మొదటి ఏడాది 26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలకు సంబంధించిన చెక్కులను మహిళా సంఘాలకు పంపిణీ చేసి ఇది సాధ్యమని నిరూపించినట్లు వివరించారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు ఈ తరానికి తెలిసి ఉండకపోవచ్చు ఈ దేశంలో భూ సంస్కరణలకు ఆద్యుడు బూర్గుల రామకృష్ణారావు అని వివరించారు. దివంగత ముఖ్యమంత్రులు బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి తో పాటు ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ సత్యనారాయణ రెడ్డి, ప్రముఖ ప్రొఫెసర్ హ రగోపాల్ వంటి అనేకమంది ప్రముఖులను మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల దేశానికి సమాజానికి అందించిందని తెలిపారు. రాజు దైవంశ సంభూతుడు అన్న భావన ఒకవైపు, భూమికోసం భుక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం మరోవైపు కొనసాగుతున్న రాష్ట్రంలో గ్రంథాలయ ఉద్యమాలు నడిపించి నిజాం వ్యతిరేక పోరాటం చేసిన గొప్ప నాయకుడు బూర్గుల రామకృష్ణారావు అని తెలిపారు. బూర్గుల మొదట న్యాయవాద వృత్తిని చేపట్టిన తన జీవితం ప్రజల కోసం ఉపయోగపడాలని రాజకీయాల్లోకి వచ్చారని డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ ముఖ్యమంత్రిగా 1950- 54 మధ్యకాలంలో కౌలు గారి చట్టం తీసుకువచ్చి సాగు చేసుకునే వారికి భూమిపై హక్కులు కల్పించి దేశంలో భూసంస్కరణలకు బూర్గుల ఆధ్వర్యంలో నిలిచారని తెలిపారు. జాగిరి దారి వ్యవస్థ, వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించారని తెలిపారు. దేశంలో 1970లో తీసుకువచ్చిన భూ సంస్కరణల చట్టానికి బూర్గుల బాధ్యుడిగా నిలిచారని తెలిపారు. సాయుధ పోరాటం వంటి సమస్యలకు ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కారం చూపిన మహానేత బూర్గుల అని వివరించారు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన మొగిలిగిద్ద పాఠశాల గొప్పది ఈ పాఠశాలలో 1952 వరకు ఉర్దూ మీడియం లో కొనసాగగా, ఆ తరువాత తెలుగు మీడియాను ప్రవేశపెట్టారని వివరించారు. 2008లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ఉండాలని పట్టుబట్టి ప్రవేశపెట్టారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వివరించారు. ప్రభుత్వ



పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడంపై ఆరోజు శాసనమండలిలో చర్చ జరుగుతుండగా నాటి సీఎం వైఎస్ ఆనాడు ఎమ్మెల్సీగా ఉన్న తన వైపు చూసి మాట్లాడవలసిందిగా సూచించారని గుర్తు చేశారు. బిడ్డలు చదువుకుంటే ఉద్యోగాలు, ఉపాధి సాధిస్తారని తల్లిదండ్రులు కూలి నాలి చేసి పంపుతున్నారు తీరా ఉద్యోగం రాకపోతే వారు కూలీలుగా మారిపోతున్నారు ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంగ్లీష్ తప్పనిసరి అయింది, ప్రపంచం కు గ్రామంగా మారింది, ఇంగ్లీష్ ప్రపంచ భాష అది నేర్చుకుంటేనే ఉపాధి భవిష్యత్తు ఉంటుందని ఆనాడు సభలో తన అనుభవాలను వివరించిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ షాద్నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ప్రొఫెసర్ హరగోపాల్ విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ కృష్ణయ్య అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ బండారి సంతోష జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

కస్తూరిబా పాఠశాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం ప్రభాకర్

విద్యార్థినీలతో కలిసి భోజనం, వసతి సౌకర్యాలపై ఆరా రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150 వసంతాల కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ అకస్మాత్తుగా స్థానికంగా ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో, వసతి గృహంలో ఉన్న సౌకర్యాల గురించి విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినీలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యార్థినీలతో మాట్లాడుతూ ఏ క్లాస్ చదువుతున్నారు, పాఠశాల ఎలా ఉంది, భోజన వసతులు ఎలా ఉన్నాయి, ఈ లక్ష్యంతో ప్రస్తుతం పాఠశాలలో చదువుకుంటున్నారు, పెద్దయ్యాక ఏం చేయాలనుకుంటున్నారు, ఆ కోరికను సాధించేందుకు ఎలాంటి ప్రణాళికలు మీ వద్ద ఉన్నాయి అంటూ డిప్యూటీ సీఎం విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో బోధన, బోధ నేతర అంశాలపై నిర్వాహకులను ప్రశ్నించి పలు విషయాలు ఆరా తీశారు.

## ముగిసిన నామినేషన్ల గడువు

జరగనుంది. మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 13న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదులకు రాష్ట్ర ఎన్నికల సంఘం 'టీఈ పోల్' మొబైల్ యాప్ ఏర్పాటు చేసింది. వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులకు అవకాశం కల్పించినట్టు ఎస్ఈసీ తెలిపింది. చివరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ గడువు మగియగా.. అప్పటి వరకు క్యూలైన్‌లో ఉన్న వారిని నామినేషన్ వేసేందుకు అనుమతించారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఫిబ్రవరి 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది.అదే రోజు ÷నైల్ అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తుంది ఈసీ. మొత్తం 2,996 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తుండగా.. 8203 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓట్ల కౌంటింగ్ కోసం 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 3 వరకు విత్ డ్రాలు నిర్వహించి అదే రోజు అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో 48 గంటల ముందే ప్రచారం ముగుస్తుంది. అంటే వచ్చే ఫిబ్రవరి 9వ తేదీన ప్రచారం బంద్ అవుతుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY





# హనుమకొండ డిసిసి భవన్‌లో మహాత్మా గాంధీ 78వ వర్ధంతి

- సర్వోదయ చరక సంఘటన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మీనాక్షి నటరాజన్ ..

**హనుమకొండ ప్రతినిధి జనవరి 30 (జనం సాక్షి) :** జాతిపిత మహాత్మా గాంధీ గారి 78వ వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండ డీసీసీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు అయ్యూబ్ , వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , వర్ధన్నపేట శాసన సభ్యులు శ్రీ కే.ఆర్. నాగరాజు పాల్గొన్నారు. తొలుత హనుమకొండ జిల్లాకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ శ మీనాక్షి నటరాజన్ కి వరంగల్ కుడా చైర్మన్, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం డీసీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ సత్యం, అహింస, స్వదేశీ, సర్వోదయం వంటి సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలనే ఉద్దేశంతో చరక అభ్యాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాంధీజీ ఆశయాలకు ప్రతీకగా ఉన్న చరకానికి నూలు వడకడం ద్వారా స్వావలంబన, స్వదేశీ భావన ప్రాముఖ్యతను నాయకులు ప్రజలకు వివరించారు. అనంతరం డీసీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సర్వోదయ చరక సంఘటన్ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ గ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ గాంధీ సైద్ధాంతిక సిద్ధాంత విలువలను తెలిపేదే చరక అని తెలిపారు. ఈ చరక ద్వారా గాంధీ ఆలోచనలను వ్యక్తపరచవచ్చు అని దూది నుంచి నూలు దారాన్ని ఎలా తీస్తామో సమాజంలో ఉన్న సమస్యలను వీడడానికి మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తుంది అని పేర్కొన్నారు. ఈ చరక మనిషిని మనిషిగా ప్రేమ,సత్యాన్ని కలుపుతుంది. ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లాలో జరుపుకోవడం అందులో గాంధీ వర్ధంతి రోజున నిర్వహించడం నాకు చాలా సంతోషంగా అనిపించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం,రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్,టీపీసీసీ ఉపాధ్యక్షులు దుద్దిళ్ల శ్రీనుబాబు,రాష్ట్ర టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , ఇవి శ్రీనివాస్ రావు,మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ రాజేశ్వర్ రావు,జాతీయ కో ఆర్డినేటర్ పులి అనిల్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా పట్టణంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక టిటిడీసీ లో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. కలెక్టర్ తో సాధారణ ఎన్నికల పరిశీలకులు డి.హనుమంత్ నాయక్, కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## బంగారం ధరల్లో ఒడిదుడుకులు

- ఒక్కరోజులోనే 5లక్షల కోట్లకు క్రాష్
- సాయంత్రానికి తిరిగి పుంజుకున్న మార్కెట్

**న్యూఢిల్లీ, జనవరి30 (జనంసాక్షి) :** ప్రస్తుతం ఎక్కడ చూసినా బంగారం, వెండి ధరలపై చర్చ సాగుతోంది. అనూహ్యంగా అడ్డూఅదుపుల లేకుండా పెరుగుతున్న ధరలు ఎందాక పోతాయా అన్న ఆందోళన కనిపిస్తోంది. సామాన్యుల నుంచి బడా ఇన్వెస్టర్లు, వ్యవస్థాగత మదుపర్ల వరకూ అన్ని వర్గాల వారినీ పసిడి ధరల పరుగు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏ రోజు ధర ఎంత పెరుగుతుందో? ఎంత తగ్గుతుందో? అసలు పసిడిపై పెట్టుబడికి ఇది సరైన సమయమో కాదో తెలియక సామాన్యుల తలకిందులవుతున్నారు. అయితే, చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా గురువారం బంగారం మార్కెట్ విలువ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైంది. అంతర్జాతీయ అనిశ్చితులతో గత కొన్ని రోజులుగా అసాధారణంగా పెరుగుతున్న బంగారం ధర.. గురువారం రాత్రి అనూహ్యంగా ఒడుదొడులకు లోనై,గంటల వ్యవధిలో దారుణంగా ఊగిసలాడింది. కేవలం ఒక ట్రేడింగ్ సెషన్‌లోనే పసిడి మార్కెట్ విలువ ఏకంగా 5.5 ట్రిలియన్ డాలర్ల హెచ్చుతగ్గులకు గురైందంటే.. ప్రపంచ కమొడిటీ మార్కెట్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు..! ఒక్క రోజులో బంగారం మార్కెట్ విలువ ఈ స్థాయిలో మార్పులు రావడం చరిత్రలో ఇదే తొలిసారి. ని స్టాక్ మార్కెట్ వ్యవహారాల కామెంటరీ వేదిక 'ది కొబేసీ లెటర్' నెట్టింట పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. ది కొబేసీ లెటర్' చేసిన ట్వీట్ ప్రకారం, గురువారం ఉదయం అమెరికా కాలమానం ప్రకారం 9.30 గంటల నుంచి 10.25 గంటల మధ్య బంగారం మార్కెట్ విలువ ఒక్కసారిగా 3.2 ట్రిలియన్ డాలర్ల మేర పడిపోయింది. ఆ తరువాత క్రమంగా కోలుకుని మార్కెట్స్ క్లోజ్ అయ్యే సమయానికి కనిష్ఠ స్థితి నుంచి 2.3 ట్రిలియన్ డాలర్ల మేర ఎగబాకింది. అంటే.. ఒక్క సెషన్‌లోనే బంగారం మార్కెట్ క్యాపిటలైజేషన్ హెచ్చుతగ్గుల విలువ 5.5 ట్రిలియన్ డాలర్లను చేరింది.

బంగారానికి ఉన్న వాస్తవ డిమాండ్‌కు మించి ధరల్లో ప్రస్తుతం హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. భౌగోళిక అనిశ్చితులు, డాలర్ బలహీనత, అమెరికా వడ్డీ రేట్లపై అనిశ్చితి వంటి వాటితో పాటు ఇతర కీలక అంశాలు ధరలను ప్రభావితం చేస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా వ్యవస్థాగత మదుపర్లు కమోడిటీ మార్కెట్స్‌పై దృష్టిపెట్టడం, ఆల్గోరిథమ్-ఆధారిత ట్రేడింగ్ పెరగడం, బంగారం హెచ్చుతగ్గుల ఆధారంగా డెరివేటివ్ మార్కెట్స్‌లో కూడా ట్రేడింగ్ అధికమవడంతో పసిడి ధరలు అంచనాలకు మించి హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. పసిడితో పాటు వెండి, ప్లాటినమ్, పెలాడియం వంటి విలువైన లోహాలన్నీ ఇదే స్థాయిలో ఒడిదుడుకులకు లోనుకావడం కమోడిటీ మార్కెట్స్‌లో ఒత్తిడికి సూచిక అని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. బంగారం ధరలకు ఈ ఏడాది బ్రేకులు ఉండకపో వచ్చని ప్రముఖ కన్‌స్టలెన్సీ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్స్‌లో ఔన్స్ మేలిమి బంగారం ధర 6 వేల డాలర్ల మార్కు దాటొచ్చనేది మెజారిటీ మార్కెట్ విశ్లేషకుల అంచనా. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్యయుద్ధాల నేపథ్యంలో కరెన్సీ స్థిరత్వంపై ఆందోళనలు, ద్రవ్యోల్బణ భయాలు, వడ్డీరేట్లపై అస్పష్టత వంటి అనేక కారణాలతో ఈ మధ్య మదుపర్లు బంగారం, వెండి లోహాల్లో పెట్టుబడులను సురక్షిత సాధనంగా భావించారు. దీంతో వీటి ధరలకు రెక్కలొచ్చాయి. అయితే, గరిష్ఠాల వద్ద సంస్థాగత మదుపర్లు లాభాల స్వీకం ణకు మొగ్గుచూపడంతో గురువారం వీటి విలువ ఒక్కసారిగా తగ్గింది. దీనికితోడు కంప్యూటర్ ఆధారిత ఆటోమెటిక్ అల్గారిథమ్ ట్రేడింగ్ కూడా ధరల కదలికలను తీవ్రంగా ప్రభావితం చేసిందని మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు.

# గద్దెల మీద ఇద్దరమ్మలు

- మొక్కులు చెల్లించుకునేందుకు భక్తుల క్యూలైన్లు



**వరంగల్, ములుగు బ్యూరోలు, జనవరి 30 (జనం సాక్షి) :** మేడారం మహాజాతరలో అత్యంత కీలకమైన ఘట్టం బుధవారం భక్తిశ్రద్ధల నడుమ ఆవిష్కృతమైంది. వనం నుంచి జనంలోకి సమ్మక్క, సారలమ్మ తల్లుల ఆగమనం మేడారం పరిసరాలను ఆధ్యాత్మిక కాంతితో నింపింది. గద్దె కేవలం వేదిక కాదు. దేవతల సాక్షాత్కారానికి ప్రతీకగా నిలిచే పవిత్ర స్థలంగా భక్తుల విశ్వాసాల్లో స్థానం సంపాదించింది. ఈ స్థలంలో తల్లులు కొలువుదీరిన క్షణాలు లక్షలాది భక్తుల హృదయాల్లో పులకరింపజేశాయి. జాతర తొలి రోజు బుధవారం గిరిజన సంప్రదాయాల ప్రకారం వంశపారంపర్య పూజారులు ప్రత్యేక ఆచారాలు నిర్వహించారు. భక్తుల కోలాహలం, వాయిద్యాల మ్రోగుడు మధ్య కన్నెపల్లి నుంచి కుంకుమభరిణ రూపంలో సారలమ్మ తల్లిని అడవి మార్గంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ యాత్రంతా సంప్రదాయ నృత్యాలు, డప్పుల మోగుడు, గిరిజనుల హర్షధ్వానాలతో కొనసాగింది. సారలమ్మ తల్లితో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు మేడారం గద్దెలపైకి చేరుకోవడంతో జాతర తొలి ఘట్టం సంపూర్ణమైంది.

మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా రెండవ రోజు గురువారం రాత్రి నిండు వెన్నెలలో మరో దివ్య ఘట్టం ఆవిష్కృతమైంది. మూడంచల భద్రత నడుమ ఆనవాయితీ ప్రకారం ఎస్పీ గాల్లోకి తుపాకీ కాల్పులు జరిపారు. ఆ సంకేతంతో చిలుకలగుట్ట నుంచి సమ్మక్క అమ్మవారు అగ్నివర్ణ కుంకుమ రూపంలో, పవిత్ర చిహ్నాలతో గద్దెలపైకి ఆవిర్భవించారు. ఈ దృశ్యాన్ని వీక్షించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అడవుల తల్లి జనంలోకి అడుగుపెట్టిన వేళ మేడారం ప్రాంతమంతా జై సమ్మక్క, జై సారలమ్మ నినాదాలతో మార్మోగింది. సమ్మక్క, సారలమ్మ తల్లులు గద్దెలపైకి చేరుకోవడంతో జాతర భక్త జనసందోహంగా మారింది. ఈ ఘట్టాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు బారులు తీరారు. గద్దెల వద్దకు చేరుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. బెల్లం, బంగారం, కొబ్బరికాయలు సమర్పిస్తూ తమ భక్తిని చాటుకున్నారు. మేడారం అంతటా ఆధ్యాత్మిక వాతావరణం పరవళ్లు తొక్కింది. గురువారం రాత్రి 10 గంటలకు సమ్మక్క తల్లి గద్దలపై కొలువుదీరిన వేళ ఒక్కసారిగా భక్తుల రద్దీ ఉద్ధృతమైంది. సాయంత్రం 4 గంటల నుంచే సమ్మక్క దర్శనం కోసం ఎదురుచూసిన భక్తులు రాత్రి 10 గంటలకు తల్లి దర్శనం పొందారు. ఆ క్షణాలు భక్తుల జీవితాల్లో మరపురాని అనుభూతిగా నిలిచాయి. తల్లికి మొక్కులు చెల్లిస్తూ తమ కోరికలు విన్నవించుకున్నారు. ఇప్పటికే రెండు కోట్ల మందికి పైగా భక్తులు సమ్మక్క-సారలమ్మ దర్శనం చేసుకున్నట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మేడారం మహాజాతర మరోసారి గిరిజన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని దేశానికి చాటుతూ విశ్వవిఖ్యాత పుణ్యక్షేత్రంగా నిలిచింది. పలువురు రాజకీయ నాయకులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

శనివారం సాయంత్రం అమ్మవార్లు వన ప్రవేశం శేషంత వరకు జాతర కిటకిటలాడే అవకాశం ఉంది. ఇప్పటికే సుమారు పది కిలోమీటర్ల మేర ఎటు చూసినా జన సమూహమే కనబడుతుంది. జాతరలో ఎక్కువగా కోళ్లు గొర్రెలు, లిక్కర్, కొబ్బరికాయలు అమ్మవార్లకు సమర్పించే బంగారం( బెల్లం) విపరీతంగా గోలి చేస్తున్నట్లు వ్యాపారస్తులు వాపోతున్నారు. ఏది ఏమైనా మేడారం సమ్మక్క సారలమ్మ జాతర రాష్ట్ర ప్రజలతో పాటు భారత దేశంలోని వివిధ ప్రాంతాల నుండి గిరిజనులతో పాటు ఇతరులు కూడా పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకుంటున్నారు. భారతదేశంలో ఉండే కాకుండా ఇతర దేశ అమెరికా యూరప్ కెనడా ప్రాంతాల నుండి కూడా వచ్చే అమ్మవార్లను దర్శించుకున్నారు. ఏది ఏమైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. గతంలో ఎన్నడు లేనంతగా ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. పారిశుద్ధ్యం వైద్య పోలీసు వ్యవస్థ కమ్యూనికేషన్ సిస్టం ఎప్పటికప్పుడు సమర్థవంతంగా జరిగింది. కాబట్టి ప్రజలకు ఎలాంటి ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు అని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే చాలామంది ప్రజలు అమ్మవార్లను దర్శించుకొని తిరుగు ప్రయాణమైనారు. రేపు శనివారం సాయంత్రం వరకు ప్రజలు అమ్మవారిని దర్శించుకోవడానికి రావడం జరుగుతుందని ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంత్రి సీతక్క పొంగులేటి ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులు జాతరలోని మఖం వేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనం ఆర్థిక సర్వే నివేదిక

- దేశానికి తెలంగాణ రాష్ట్రం దిక్సూచిగా నిలుస్తుంది
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకెళ్తోందని కేంద్ర ప్రభుత్వం నిన్న పార్లమెంటు వేదికగా ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే నివేదిక స్పష్టం చేసిందని, ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి పరిపాలన దక్షతకు అద్దం పడుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అనడానికి కేంద్ర ఆర్థిక సర్వే నివేదికనే సాక్ష్యమని అన్నారు. రెండు సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుచూపుతో అనుసరిస్తున్న విధానాలు రాష్ట్ర భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయని చిన్నారెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టి విధానాలు తెలంగాణ రాష్ట్రాన్ని జాతీయస్థాయిలో అగ్ర భాగాన నిలిపేందుకు దోహదం చేస్తాయని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళిక బద్ధంగా రూపొందించిన కార్యాచరణ సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పడానికి కేంద్ర ఆర్థిక సర్వే నిదర్శనమని చిన్నారెడ్డి వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి క్యూర్, ప్యూర్, రేర్ మూడంచెల విధానంతో రాష్ట్ర అభివృద్ధి స్వరూపమే మారిపోతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో నిత్యవసర నిత్యవసర ధరలు అదుపులో ఉన్నాయని, రెండేళ్ల కాలంలో తీసుకొచ్చిన భూభారతి డిజిటల్ ప్లాన్ తో భూ రికార్డులు పక్కాగా ఉంటున్నాయని, గ్రామాలు, పట్టణాల్లో భూవివాదాలు తగ్గాయని, వి హబ్ ద్వారా మహిళలకు ఆర్థిక స్వాలంబన చేకూరుతుందని అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం ఐటి, ఫార్మా, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రంగాల్లో రాష్ట్రం ముందుకు సాగుతుందన్నారు. ఫ్యూచర్ సిటీ రాష్ట్రానికి మరో మైలురాయి అని, పట్టణాలు, గ్రామాలను సమాంతరంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని చిన్నారెడ్డి పేర్కొన్నారు. "తెలంగాణ విజన్ - 2047" తో రాష్ట్ర దిశా దశ మార్చుతుందని, రాష్ట్రాన్ని త్రీ ట్రిలియన్ డాలర్స్ ఎకానమిగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో సీఎం పాలిస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి.. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి సమర్థ పాలన దేశానికి దిక్సూచిగా మారుతుందని చిన్నారెడ్డి వివరించారు.

### సీఎం ప్రజావాణిలో 433 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 433 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 131, రెవెన్యూ శాఖకు సంబంధించి 38, ఇందిరమ్మ ఇండ్ల కోసం 189, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 74 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏ.సీ.పీ. ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సొమ్మసిల్లిన వృద్ధురాలికి చిన్నారెడ్డి అండ

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి వచ్చిన దాసోజు కమలమ్మ (94) వృద్ధురాలు సొమ్మసిల్లీ పడిపోవడంతో సిబ్బంది అంబులెన్సులో నిమ్స్ కు తరలించారు. ఈ సంఘటన పట్ల చలించిపోయిన సీఎం ప్రజావాణి ఇంచార్జి డాక్టర్ జీ. చిన్నారెడ్డి వృద్ధురాలికి సపర్యలు చేసి దగ్గర ఉండి అంబులెన్సులో ఎక్కించి నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పకు ఫోన్ చేసి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. వృద్ధురాలు జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం కళ్లెం గ్రామస్థురాలు. నిమ్స్ లో ఆమె కోలుకున్నారు.





## టీజీవో డైరీ అందజేత

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు ఎం బి కృష్ణ యాదవ్, కార్యదర్శి ఎం.ఎ.ఖాదర్, క్రాంతి వెస్లీ డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డిపార్ట్మెంట్ టిజివో హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ డైరీ 2026ను అందజేశారు. కృష్ణ యాదవ్ మాట్లాడుతూ డైరెక్టర్‌కు డిపార్ట్మెంటు, హైదరాబాద్ జిల్లా పక్షాన 27 మందికి ట్రైనింగ్ ఆఫీసర్లుగా ప్రమోషన్ ఇచ్చినందుకు కృతజ్ఞత వందనాలు తెలియజేశారు..

## అమెరికాలో ఎన్టీఆర్ జిల్లా యువకుడు మృతి

**విజయవాడ, జనవరి 30 (జనంసాక్షి) :** ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన సూరపనేని గిరిధర్ వంశీ కృష్ణ(36) అమెరికాలో గుండె పోటుతో మృతి చెందారు. పదేళ్ల కిందట చదువుకోవడానికి అమెరికా వెళ్లి అక్కడే ఉంటున్నారు. కొన్నాళ్ల పాటు అమెరికాలో హోటల్ నిర్వహించారు. ప్రస్తుతం అక్కడే ఉద్యోగం చేస్తున్నారు. తల్లిదండ్రులు సూరపనేని నరేంద్ర, రత్నకుమారి గొల్లపూడిలోనే ఉంటున్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో వంశీకృష్ణ చనిపోయినట్లు సన్నిహితుల ద్వారా తల్లిదండ్రులకు గురువారం రాత్రి తెలిసింది. కుమారుడి భౌతికకాయాన్ని తానా సభ్యుల ద్వారా స్వగ్రామానికి రప్పించేందుకు ప్రయత్నం చేశారు. పది రోజులకు పైగా సమయం పట్టే అవకాశం ఉండటంతో అమెరికాలోనే అంత్యక్రియలు నిర్వహించేందుకు గొల్లపూడి నుంచి తల్లిదండ్రులు బయలుదేరి వెళ్లారు.

# మున్సిపాలిటీలో ముగిసిన నామినేషన్ల ఘట్టం

- 3న అభ్యర్థుల ఉపసంహరణ, 11న పోలింగ్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మున్సిపాలిటీలో అభ్యర్థులు రిటర్నింగ్ అధికారుల వద్ద తమ నామినేషన్లు దాఖలు చేయగా, సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయం లోపల ఉన్న అభ్యర్థుల పత్రాలను అధికారులు స్వీకరించారు. ఈ దశ ముగియడంతో ఎన్నికల ప్రక్రియ ఇక కీలక మలుపుగా తిరిగింది. నామినేషన్ల స్వీకరణ ప్రారంభం రోజు మొదటిరోజు 4 నామినేషన్లు దాఖలు కాగా, 2వ రోజు 20 నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా శుక్రవారం చివరిరోజు కావడంతో వందమందికి పైగా అభ్యర్థులు నామినేషన్లు వేశారు. రాత్రి 9గంటల 20నిమిషాల సమయం దాటినా సంబంధిత మున్సిపల్ నామినేషన్ల వివరాలు మీడియాకు తెలియజేయకపోవడం వారి పని తనానికి అద్దం పడుతుంది. దీంతో మున్సిపాలిటీలోని 30వార్డుల్లో ఏ వార్డులో ఎన్ని నామినేషన్లు పడ్డాయో వివరాలు తెలియకుండా పోయాయి.

### నేడు నామినేషన్ల పరిశీలన..

నామినేషన్ల పరిశీలన శనివారం జరగనుంది. ఈ సందర్భంగా నామినేషన్ తిరస్కరణకు గురైన అభ్యర్థులకు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. ఫిబ్రవరి 1న అప్పీళ్లు స్వీకరించగా, వాటిపై ఫిబ్రవరి 2న అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు. అభ్యర్థుల ఉపసంహరణకు ఫిబ్రవరి 3 చివరి తేదీగా నిర్ణయించారు. అదే రోజు రిటర్నింగ్ అధికారులు తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. దీంతో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై పూర్తి స్పష్టత రానుంది.

### 30 వార్డులకు 11న పోలింగ్..

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 11న జరగనుండగా, ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 13న నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు జిల్లాలోని మున్సిపల్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపనున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పట్టణ పాలన దిశను నిర్దేశించే కీలక ఎన్నికలుగా వీటిని రాజకీయ పక్షాలు చూస్తున్నాయి.

### మున్సిపాలిటీలో ఓటర్ల వివరాలు..

భూపాలపల్లి మున్సిపాలిటీలో మొత్తం 52,726 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో 25,936 మంది మహిళా ఓటర్లు, 26,786 మంది పురుషులు, 4గురు ఇతర ఓటర్లు ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో పురుషులతో ఇంచుమించు సమానంగా మహిళా ఓటర్లు ఉండడం, అంతే సమానంగా మహిళా కౌన్సిలర్లుగా రిజర్వేషన్లు ఉండడం విశేషం.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
31 జనవరి 2026

# మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి నుంచి..

## 'జనంసాక్షి' ప్రశ్నలకు దొరకని సమాధానాలు



**ఇటీవల సేకరించిన ప్రశ్నలకు సమాధానంగా జనంసాక్షికి మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ నుంచి లిఖితపూర్వక సమాధానాలు వచ్చాయి. అయితే అందులో కొన్నింటిని మినహాయించి మిగతావాటికి అభయ్ నుంచి వివరణాత్మకంగా సమాధానా లు అందాయి. సమయాభావమో, ఇంకేదైనా కారణమో తెలియదుగానీ.. అభయ్ నుంచి సమాధానాలు అందని మరికొన్ని ప్రశ్నలివీ..!**

- స్టాండింగ్ ఆర్మీ ఎల్టీటీఈ, గెరిల్లా ఆర్మీ పిఎల్జి (మావోయిస్టు పార్టీ).. మీరూ ఎల్టీటీఈ స్థాయిలోనే నష్టపోయారు కదా ..?
- మీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్, మరో అగ్ర నేత ఆశన్నలు వందలమంది విప్లవ కారులు, ఆయుధాలతో లొంగిపోవడాన్ని మీరెలా చూస్తారు..?
- మిగిలిన కేంద్రకమిటీ లీగల్ గా మారి, తెలంగాణ రాష్ట్రానికి వచ్చి తిరిగి ప్రజల్లో పనిచేసుకునే అవకాశాలు ఉన్నాయా ?
- ఇంత ఆధునికత సంతరించిన తరువాత అజ్ఞాతంలో ఉండి సాయుధ పోరాటం చేయడం వీలవుతుందా?
- 60 ఏళ్లుగా మరీ ముఖ్యంగా 45 ఏళ్లుగా పోరాట క్షేత్రంలోనే ఉన్న నాయకత్వాన్ని దాదాపుగా మీరు కోల్పోయారు. పార్టీ భవిష్యత్తు పరిణామాలపై ముందు చూపు లేకపోవడం వల్లనే ఇలా జరిగిందనుకోవచ్చు?
- మీపై నిషేదం ప్రకటించి దొరికిన అగ్ర నాయకుల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపడేసి, దానికి పోలీసు పరిభాషలో ఎన్కౌంటర్ పేరుతో సమాజం ఆమోదం రాజ్యం తీసుకున్నట్టు కనపడటం లేదా ?
- విలువైన ప్రాణాలను కాపాడుకోవడం కోసం, ప్రజలకు నాయకత్వం వహించడం కోసం, ప్రజా సమస్యలపై పోరాడటం కోసం ఇతరత్రా మార్గాలేమి లేవా ?
- మారిన పరిస్థితులలో సాయుధ పోరాటం పనికిరాదని చెబుతున్న ఆశాన్న, వేణుగోపాల్ లకు మీరేం చెబుతారు?
- పోలీసుల ముందు లొంగిపోయి, పార్టీపై విశ్వాసం ప్రకటించిన పుల్లూరి ప్రసాద రావు, బండి ప్రకాశ్ లపై పార్టీ అభిప్రాయం ఏమిటి ?
- ఉత్తర తెలంగాణలో ఉవ్వెత్తున పోరాటాలు నిర్వహించి, 1991 లో వరంగల్లో 15 లక్షల మందితో రైతుకూలి మహాసభలు నిర్వహించిన మీరు ఎందుకు తెలంగాణ ఖాళీ చేయాల్సి వచ్చింది?
- తెలుగు రాష్ట్రాల నుంచి మీరు వెళ్లిపోవల్సి రావడం ఉద్యమ తిరోగమనంగా భావించవచ్చా?
- దండకారణ్యంలో నిర్దిష్టంగా జనతన సర్కార్ కావొచ్చు, ఇతరత్రా కావొచ్చు ఏం సాధించారంటే మీరేం చెప్తారు ?
- ఆయుధంతో సాయుధంగా మిమ్మల్ని మీరు రక్షించుకోవడం కోసమే పెద్ద పోరాటంగా కనిపిస్తుంది. ప్రజలని సమీకరించి ఏం ఉద్యమిస్తారు?
- సమాజంలో ప్రజలు దైనందిన సమస్యల్లో కొట్టుమిడుతూ నాయకత్వం లేక బేలగా ఎదురుచూస్తున్న రోజుల్లో.. క్రియాశీలకంగా ప్రజలకు నాయకత్వం వహించి ప్రజల్ని పోరాటలవైపు మళ్లించగలిగిన మీ నాయకత్వం కేవలం అటవీ ప్రాంతాలకే పరిమితం కావడంపై మీరెప్పుడు సమీక్షించుకోలేదా?
- కేంద్ర కమిటీ సభ్యులు సత్యనారాయణరెడ్డి, రామచంద్ర రెడ్డి, మోడం బాలకృష్ణ, గణేష్ తదితరులు అలవోకగా చిక్కి ఎన్కౌంటర్లలో చనిపోయారు. వీరు చిక్కడం వెనుక మిమ్మలని విభేదించిన వారి హస్తం ఉన్నట్టుగా భావిస్తున్నారా ?
- ఇంకా సాయుధ పంథాలోనే కొనసాగితే మిగిలిన అతికొద్ది మంది నాయకత్వాన్ని కూడా కోల్పోతామనే భయం మీకు లేదా ?
- మీ పార్టీ కేంద్రకమిటీ కార్యదర్శి నంబల కేశవరావు బతికుండగానే సాయుధ పోరాట విరమణ చేయాలని భావించినట్టుగా ఆశన్న, మల్లోజుల ప్రకటనపై మీరేమంటారు?
- రష్యా విప్లవంలో సహకార వ్యవస్థ, సహకార సంఘాలు ఏర్పాటు ప్రధానంగా ఉండేది. ముల్కనూర్ లో ఏర్పాటయిన ఓ సహకార సంఘం ఆసియా ఖండంలోనే అతిపెద్ద సంఘంగా వెలిసింది. అలాంటి ప్రయత్నాలు మీరెందుకు చేయలేదు?
- దీర్ఘకాలిక సాయుధ పోరాటం ద్వారా విప్లవం ఎప్పుడో విజయవంతమవుతుందని.. అందాక చెప్పే మీరు ప్రజలను ఆర్థిక పోరాటాల వైపు మళ్లించడంలో మీరు విఫలమైనట్టుగా భావించకూడదా?
- జరిగిన భారీ నష్టాల నేపథ్యంలో మీ పార్టీ సిన్సియర్గా చేసుకున్న ఆత్మవిమర్శ ఏమిటి?
- రాజ్యం అణిచివేత, నిర్మూలన కొత్తేమీ కాదు కదా..? ఈ స్థాయిలో అణిచివేస్తారని మీరెందుకు ఊహించలేకపోయారు?
- పదేళ్ళ కెసిఆర్ పాలన, రెండేళ్లుగా రేవంత్ పాలన మధ్య వ్యత్యాసం ఉన్నదా?
- ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ సమాధాన్ ఎదుర్కున్న మీరు, ఆపరేషన్ కగార్ ను ఎందుకు ఎదుర్కునలేకపోయారు?
- తెలంగాణలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో మిమ్మలని ఆదరించి అభిమానించిన విప్లవ అభిమానులకు ఏం భరోసా ఇస్తారు?
- ఛతీస్ ఘడ్, మహారాష్ట్రాలలో జరిగిన లొంగుబాట్లను ఒకలా.. తెలంగాణలో జరిగిన లొంగుబాట్లను మరోలా ఉన్నాయి. ఈ వ్యత్యాసాన్ని ప్రజలు ఎలా అర్థం చేసుకోవాలి?
- దండకారణ్యంలో ఇంకా మీకు ఆదరణ ఉందని భావిస్తున్నారా?
- సమాజంలో వ్యవసాయ రంగం కుదేలైపోయి, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటూ ఉంటే వారివద్దకు వెళ్ళి. ఎందుకు మీరు పోరాటాలకు సన్నద్ధం చేయలేపోయారు?
- ఫాసిజం దేశంలో పడగవిప్పి బుసలు కొట్టి ప్రజల మధ్య విభజన రేఖ గీస్తున్న తరుణంలో మణిపూర్ లాంటి ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో మరో రూపంలో ప్రజల మధ్యకు వచ్చి ఎందుకు పనిచేయకూడదని అనుకుంటున్నారు?
- తెలంగాణ, ఏపీ లో మీకు పూర్వ వైభవం లభిస్తుందనే ఆశ ఉందా? ఎలా ఉందో చెప్పండి?
- ఆపరేషన్ కగర్ తరువాత అదువుల్లోని వనరులపై ఇక కార్పొరేట్ కంపెనీలు పాగా వేసినట్టుగా భావించవచ్చా?

## ప్రజాస్వామ్య సంక్షోభంలో
# తెలంగాణ - రాజకీయాలు



తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలు ఒక గంభీరమైన మలుపును సూచిస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో వాదన, ప్రతివాదం సహజ లక్షణాలుగా గుర్తింపుపొందినా నేటి రాజకీయ ఆచరణలో ఆ విలువలు క్రమంగా నీరుగారుతున్న దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజా సమస్యలపై చర్చకు ప్రాధాన్యం తగ్గి వ్యక్తిగత ఆరోపణల చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. ఈ ధోరణి రాష్ట్ర రాజకీయాల అంతర్గత ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోంది.

తెలంగాణ ఆవిర్భావం తరువాత తొలి దశలో ఆశావహ రాజకీయ వాతావరణం కనిపించింది. 2014 తరువాత ప్రజల ఆకాంక్షలు, ఉద్యమ నేపథ్యం, పాలనా నిర్మాణాల రూపకల్పనలో ఒక స్థిరత్వం కనిపించింది. అయితే 2018 తరువాత రాజకీయ సంభాషణల స్థాయి క్రమంగా దిగజారడం ప్రారంభమైంది. విధానాలపై వాదన కంటే వ్యక్తులపై విమర్శలు అధికమయ్యాయి. ప్రజా ప్రయోజనాల స్థానంలో రాజకీయ వారసత్వం ప్రధాన అంశంగా మారింది.

ప్రస్తుతం అధికార పక్షం, ప్రతిపక్షం మధ్య కొనసాగుతున్న రాజకీయ పోరు సిద్ధాంతాల మధ్య పోరుగా కాకుండా వ్యక్తిగత ఆధిపత్యాల మధ్య యుద్ధంగా మారింది. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం సాధారణ రాజకీయ ప్రక్రియగా మారింది. ఈ ప్రక్రియలో ప్రజా సమస్యలు పక్కకు నెట్టబడుతున్నాయి. నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, విద్యా ప్రమాణాలు వంటి అంశాలు రాజకీయ ప్రసంగాల్లో క్రమంగా కనిపించకుండా పోతున్నాయి. వారసత్వ రాజకీయాల ప్రభావం తెలంగాణలో వేగంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు ఉద్యమ నాయకత్వానికి ప్రజా మద్దతు ప్రధాన ప్రమాణంగా ఉండేది. నేడు కుటుంబ నేపథ్యం రాజకీయ అర్హతగా మారుతున్న పరిస్థితి ఏర్పడింది. 2020 తరువాత జరిగిన ఎన్నికల విశ్లేషణలను పరిశీలిస్తే సుమారు 40 శాతం టికెట్లు రాజకీయ కుటుంబాలకు చెందినవారికే దక్కినట్టు అంచనాలు చెబుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతంగా పరిగణించవచ్చు. ఈ వారసత్వ ధోరణి కొనసాగితే రాజకీయాల్లో కొత్త నాయకత్వం ఎదగడానికి అవకాశాలు తగ్గిపోతాయి. ప్రజా జీవితంలో ప్రవేశించాలనుకునే సామాన్య వర్గాలకు రాజకీయ వ్యవస్థ మూసివేసిన తలుపులా మారే ప్రమాదం ఉంది. దీని ప్రభావంగా 2030 నాటికి రాష్ట్ర రాజకీయాల్లో సుమారు 60 శాతం నాయకత్వం వారసత్వ ఆధారితంగా మారే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల అంచనా.

ప్రజా నైతికత విషయానికి వస్తే ప్రస్తుతం రాజకీయ సంభాషణలో తీవ్ర పతనం కనిపిస్తోంది. ఒకప్పుడు సభల్లో ఉపయోగించే భాషకు ఒక పరిమితి ఉండేది. నేడు వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలు సాధారణమయ్యాయి. ఈ పరిస్థితి యువతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాజకీయాలంటే సేవ అనే భావన స్థానంలో అధికార సాధన అనే భావన బలపడుతోంది.

సామాజిక మాధ్యమాల ప్రభావం కూడా ఈ పతనానికి ప్రధాన కారణంగా మారింది. సమాచారం కంటే అపవాదులు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. నిజానిజాల పరిశీలన లేకుండా ఆరోపణలు ప్రజల మానసికతను ప్రభావితం చేస్తున్నాయి. 2025 నాటికి రాజకీయ సమాచార వినియోగంలో సుమారు 70 శాతం భాగం ధృవీకరణ లేని విషయాలేనని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

ఈ పరిస్థితులు కొనసాగితే 2050 నాటికి రాజకీయాలు ఎంతవరకు దిగజారుతాయన్న ప్రశ్న కీలకంగా మారుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో నమ్మకం తగ్గితే ప్రజల రాజకీయ పాల్గొనడం కూడా తగ్గిపోతుంది. ఓటింగ్ శాతం ప్రస్తుతం ఉన్న 65 శాతం నుంచి 2050 నాటికి 50 శాతం కంటే తక్కువకు పడిపోయే ప్రమాదం ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి తీవ్ర సంక్షోభ సూచికగా భావించవచ్చు. అయితే ఈ దిగజారుదల అనివార్యమనే అభిప్రాయం సరైనది కాదు. ప్రజలు చైతన్యవంతులైతే రాజకీయ వ్యవస్థలో మార్పు సాధ్యమే. రాజకీయ పార్టీలు అంతర్గత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తే నాయకత్వ ఎంపికలో పారదర్శకత పెరుగుతుంది. విధాన ఆధారిత రాజకీయాలు పునరుద్ధరించబడితే ప్రజా విశ్వాసం తిరిగి సాధ్యమవుతుంది.

విద్యావ్యవస్థలో పౌరసత్వ అవగాహన పెంపొందించటం కూడా కీలకం. యువతకు రాజకీయ విలువలపై స్పష్టమైన దృష్టి ఏర్పడితే వారసత్వ రాజకీయాలకు ప్రత్యామ్నాయం ఏర్పడుతుంది. 2035 నాటికి యువ నాయకత్వంలో కనీసం 30 శాతం స్వతంత్ర సామాజిక నేపథ్యం కలిగినవారు ముందుకు రావాలంటే ఇప్పటి నుంచే నిర్మాణాత్మక చర్యలు అవసరం.

తెలంగాణ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా చీకటిలో ఉందని చెప్పలేం. ప్రస్తుతం కనిపిస్తున్న పతన ధోరణి ఒక హెచ్చరికగా భావించాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత రాజకీయ పార్టీలపై మాత్రమే కాకుండా పౌరులపై కూడా ఉంది. ప్రజా చర్చల్లో స్థాయి పెరిగితే రాజకీయ నాయకత్వం కూడా మారాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

రాజకీయ పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యం కూడా భవిష్యత్ రాజకీయాలకు కీలక అంశం. ప్రస్తుతం పార్టీల్లో అంతర్గత ఎన్నికల నిర్వహణ శాతం సుమారు 20 మాత్రమే ఉంది. ఇది 2035 నాటికి 50కి పెరగకపోతే నాయకత్వ కేంద్రీకరణ మరింత పెరుగుతుంది. కేంద్రీకరణ పెరిగిన కొద్దీ ప్రజాస్వామ్య విలువలు క్రమంగా క్షీణిస్తాయి. మొత్తంగా చూసినప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు 2026 నుంచి 2050 మధ్య ఒక పరీక్షా కాలాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ కాలంలో తీసుకునే నిర్ణయాలే భవిష్యత్ తరాల రాజకీయ సంస్కృతిని నిర్ణయిస్తాయి. ప్రజలు మౌనంగా ఉంటే రాజకీయాల దిగజారుదల వేగం పెరుగుతుంది. ప్రజలు చైతన్యవంతులైతే రాజకీయ వ్యవస్థ మారక తప్పదు.

చివరిగా చెప్పాల్సిందేమంటే రాజకీయాలు ప్రజల ప్రతిబింబమే. ప్రజలు సహిస్తే అవినీతి పెరుగుతుంది. ప్రజలు ప్రశ్నిస్తే వ్యవస్థ మారుతుంది. 2050 నాటికి తెలంగాణ రాజకీయాలు ఎంత దిగజారుతాయో అన్నది ముందే నిర్ణయించబడలేదు. అది ప్రజల ఆలోచనలపై ఆధారపడి ఉంటుంది. ప్రజా చైతన్యమే రాజకీయ భవిష్యత్తుకు నిజమైన దిక్సూచి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## కీలకం!

ప్రజాస్వామ్యానికి
'కీలకం'రాజ్యాంగం!
రాజ్యాంగం స్థానంలో
మనుస్మృతిని తెచ్చే
ప్రయత్నం ఫాసీజం!
ప్రమాదంలో ఉన్నాం
వెనక్కు లాక్కుపోయే
తిరోగామిశక్తులునేడు
దొంగముసుగులతో
ముందుకొస్తున్నాయి!
అది మనుస్మృతి
చాతుర్వర్ణాలుగా
జనాన్ని విభజన!
అసమానతే లక్ష్యం!
సూద్రులు సేవకులు!
సూద్రులు ఎవరు?
బహుజనులందరు!
బిసి ఎస్సీ ఎస్టీ
మైనారిటీ ఆదివాశీ
తొంభైశాతం ప్రజలు!
నేటి పరిస్థితుల్లో
ధనిక, కార్పొరేట్లు
వీళ్ళు పదిశాతమే!
వీళ్ళకు చాకిరీలు
చెయ్యటమే సూద్రుల
కర్తవ్యమంటారు!
భారతదేశ ప్రజలు
భిన్నజాతులు మతాలు!
బౌద్ధం నుండి నేటికీ
ఎన్ని పోరాటాలో!
వాటినుండి బైటపడి
ప్రజాస్వామ్యానికొచ్చా!
అంబేద్కర్ విరచిత
రాజ్యాంగమే మనకు
నేడు తలమానికం!
రాజ్యాంగ రక్షణే
మనందరి కర్తవ్యం!
అందరూ సమానం!
సమానత్వ సిద్ధాంతం!
రాజ్యాంగ రక్షణే
నేడు మనకు'కీలకం'!

-తమ్మినేని అక్కిరాజు

## సమ్మక్క సారలమ్మ భక్తులు సైనికులుగా మారితే
# బహుజన రాజ్యం సిద్ధిస్తుంది



మానవ జాతి చరిత్రలో ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క సారలమ్మ జాతరగా చెప్పుకోవడం జగమెరిగిన సత్యం. వారి చరిత్ర స్ఫూర్తి తోనే తెలంగాణ రాష్ట్రంలో పీడిత కులాల రాజ్యాధికారం కోసం, సామాజిక న్యాయం కోసం, బీసీ ఎస్సి ఎస్టిల వ్యవస్థాపక చైర్మన్ ఐన డా. విశారదన్ మహారాజ్ మార్చి.15.2022 నుండి ఎప్రిల్.30.2023 వరకు పది వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర చేయడం గమనార్హం.ఇక చరిత్రలోకి వెళ్తే 700 సంవత్సరాల క్రితం ఉమ్మడి కరీంనగర్ కేంద్రంగా గిరిజనులైనా కోయ కులానికి చెందిన అతిపెద్ద రాజ్యం ఉన్నది దానికి రాజు మేడరాజు అతని భార్య సమ్మక్క, వీరి సంతానమే కూతుళ్లు సారలమ్మ, నాగులమ్మ, కొడుకు జంపన్న కాగా మేడరాజు యొక్క మేనల్లుడు పగిడిద్ద రాజు కావడం గమనార్హం. మేడరాజు సహకారంతో పగిడిద్దరాజు మేడారం ప్రాంతానికి రాజుగా ఉంటూ పాలించేవాడు. మేడరాజు సమ్మక్క తమ రాజ్యంలోని ప్రజలని కన్న బిడ్డల వలే చూసుకుంటూ ఎలాంటి కష్టాలు రాకుండా స్వర్ణయుగ పాలన చేశారు. కానీ అనుకొని ప్రకృతి విపత్తుల కారణంగా ఐదు సంవత్సరాల పాటు వర్షాలు సక్రమంగా పడక పగిడిద్ద రాజు రాజ్యం ఐన మేడారంలో అనావృష్టి సంభవించడం మూలంగా కాకతీయులకి విధేయులుగా సామంత రాజుగా మేడరాజు, పగిడిద్ద రాజు ఉండడం మూలంగా కాకతీయ రాజు ఐన ప్రతాపరుద్రుడికి సరైన సమయం లో కప్పం(పన్ను) కట్టలేకపోయాడు.ఏది ఏమి ఐన సరే ఎట్టి పరిస్థితుల్లో కాకతీయ రాజ్యానికి పన్ను కట్టల్సిందే అని ప్రతాపరుద్రుడు పగిడిద్ద రాజు పై ఒత్తిడి చేశారు.అనావృష్టి కారణంగా కాకతీయ రాజ్యానికి పన్ను కట్టలేమని ప్రతాపరుద్రుడికి పగిడిద్ద రాజు తెలపడం మూలంగా తమ ఆదేశాన్ని ఒక కోయ జాతి రాజు వ్యతిరేకించడాన్ని కాకతీయ రాజు ఐన ప్రతాపరుద్రుడు జీర్ణించుకోలేకపోయాడు. అందుకు యుగంధరుడు అనే కాకతీయ సైన్యాధ్య క్షుడిని పగిడిద్దరాజు రాజ్యం పైకి పంపాడు. ఇలాంటి విపత్కర పరిస్థితిలో పంటలు సరిగ్గా పండక ఆహారం కూడా సరిగ్గ లేని కోయ రాజులైన మేడ రాజు సైన్యం బలమైన సైన్యమైన కాకతీయ రాజ్యంతో యుద్ధం చేయాల్సిన అనివార్య పరిస్థితి నెలకొన్నది. ఇట్టి పరిస్థితుల్లో ఆకలి దప్పులతో ఉన్న మేడరాజు సైన్యం కాకతీయ సైన్యంతో యుద్ధం చేయలేకపోయారు. మొదట గా మేడరాజుని కాకతీయ సైన్యం తాళ్లతో కట్టివేసి బంధించి నరికి చంపారు, ఒక గిరిజన కోయ రాజు వీర మరణం చెందాడు. ఇక సమ్మక్క కుమార్తెలైన సరళమ్మ, నాగులమ్మ, మేడరాజు మేనల్లుడు ఐన పగిడిద్దరాజు చివరి వరకు కత్తులతో పోరాటం చేసిన వారిని కూడా కాకతీయ సైన్యం నరికి చంపారు. తమ కుటుంబికుల మరణాన్ని తట్టుకోలేక ఎత్తైన కొండ ఎక్కి సమ్మక్క కుమారుడు ఐన జంపన్న పక్కనే ఉన్న సంపెంగ వాగులోకి దూకి ఆత్మ బలిదానం చేసుకున్నాడు, తదనంతరమే సంపెంగ వాగుని ప్రజలు జంపన్న వాగుగా చరిత్రలో పిలుచుకోవడం గమనార్హం. ఇక ఒంటరి ఐన సమ్మక్క ఆడ పులిగా అవతారమెత్తి దొరికిన వారిని దొరికినట్లు కాకతీయ సైన్యాన్ని నరికి చంపింది, సమ్మక్క లోని ధైర్యసాహసాలని యుద్ధ రితిని ఎదిరించలేకపోయినా కాకతీయ సైన్యం భయభ్రాంతులతో పరుగులు పెట్టి పరిపోయారు. ఇక కాకతీయ సైన్యాధ్యక్షుడు ఐన యుగంధరుడు సమ్మక్కని వెనుక నుండి బల్లెంతో వెన్నుపోటు పొడిచాడు,యుద్ధంలో అలసి పోయిన సమ్మక్క రక్తపు మడుగులలో శవాలుగా మిగిలిపోయిన కోయ సైన్యాన్ని చూస్తూ నిరాశ్రయురాలై మెల్లగా నడుచుకుంటూ చింతల గుట్ట వైపు వెళ్ళిపో యి వీర మరణం చెందింది, తదనంతరం ఎవరికి సమ్మక్క జడ తెలియలేదు. నేడు సమ్మక్క సారక్కల జీవిత చరిత్రని వారి వరాసులైన ఆదివాసిలు, గిరిజనులు సమ్మక్క సారలమ్మల వీర మరణాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేడు ఆధునిక రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామ్య రాజకీయాలు చేసేలా చరిత్రని తెలుసుకో లేకుండా అగ్రకుల పాలక వర్గాలు కుట్ర పన్నారు. నేడు సమ్మక్క సారలమ్మల అభిమానులు, భక్తులు రెండు సంవత్సరాలకు ఒకసారి జాతర పేరుతో బెల్లాన్ని బంగారంగా సమర్పించి కోళ్లు మేకలు కోసుకొని మద్యాన్ని విపరీతంగా తాగి పండుగల చేసుకునేలా వీర వనితలైన సమ్మక్క సరలమ్మలని వన దేవతలుగా సృష్టించి మనువాద అగ్రకుల పాలకులు చరిత్రని వక్రీకరించారు తప్ప, నిజమైన సమ్మక్క సారలమ్మల చరిత్ర గిరిజనులకి పీడిత కులాలకి తెలియకుండా అగ్రకుల పాలకవర్గాలు నేటికి జాగ్రత్త పడుతునే ఉన్నారు. నేటి ఆధునిక పరిపాలనలో కాకతీయ రాజ్యాన్ని పాలించింది మేమే అని రెండు బలమైన అగ్రకుల పాలక వర్గాలు గర్వంగా చెప్పుకుంటున్నారు. మరి ఇలాంటి విభిన్న పరిస్థితుల్లో నేడు ఆదివాసీలు గిరిజనులు తమ రాజకీయ శత్రువులుగా ఎవరిని చూడాలి..? కానీ నేడు ఏమి జరుగుతున్నది చంపి వేయబడినవారు చంపిన వారు కలిసి సమ్మక్క సారలమ్మల వీర మరణాన్ని కూడా పెద్ద జాతర పండుగల చేసుకోవడం మానవ జాతి చరిత్రలో ఇంతకంటే హీనమైన దౌర్భాగ్యమైన పరిస్థితి ఉంటదా ఇదేమి వివేకం.? కాబట్టి ఎప్పుడైనా పాలక వర్గాలే తమకి అనుకూలంగా చరిత్రని రాసుకుంటారు, పాలిత వర్గాలు చరిత్రని పాటిస్తారు, అనగా విజేతలు విలువలు సృష్టిస్తారు పరాజితులు విలువలు పాటిస్తారని నిరూపణ అవుతుంది. అంతిమంగా నేడు భవిష్యత్ చరిత్ర ఎలా ఉండాలంటే బీసీ ఎస్సి ఎస్టి జేఏసీ ఫౌండర్ ఐన డా. విశారదన్ మహారాజ్ గతంలో వారు చేసిన పది వేల కిలో మీటర్ల స్వరాజ్య పాదయాత్రలో భాగంగా ములుగు జిల్లా, తాడ్వాయి మండలం లోని మేడారం ప్రాంతం లోని సమ్మక్క సరలక్కల గద్దెలని సందర్శించి, మేడారం సమ్మక్క సరాలక్క జాతరకి కోట్ల సంఖ్యలో వచ్చే భక్తులంతా కూడా సైనిక ఓటర్లుగా మారి అగ్రకుల పాలకవర్గాలతో అంబేద్కర్ భారత రాజ్యాంగ ఆయుధాలతో, కాన్షీరాం వాడిన ఓటు ఖడ్గంతో భారత రాజ్యాంగ బద్ధ రాజకీయ యుద్ధం చేస్తూ సమ్మక్క సారలక్కలకి జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా ప్రజాస్వామ్య పద్ధతిలో సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరివర్తన చేయాల్సిన కర్తవ్యం సమ్మక్క సారలమ్మ జాతి బిడ్డలైన కోయ జాతుల పైన, అగ్రకుల పాలక వర్గాల చేత బాధితులైన అణగారిన కులాల పై ఉన్నదనే చారిత్రక సత్యాన్ని సమ్మక్క సారలమ్మల అభిమానులు,భక్తులు పీడిత కులాల మేధావులు, నాయకులు గ్రహించాలని సంఘ పరివర్తన కోసం ఎంతో కాలంగా నీతి నిబద్ధతతో సామాజిక రాజకీయ పరివర్తన ఉద్యమాలు చేస్తున్న తాత్వికులైన డా. విశారదన్ మహారాజ్ గతంలో తెలపడం గమనార్హం.అంతేకాకుండా భవిష్యత్తులో 90% బీసీ ఎస్సీ ఎస్టీల రాజ్యాధికారం సాధించిన తదనంతరమే సమ్మక్క సారలమ్మలు కొలువైన మేడారం ప్రాంతాన్ని తెలంగాణ రాష్ట్రానికి రెండో రాజధానిగా చేసి ఆ ప్రాంతాన్ని సామాజిక న్యాయానికి కేంద్రంగా చేసి, బడుగు బలహీన వర్గాల సంస్కృతి ఉట్టిపడేలా హైదరాబాద్ పట్టణానికి సమానంగా అభివృద్ధి చేసి సమ్మక్క సారలమ్మలకి గౌరవమైన నివాళి అర్పిస్తామని చెప్పడం జరిగింది.

కాకతీయ రాజ్యాన్ని పాలించింది మేమె అని తెలంగాణలోని రెండు బలమైన సామాజిక వర్గాలు పోటీ పడుతుంటే ఈ తరుణంలో, సమ్మక్క సారలమ్మలని చంపింది మా పూర్వీకులే అని నేడు వారి వారసులు ఒప్పుకున్నట్లే కదా.! కానీ నేడు అదే పాలకవర్గాలకి ఆదివాసీలు, గివిజనులు ఓట్లు వేసి రాజ్య సింహాసనంపై కూర్చోబెడుతున్నారు అంటే సమ్మక్క సారక్కలకి అవమానకరం కదా.! కానీ 75 సంవత్సరాల స్వాతంత్ర గణతంత్ర భారతంలో నేటికి కూడా ఆదివాసి గిరిజనులకి సరైన మౌలిక సదుపాయాలు లేక ప్రాచీన కాలం వలె జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఒక్క భారత రాజ్యాంగ మూలంగానే ఆదివాసి, గిరిజన జీవితాల్లో మార్పులు వచ్చి రిజర్వేషన్ల మూలంగా ఆదివాసి, గిరిజనులు రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తూ ప్రజాప్రతినిధులుగా అవ్వగలుగుతున్నారు. కానీ ఈ మాత్రం మార్పు సరిపోదు, ఆదివాసులు గిరిజనులు సమ్మక్క సారలమ్మలకు చరిత్రలో జరిగిన అవమాననికి బదులుగా, స్వధర్మంతో స్వశక్తితో స్వరాజ్యం కోసం సమ్మక్క సారలమ్మల ధర్మ మార్గంలో వెళ్లి, అగ్రకులాల చేత సహ భాదితులు ఐన 56% ఉన్న బీసీ లని,18% ఉన్న ఎస్సి లని, మిగతా ఎస్టి లని కలుపుకొని అగ్రకుల పాలక వర్గాలకి అభిముఖంగా రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామ్య రాజకీయాలు చేసి సమ్మక్క సారలమ్మలు కోరుకున్న సామాజిక అసమానతలు లేని స్వేచ్ఛ సమానత్వ సోదరభావ ప్రజాస్వామ్య గణతంత్ర విలువలు కలిగిన సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడమే నేడు సమ్మక్క సారలమ్మల కోట్ల మంది భక్తులు, వారి జాతి వారసత్వ నాయకులు చేయాల్సిన తక్షణ కర్తవ్యం అని పీడిత కులాల మేధావులు విద్యావంతులు సామాన్యులు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.



పుల్లెంల గణేష్
(సోషల్, పొలిటికల్ ఏనాలిస్ట్)
9553041549

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం
# గొంతు కోసిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం



భారత ప్రజాస్వామ్య చరిత్రలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎం.జీ.ఎన్.ఆర్.ఈ.జీ.ఏ.) ఒక మైలురాయిగా నిలిచింది. ఇది కేవలం ఒక సంక్షేమ పథకం కాదు; గ్రామీణ పేదలకు ఉపాధి ఒక హక్కు అని చట్టబద్ధంగా ప్రకటించిన విప్లవాత్మక నిర్ణయం. గ్రామ స్థాయిలో ప్రజలే నిర్ణయాలు తీసుకునేలా పంచాయతీలు, గ్రామ సభలను కేంద్రంగా పెట్టి రూపొందించిన ఈ చట్టం, ప్రజాస్వామ్య పాలన ఎలా ఉండాలో చూపించిన ఉదాహరణగా గుర్తింపు పొందింది. అలాంటి చట్టాన్ని పక్కన పెట్టి, దాని స్థానంలో "జీ రామ్ జీ " అనే కొత్త వ్యవస్థను తీసుకురావడం అనేది కేవలం పేరు మార్పు కాదు;అది పాలనా తత్వంలో వచ్చిన ప్రమాదకరమైన మలుపు. ఈ మార్పు మొదటిగా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా కనిపిస్తోంది. (ఎం.జీ.ఎన్.ఆర్.ఈ.జీ.ఏ.)రూపకల్పనకు ముందు దేశవ్యాప్తంగా విస్తృత చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వాలు, పౌర సమాజ సంస్థలు, అకాడమిక్ వర్గాలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలు, అందరి అభిప్రాయాలు తీసుకున్నారు. పార్లమెంటరీ కమిటీల ద్వారా సుదీర్ఘ పరిశీలన జరిగింది. కానీ "జీ రామ్ జీ" విషయంలో అలాంటి సంప్రదింపుల ఆనవాళ్లు కనిపించవు. ప్రజలకు, రాష్ట్రాలకు, పంచాయతీలకు ముందస్తు సమాచారం లేకుండానే బిల్లును తెచ్చి, బలమైన మెజారిటీతో ఆమోదింపజేయడం జరిగింది. ఇది ప్రజాస్వామ్య విధానమా, లేక అధికార బలంతో నెట్టుకురావడమా అనే ప్రశ్న తలెత్తుతుంది.

పార్లమెంటరీ సంప్రదాయాల పరంగా కూడా ఈ మార్పు ఆందోళన కలిగిస్తోంది. ఇంత కీలకమైన చట్టాన్ని స్టాండింగ్ కమిటీకి లేదా జాయింట్ పార్లమెంటరీ కమిటీకి కూడా పంపకుండా తొందరపడి ఆమోదించడమంటే, శాసనసభ పాత్రను తక్కువ చేయడమే. పార్లమెంట్ అనేది చర్చల వేదిక కావాలి, కేవలం ఆమోద ముద్ర వేసే స్థలం కాకూడదు. ఈ పద్ధతి కొనసాగితే, భవిష్యత్తులో మరింత కీలక నిర్ణయాలు కూడా ఇదే విధంగా ప్రజలపై మోపబడే ప్రమాదం ఉంది.

రాజ్యాంగపరంగా చూస్తే, ఈ కొత్త వ్యవస్థ మరింత సమస్యాత్మకంగా కనిపిస్తుంది. (ఎం.జీ.ఎన్.ఆర్.ఈ.జీ.ఏ.)కింద రాష్ట్రాలకు కేంద్రం నుంచి సరిపడ నిధులు రావాల్సిన బాధ్యత ఉంది. కానీ ఇప్పుడు రాష్ట్రాలపై అదనపు పరిపాలనా భారాన్ని మోపుతూ, తగిన ఆర్థిక సహాయం ఇవ్వకుండా చేతులు దులుపుకునే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇది రాజ్యాంగంలోని కేంద్ర--రాష్ట్ర సంబంధాల ఆత్మకు విరుద్ధం. రాష్ట్రాల సమ్మతి లేకుండా, న్యాయపరమైన ప్రక్రియలు పాటించకుండా తీసుకునే నిర్ణయాలు సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తాయి.

అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే, ఈ మార్పుతో హక్కుల భావన వెనక్కి వెళ్లడం (ఎం.జీ.ఎన్.ఆర్.ఈ.జీ.ఏ.) పేదలకు "పని కావాలంటే ఇవ్వాల్సిందే" అనే చట్టబద్ధ హామీ ఇచ్చింది. పని ఇవ్వకపోతే భత్యం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉండేది. కానీ కొత్త విధానంలో హక్కుల స్థానంలో విధేయత, కర్తవ్యాలపై ఎక్కువగా దృష్టి పెట్టినట్టు కనిపిస్తోంది. చరిత్ర చెబుతున్నది ఒక్కటే … హక్కులను తగ్గించి, కర్తవ్యాల పేరుతో ప్రజలను నియంత్రించడం అనేది ఎప్పుడూ నియంతృత్వ పాలనల లక్షణం. ఈ చట్టం మహాత్మా గాంధీ ఆలోచనలకు కూడా విరుద్ధమే. గాంధీ కలల భారతం అంటే అతి పేదవాడికీ కూడా "ఇది నా దేశం" అని అనిపించే దేశం. అతనికి తన జీవితంపై, తన గ్రామంపై నిర్ణయాలు తీసుకునే హక్కు ఉండాలి. గాంధీ ఇచ్చిన "తాలిస్మాన్" కూడా అదే చెబుతుంది: ఏ నిర్ణయం తీసుకున్నా, అది అతి పేదవాడికి ఉపయోగపడుతుందా అని ప్రశ్నించాలి. కానీ గ్రామ స్థాయి నిర్ణయాలను పక్కన పెట్టి, కేంద్రం నుంచి ఆదేశాల రూపంలో అమలు చేసే వ్యవస్థ పేదలకు నిజంగా ఎంత మేలు చేస్తుందన్నది అనుమానమే. కోవిడ్ మహమ్మారి సమయంలో (ఎంజీఎన్ ఆర్ఈజీఏ) కోట్లాది గ్రామీణ కుటుంబాలకు ప్రాణాధారంగా నిలిచింది. వలస కార్మికులు స్వగ్రామాలకు చేరుకున్నప్పుడు, కనీస ఆదాయం, కనీస గౌరవం ఈ చట్టం వల్లే లభించింది. అలాంటి చట్టాన్ని నిర్వీర్యం చేయడం అంటే, భవిష్యత్తులో వచ్చే సంక్షోభాల్లో పేదలను మరింత అసురక్షితంగా మార్చడమే. ఒకవైపు పెద్ద కార్పొరేట్లకు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇస్తూ, మరోవైపు పేదల హక్కులను కుదించడం సామాజిక న్యాయానికి విరుద్ధమైన విధానం. ఇది కేవలం ఆర్థిక అసమానతలను పెంచడమే కాదు; ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తుంది. చివరికి, (ఎంజీఎన్ఆర్ఈజీఏ) మార్పు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. ఈ దేశం హక్కుల ఆధారిత ప్రజాస్వామ్యంగా కొనసాగుతుందా, లేక భావోద్వేగాలు, ఆజ్ఞల ఆధారంగా నడిచే పాలన వైపు వెళ్లుతోందా అనే ప్రశ్నను లేవనెత్తింది. ఈ ప్రశ్నకు సమాధానం ప్రజల చేతుల్లోనే ఉంది.

ప్రజాస్వామ్యంలో తుది తీర్పు ఎప్పుడూ ప్రజలదే. ఉపాధి హక్కును కాపాడుకోవడం అంటే, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమే.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ఫైర్ సేఫ్టీపై రెండోరోజూ జోరుగా హైడ్రా తనిఖీలు

**జీహెచ్ ఎంసీతో పాటు ఇతర విభాగాలతో సంయుక్తంగా చర్యలు**

**6 షాపులను సీజ్ చేసిన అధికారులు**



**శేరిలింగంపల్లి, జనవరి 30 (జనంసాక్షి) :** నగరంలో వరుస అగ్ని ప్రమాదాల నేపథ్యంలో ఫైర్ సేఫ్టీ ప్రధాన భూమికగా రెండో రోజు శుక్రవారంకూడా తనిఖీలు ముమ్మరంగా కొనసాగాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైడ్రా, ఫైర్, విద్యుత్ విభాగాల అధికారులు సంయుక్తంగా తనిఖీలను నిర్వహించారు. ఫైర్ నిబంధనలను పట్టించుకోకుండా బేఖాతరు చేస్తూ షాపులు నిర్వహిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. సెల్లార్లను గోదాములుగా మార్చడాన్ని అధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. పలు గోదాముల నిండా కెమికల్, పెయింట్ డబ్బాలు నిలువ ఉంచడం, ఫర్నీచర్ తయారీ సామగ్రితో పరిసరాలు నిండి ఉండడాన్ని అధికారులు గమనించారు. భవన అనుమతులు, ఫైర్ ధ్రువీకరణ పత్రాలు(ఫైర్ డిపార్ట్మెంట్ ఎన్‌వోసి లు) లేకపోవడాన్ని పలు భవనాల్లో అధికారులు గుర్తించినట్లు విశ్వాసనీయ సమాచారం. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మానవ ప్రమేయం లేకుండా ఆటోమేటిక్‌గా పనిచేసే వాటర్ స్ప్రింక్లర్లు, స్మోక్ డిటెక్టర్లు లేకపోవడం, ఫైర్ ఎక్టింగ్విషర్లు కానరాని పరిస్థితుల నేపథ్యంలో నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న 6 షాపులను అధికారులు సీజ్ చేశారు. నగరం పరిధిలో కమర్షియల్ షాపులను నిర్వహిస్తున్న భవనాలను గోదాములుగా మార్చరాదని గతం నుండి అధికార యంత్రాంగం చెబుతూ వస్తోంది. ఆయా షాపులకు అనుబంధంగా గోదాములు నిర్వహించుకోవాలనుకుంటే వాటిని వేరేచోట పెట్టుకుని షాపుల్లో ఫర్నీచర్ ప్రదర్శన, అమ్మకాలు మాత్రమే ఉండేలా, కొనసాగేలా చూడాలని హైడ్రా స్పష్టంగా ఆదేశాలను జారీ చేస్తూ వస్తోంది.

6 ఫర్నీచర్ షాపులను సీజ్ చేసిన అధికారులు...

గచ్చిబౌలిలోని లుకింగ్ గుడ్ ఫర్నీచర్ షాప్ బిల్డింగ్ ను అధికారులు శుక్రవారం సీజ్ చేయడం జరిగింది. సెల్లార్లలో అగ్నిప్రమాదానికి ఆస్కారం ఉండే సామాగ్రి నిలువలు ఉంచినట్టు నిర్ధారించారు. పెయింట్ డబ్బులు, పరుపులు, బ్యాటరీలు, పెద్ద మొత్తంలో నిలువ ఉంచినట్టు గుర్తించారు. సరైన అనుమతి లేని భవనానికి తోడు ఫైర్ అనుమతులు కూడాలేని పరిస్థితి. సెల్లార్ల ర్యాంపులు మూసేసి స్టాక్ తో నింపినట్టు గుర్తించి చర్యలు తీసుకున్నారు. ఇదే పరిస్థితి కొంపల్లి క్రాస్ రోడ్స్ లోని అను ఫర్నీచర్ షో రూంలో కూడా నెలకొంది. కూకట్‌పల్లితో పాటు అత్తాపూర్‌లోని పివి నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేలో ఉన్న రోయల్ ఓక్ ఫర్నీచర్ షాపులు కూడా నిలువలు ప్రమాదకరంగా సెల్లార్లలో నింపేయడంతో అధికారులు సీజ్ చేశారు. ఉప్పల్ నాగోల్‌లోని బాంటియా ఫర్నీచర్ షోరూం, నాచారంలోని అను ఫర్నీచర్ షోరూంను సీజ్ చేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ షాపుల పరిసరాలు ఫైర్ సేఫ్టీ లేని ప్రాంతంగా పేర్కొంటూ బోర్డులు పెట్టారు.

# లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌తోనే వలసలు ఆగుతాయ్

- ప్రాజెక్టు నిర్మించి స్థానిక రైతాంగాన్ని ఆదుకోవాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ప్రొఫెసర్ హరగోపాల్ వినతి
- 'జనంసాక్షి' కథనాన్ని భట్టికి వివరించిన ప్రొఫెసర్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :**

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తేనే ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో వలసలు ఆగుతాయని, గిరిజన రైతాంగానికి న్యాయం జరుగుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు జనంసాక్షి కథనం ఆధారంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆయన వినతిపత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో పూర్వపు పాఠశాల 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ పరిధిలోని చౌదర్‌గూడ మండలాల్లో వివిధ గిరిజన తండాల నుండి వ్యవసాయానికి సాగునీరు లేక ఇక్కడి ప్రాంత రైతులు లక్షలు పెట్టి బోర్లు వేసినా చుక్క నీరు రాలేదని, బతుకుదెరువు కోసం మహారాష్ట్ర, ముంబై, హైదరాబాద్ నగరంలాటి ప్రాంతాలకు 60 శాతం గిరిజనులు వలసలు వెళ్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాళ్లతో పాటు పిల్లల్ని కూడా తీసుకెళ్లడంతో ఇక్కడి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు కూడా మూతపడుతున్నాయని తెలిపారు. ఈ ప్రాంత రైతుల వలసలు ఆగాలంటే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించి ఈ ప్రాంత రైతుకు సాగునీరు అందించాలని హరగోపాల్ కోరారు. గతంలో లక్ష్మీదేవిపల్లి ప్రాంతంలో బహిరంగ సభ సమావేశం పెట్టినప్పుడు భట్టి విక్రమార్క ఆ ప్రాంతంలో పర్యటించారని, అప్పుడు కూడా పాలమూరు అధ్యయన వేదిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశామని గుర్తుచేశారు. ఇప్పుడు కూడా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించాలని పాలమూరు అధ్యయన వేదిక ప్రజాసంఘాలతో పాటు జనవరి 20న జనంసాక్షి దినపత్రికలో ప్రచురితమైన "తాండాలకు తాళాలు" వలసలు అనే పత్రిక కథనాన్ని వినతికి జోడించి డిప్యూటీ సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా భట్టి స్పందిస్తూ.. రిజర్వాయర్ నిర్మాణానికి కృషి చేసేలా చర్యలు చేపడతామని హామీనిచ్చారు.


తండాలకు తాళాలు!



**డిప్యూటీ సీఎం భట్టికి 'జనంసాక్షి'లో వచ్చిన కథనాన్ని వివరిస్తూ వినతిపత్రం అందజేస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్**

## జీఎంఆర్ ఎయిరోకు వింగ్స్ ఇండియా 2026లో ప్రతిష్ఠాత్మక అవార్డులు

**రాజేంద్రనగర్, జనవరి30 (జనంసాక్షి) :** జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన విమానయాన విభాగం జీఎంఆర్ ఎయిరోకు వింగ్స్ ఇండియా 2026 కార్యక్రమంలో ప్రముఖ గుర్తింపు లభించింది. హైదరాబాద్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు హాజరై అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ తో పాటు హైదరాబాద్‌లో ఉన్న విమాన నిర్వహణ సంస్థ జీఎంఆర్ ఎయిరో టెక్నిక్ ప్రతిష్ఠాత్మక అవార్డులు అందాయి. ఇది భారతీయ పౌర విమానయాన రంగంలో జీఎంఆర్ ఏరో ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది.

# రద్దీ ఎక్కువుంటే.. అదనపు బస్సులు

**మేడారంలో ఆర్టీసీ కమాండ్ కంట్రోల్ పరిశీలించిన ఎండీ వై. నాగిరెడ్డి**



**ములుగు బ్యూరో (జనంసాక్షి) :** మేడారం మహా జాతరకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీజీఎస్ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి ఐపీఎస్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మేడారం జాతర నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ కమాండ్ కంట్రోల్‌ను ఆయన పరిశీలించి, బస్సుల నిర్వహణ, ప్రయాణికుల రద్దీ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతరకు ప్రత్యేకంగా నడిపిస్తున్న ప్రత్యేక బస్సులు, అదనపు సర్వీసులు, టైమింగ్‌లు, రూట్ మేనేజ్‌మెంట్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడకుండా బస్సు స్టేషన్ల వద్ద తగిన సిబ్బంది ఏర్పాటు చేయాలని, క్యూలైన్‌లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో అదనపు బస్సులను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, భక్తులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా చూడాలని ఆదేశించారు. మేడారం జాతర కోసం టీజీఎస్ఆర్టీసీ తీసుకున్న ప్రత్యేక చర్యల పట్ల ప్రయాణీకులు సంతృప్తి వ్యక్తం చేశారు. సకాలంలో బస్సులు అందుబాటులో ఉండటం, రూట్ సమాచారం స్పష్టంగా ఇవ్వడం వల్ల ప్రయాణం సౌకర్యవంతంగా సాగుతోందని భక్తులు తెలిపారు. కమాండ్ కంట్రోల్ పరిశీలన అనంతరం ఎండీ వై.నాగిరెడ్డి ఐపీఎస్ మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఫీల్డ్ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మం వేదికగా త్వరలో ఉమ్మడి ఖమ్మం-సామాజిక న్యాయ సభ

**బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం స్టేట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అవ్వారు వేణు కుమార్**

**42% రిజర్వేషన్లకై ప్రధాన పార్టీలు కదలాలి : ప్రొఫెసర్ వీరస్వామి**



**ఖమ్మం టౌన్ ( జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా వేదికగా తర్వలోన "ఉమ్మడి ఖమ్మం జిల్లా -సామాజిక న్యాయ సభను" నిర్వహించబోతున్నట్లు ముఖ్య అతిధులుగా హాజరైన బిసిఐఎఫ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్స్ ,డాక్టర్ అవ్వారు వేణు కుమార్, ప్రొఫెసర్ వీరస్వామి, కర్నాటి మనోహర్ నేత తెలిపారు. శుక్రవారం ఖమ్మం పట్టణంలో బిసి ఇంటలెక్చువల్ ఫోరం - ఉమ్మడి ఖమ్మం' జిల్లా ఆధ్వర్యంలో... బిసిఐఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండ పద్మ నేతృత్వంలో ఖమ్మం రెడ్ క్రాస్ సొసైటీ వేదిక గా సన్నాహక సమావేశాన్ని గా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అవ్వారు వేణు కుమార్ , ప్రొఫెసర్ వీరస్వామి, కర్నాటి మనోహర్ నేత లు మాట్లాడుతూ ... బీసీలకు 42% అమలు కావాలంటే దానికి ఏకైక మార్గం కేవలం 9వ షెడ్యూల్ ద్వారా రాజ్యాంగంలో చేర్చి రక్షణ కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బీసీలకు సామాజిక న్యాయం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా స్పష్టమైన హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేస్తామని ప్రకటించిందని, కానీ ఈ హామీ నీటి మూట అని తేలిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీల సందేహాలను నివృత్తి చేయాలన్నారు. అఖిల పక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి,42% రిజర్వేషన్ల బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్పించాలని అన్నారు. రానున్న ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో బీసీలకు తమకు దక్కాల్సిన వాటా 42 శాతాన్ని అమలు చేసేంతవరకు ఎన్నికలకు వెళ్ళవద్దని సూచించారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్, ప్రేక్షక పాత్ర వహించడం మానేసి, ఈ అంశాన్ని తక్షణమే టేకప్ చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం జనగణలో కుల గణన చేస్తామనీ హామీ ఇచ్చి మరో సారి మోసానికి సిద్ధమైనదని విమర్శించారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరిగే హౌస్ హోల్డ్ షెడ్యూల్ కాన్వాసింగ్ లొ 33 కాలమ్స్ ఉండగా అందులో కాలం నెంబర్ 12 లో ఎస్సీ ఎస్టీల వివరాలు మాత్రమే సేకరిస్తున్నారు. బీసీలను వదిలి వేస్తున్నారు ఇది జనగణనలో కులగనను నీరుగార్చడమేనని వారు విమర్శించారు. బీజేపీ - బీఆర్ఎస్ మూడు ప్రధాన రాజకీయ పార్టీలు బీసీల పట్ల బాధ్యతగా నిలబడి, 42% రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చి,బీసీలకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కర్నాటి మనోహర్ నేత మాట్లాడుతూ మేమెంతో మాకు అంత మా నినాదం ,అలాగే హిస్సా,ఇజ్జత్, హుకుమత్ మా ఉద్యమ నినాదాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షులు పిండిపూలు రామ్మూర్తి, పద్మశాలి సంఘం పొలిటికల్ ఫోరం కన్వీనర్ గుంటి నగేష్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీపతి, మున్నూరు కాపు సంఘం మూల గుండ్ల శ్రీహరి, శాలివాన సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీపతి, బీసీ విద్యార్థి యువజన అధ్యక్షులు రమణ, వినయ్,అనిల్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# బడ్జెట్‌కు ముందు ఈఎస్‌జీపై ప్రకటన



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సంజయ్ అగర్వాల్ తరపున బడ్జెట్‌కు ముందు ఇఎస్‌జిపై ప్రకటన చేశారు. 'భారతదేశ వృద్ధి కథకు స్థిరత్వం ఎలా మద్దతు ఇస్తుందో బలోపేతం చేయడానికి ఈ సంవత్సరం బడ్జెట్‌లో నిజమైన అవకాశం ఉందన్నారు. వాతావరణ ప్రమాదాలు క్షేత్రస్థాయిలో మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆర్థిక వనరులను స్వచ్ఛమైన శక్తి, స్థితిస్థాపక మౌలిక సదుపాయాలు, వాతావరణ ఆధారిత జీవనోపాధిలోకి మళ్లించడంలో సహాయపడే స్థిరమైన విధాన సంకేతాలు మనకు అవసరం. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఇప్పటికే అనుభవిస్తున్న కమ్యూనిటీలు, రంగాలకు అనుసరణ చాలా కీలకం. కాబట్టి భారతదేశ జాతీయ అనుసరణ ప్రణాళికపై మరింత స్పష్టత కోసం మేము ఎదురుచూస్తున్నాము. వాతావరణ చర్య, అభివృద్ధి ప్రాధాన్యతలు, సుపరిపాలనను కలిపిన బడ్జెట్ మరింత స్థితిస్థాపకంగా, సమగ్ర ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో అర్థవంతమైన పాత్ర పోషిస్తుందన్నారు.

## స్ట్రాంగ్‌రూంలు, కౌంటింగ్ సెంటర్ల పరిశీలన

**మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై అధికారుల కసరత్తు**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 30 (జనంసాక్షి):** మున్సిపాలిటీల సాధారణ ఎన్నికలు 2026 నేపథ్యంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఆలియాబాదు, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్‌రూంలు, కౌంటింగ్ సెంటర్లను ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కొర్ర లక్ష్మి, జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమా వళి ప్రకారం స్ట్రాంగ్‌రూంలు, కౌంటింగ్ సెంటర్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సూచించారు. స్ట్రాంగ్‌రూంల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, కౌంటింగ్ సెంటర్లలో కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు, భద్రతా బందోబస్తు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ సెంటర్లు, స్ట్రాంగ్‌రూంల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులు సాంబశివరావు, సుగుణబాయి పాల్గొన్నారు.

# సీపీఆర్ ఎందుకు..?

**ప్రెస్‌క్లబ్ సభ్యులకు సీపీఆర్, ప్రథమ చికిత్సలపై అవగాహన కార్యక్రమం**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** డాక్టర్ దగ్గరికి వెళ్ళేలోపు మనిషి ప్రాణాన్ని కాపాడటంలో ప్రథమ చికిత్స కీలకం. సీపీఆర్, ఇతర ప్రథమ చికిత్సా పద్ధతుల గురించి అవగాహన ఉంటే, మన కుటుంబ సభ్యులను, స్నేహితులను మనమే రక్షించుకోవచ్చు. డాక్టర్ దగ్గరికి చేరేలోపు ఒక ప్రాణాన్ని కాపాడే శక్తి ప్రథమ చికిత్సకు ఉంటుంది. అందుకే సోమాజిగూడా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సయాన్ క్యాన్సర్ క్లినిక్ సీపీఆర్‌పైన శుక్రవారం పెస్ క్లబ్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. దశాబ్దకాలంగా సీపీఆర్ శిక్షణ అందిస్తున్న గడ్డం దయాకర్ జర్నలిస్టులకు సీపీఆర్ ఎలా చేయాలన్నది డిమానిస్ట్రేట్ చేసి చూపించారు. అత్యవసర పరిస్థితుల్లో సాధారణ వ్యక్తులు కూడా ఎలా ప్రాణాలు కాపాడగలరో స్పష్టంగా వివరించారు. ఔత్సాహిక జర్నలిస్టులు, వారి పిల్లలతో సీపీఆర్ డిమానిస్ట్రేట్ చేయించారు. సీపీఆర్‌తో పాటు గొంతులో ఏదైనా ఇరుక్కుపోవడం, నీటిలో మునగడం, రక్తస్రావాన్ని ఆపడం, ఎముకలు విరగడం, కాలిన గాయాలు, మూర్ఛ-ఫిట్స్, అపస్మారకం, విద్యుత్ షాక్, కంటి గాయాలు, ముక్కు నుంచి రక్తం కారడం వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించారు. అలాంటి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

**సీపీఆర్ ఎందుకు?**

అకస్మాత్తుగా గుండె ఆగిపోవడం, శ్వాస ఆగడం, ప్రమాదాలు, ఫిట్స్, రోడ్డు ప్రమాదాలు వంటి పరిస్థితుల్లో డాక్టర్ దగ్గరికి చేరేలోపు గోల్డెన్ అవర్స్ అత్యంత కీలకం. ఆ సమయంలో సరైన ప్రథమ చికిత్స అందితేనే ప్రాణం నిలబడే అవకాశం ఉంటుంది. ఇటీవలి కాలంలో ఆకస్మిక గుండెపోట్లతో చాలామంది చనిపోతున్నారు. జర్నలిస్టుల్లో కూడా ఎందరో సడెన్ కార్డియాక్ డెత్ వల్ల మరణించారు. కొవిడ్ తర్వాత ఇలాంటి సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో సీపీఆర్ గురించి తెలుసుకోవడం ప్రతి ఒకరికీ చాలా అవసరం. సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిజజిటేషన్) అనేది గుండె, ఊపిరితిత్తులు పనిచేయడం ఆగినప్పుడు, మెదడుకు రక్తప్రసరణ కొనసాగించే అత్యవసర పద్ధతి. సీపీఆర్ పై సరైన అవగాహన ఉంటే, అంబులెన్స్ వచ్చేలోపు ఒక వ్యక్తి ప్రాణాన్ని కాపాడగలిగే అవకాశం ఉంటుంది. సీపీఆర్ ఎలా చేయాలో తెలుసుకుంటే మన కుటుంబ సభ్యులను, స్నేహితులను, ఆత్మీయులను, మన చుట్టూ ఉన్న వాళ్లలో ఎవరు ఆకస్మికంగా గుండెపోటుతో కింద పడిపోయినా, వైద్య సహాయం అందేలోపు వాళ్ల ప్రాణాలు పోకుండా కాపాడుకోవచ్చు. అలాగే గొంతులో ఏదైనా ఇరుక్కుపోవడం, నీటిలో మునగడం, అధిక రక్తస్రావం, విద్యుత్ షాక్, కాలిన గాయాలు, ఫిట్స్ వంటి సందర్భాల్లో తప్పు పద్ధతుల వల్ల ప్రాణాపాయం కలిగించే అవకాశం ఉంది. సరైన ప్రథమ చికిత్సా విధానాలు తెలుసుకోవడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించడమే కాకుండా, ప్రాణనష్టం జరగకుండా అడ్డుకోవచ్చు.

ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ జనరల్ సెక్రటరీ రమేశ్ వరికుప్పల మాట్లాడుతూ "ప్రథమ చికిత్సపై కనీస అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం. ముఖ్యంగా జర్నలిస్టులు ఎప్పుడూ ఫీల్డ్ లో ఉంటారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఎక్కువ. ఇలాంటి శిక్షణలు తీసుకోవడం వల్ల జర్నలిస్టులు తాము, తమ కుటుంబ సభ్యుల ప్రాణాలే కాకుండా, తమ చుట్టూ ఉండే వాళ్ల ప్రాణాలు కూడా కాపాడగలుగుతారు" అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ప్రెస్ క్లబ్ ఈసీ మెంబర్ రచన ముడుంబై ని ఆయన అభినందించారు. ప్రెస్ క్లబ్ ను కేవలం సమావేశాల వేదికగా కాకుండా, ఆరోగ్య అవగాహనకు కేంద్రంగా మార్చాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమం అనంతరం దయాకర్ గారికి ప్రెస్ క్లబ్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, ప్రెస్ క్లబ్ సభ్యులకు సీపీఆర్, ప్రథమ చికిత్సలపై అవగాహన కేవలం శిక్షణ మాత్రమే కాదు ఒక సామాజిక బాధ్యత అవుతుందన్నారు ప్రెస్ క్లబ్ ట్రెజరర్ రమేశ్ వైట్ల. ఈ కార్యక్రమంతో జర్నలిస్టులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో ఆసక్తిగా పాల్గొన్నారు. ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరీలు చిలుకూరి హరిప్రసాద్, బాపూరావు, ఈసీ మెంబర్ అమిత్ భట్టు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు.






# ఒకే పార్టీ.. ఇద్దరు ఉద్ధండులు

**మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ వర్సెస్ కాంగ్రెస్**


**మహబూబ్‌నగర్, జనవరి 30 (జనంసాక్షి) :** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అందరి దృష్టి ఇప్పుడు 49వ వార్డుపైనే నిలిచింది. ఇక్కడ జరుగుతున్న పోరు సాధారణ ఎన్నికలను తలపిస్తోంది. కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ సతీమణి ప్రసన్న ఈ వార్డు నుండి బరిలోకి దిగారు. అయితే, అదే వార్డులో సీనియర్ కాంగ్రెస్ నేత రాఘవేందర్ రాజు సతీమణి మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు భీమ కవి వసంత కూడా పోటీకి సై అనడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. వీరిద్దరూ కాంగ్రెస్ పార్టీ పేరుతోనే నామినేషన్లు దాఖలు చేయడం ఇప్పుడు పట్టణవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఒకరు అనుభవజ్ఞురాలైన మాజీ చైర్మన్ సతీమణి కాగా, మరొకరు పార్టీలో గట్టి పట్టున్న సీనియర్ నేత ప్రస్తుత మహిళ కాంగ్రెస్ పార్టి అధ్యక్షురాలు.వీరి ఇద్దరిలో ఎవ్వరికి సర్ది చెప్పాలో అర్థం కాక పార్టీ అధిష్టానం తలలు పట్టుకుంది.

## నిమ్స్ దవాఖానను సందర్శించిన డా.శ్రీనివాస్ బొల్లినేని



**ఖైరతాబాద్, జనవరి 30 (జనంసాక్షి) :** యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ సౌత్‌వెస్టర్న్ మెడికల్ సెంటర్(యూటీఎస్ డబ్ల్యూ ఎంసీ), డల్లాస్, టెక్సా స్‌కు చెందిన ప్రముఖ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డా.శ్రీనివాస్ బొల్లినేని శుక్రవారం నిజాం ఇన్స్టి ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) ను సంద ర్శించారు.ఈ సందర్భంగా డా. బొల్లినేని ఊపిరి తిత్తుల మార్పిడి(లంగ్ ట్రాన్స్‌ప్లాంటేషన్) రోగుల శస్త్రచికిత్స ముందు, తర్వాత నిర్వహణపై నిపుణు ల మార్గదర్శకత్వాన్ని అందించారు. ముఖ్యంగా శస్త్రచికిత్సకు ముందు సమగ్ర పరీక్షలు, శస్త్రచికిత్స అనంతరం జాగ్రత్తపూర్వక సంరక్షణ, దీర్ఘకాలిక ఆరోగ్య ఫలితాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్శనలో భాగంగా నిమ్స్‌లోని కార్డియోవాస్కు లర్, థొరాసిక్ సర్జరీ(సీవీటీఎస్) విభాగం, పల్మనా లజీ విభాగం, ఫిజియోథెరపీ బృందం వైద్యులతో అకాడెమిక్ చర్చలు నిర్వహించారు. ఈ చర్చల్లో బహుశాఖల సమన్వయ విధానం(మల్టీడిసిప్లినరీ అప్రోచ్) ప్రాముఖ్యతను ప్రత్యేకంగా ప్రస్తావించా రు. ముఖ్యంగా ట్రాన్స్‌ప్లాంటేషన్ ముందు శరీర సిద్ధత(ప్రిహాబిలిటేషన్), శస్త్రచికిత్స తర్వాత త్వరి త మొబిలైజేషన్, ఊపిరితిత్తుల పునరావాసంలో ఫిజియోథెరపీ కీలక పాత్రను హైలైట్ చేశారు. ఈ సందర్శన ద్వారా నిమ్స్, యూటీఎస్ డబ్ల్యూ మెడి కల్ సెంటర్ మధ్య కొనసాగుతున్న అకాడెమిక్, క్లినికల్ సహకారం మరింత బలపడింది. ఆధునిక, రోగి కేంద్రిత మరియు సాక్ష్యాధారిత లంగ్ ట్రాన్స్ ప్లాంట్ చికిత్స అందించాలనే నిమ్స్ నిబద్ధతను ఇది మరోసారి ధృవీకరించింది.

## చేవెళ్లలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నారాయణ రెడ్డి



**చేవెళ్ల, జనవరి 30 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఫరా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల బ్యాలెట్ బాక్సులు భద్ర పరిచేందుకు స్ట్రాంగ్ రూం, ఎన్నికల కౌంటింగ్ హాల్ ను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. నామినేషన్ లకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఆయా పార్టీల అభ్యర్థుల నుంచి నామినేషన్ ల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగిసిందన్నారు. శనివారం రోజున ఆయా పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు వేసిన నామినేషన్ లకు స్క్రూట్ని ఎన్నికల అధికారులు నిర్వహిస్తారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఇప్పటికే పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటి చేసే అభ్యర్థులకు నామినేషన్లు విత్ డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలోని 126 వార్డులలో 274 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఎన్నికల అధికారులకు, పోలీస్ సిబ్బందికి పార్టీ నాయకులు, అందరూ సహకరించాలన్నారు. ఆయన వెంట చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్, ఏసిపి కిషన్ గౌడ్, డిఐ ఉపేందర్, చేవెళ్ల మున్సిపల్ కమీషనర్ వెంకటేశం, చేవెళ్ల తాహసీల్దార్ క్రిష్ణయ్య, మున్సిపల్ సిబ్బందితో పాటు రెవెన్యూ అధికారులున్నారు.

## పారదర్శకంగా నామినేషన్ల ప్రక్రియ



### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**మక్తల్, (జనంసాక్షి) :** నామినేషన్ల ప్రకియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని చివరి రోజు నామినేషన్లు అధిక సంఖ్యలో దాఖలయ్యే అవకాశం ఉందని, సాయంత్రం 5 గంటల లోపు కేంద్రంలో ఎంత మంది అభ్యర్థులు ఉన్నా.. టోకెన్లు ఇచ్చి వారి నుంచి నామినేషన్లు స్వీకరిం చాలని కలెక్టర్ ఆర్వోలకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ మక్తల్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థుల బ్యాంక్ అకౌంట్ నంబర్లు, అఫిడ విట్లు, అవసరమైన ఇతర ధ్రువ పత్రాలు తీసుకుంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అక్కడ నామినేషన్లు దాఖలు చేస్తున్న ఒకరిద్దరు అభ్యర్థులతో మాట్లాడిన కలెక్టర్ ఏర్పాట్లు, సౌకర్యాల గురించి వాకబు చేశారు. కేంద్రాలలో వీడియో గ్రఫీ, సీసీ కెమెరాల ఏర్పాటు ను చూశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని నాలుగు మున్సిపాలిటీలలో నేటితో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందని, శనివారం స్క్రూటినీ నిర్వహించిన తర్వాత ఫిబ్రవరి 1న అప్పీలు అవకాశం, 2న డిస్పోజల్ అప్పీల్స్, 3న నామినేషన్ల ఉపసంహరణ అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని, 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని కలెక్టర్ వెల్లడించారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ కోసం ఆయా పట్టణాలలో సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం మక్తల్ మినీ స్టేడియంలో ఉన్న స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ (ఓట్ల లెక్కింపు)సెంటర్ ను ఆమె తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్లలో అన్ని ఏర్పాట్లు, అవసరమైన అన్ని వసతులు కల్పించాలని, బారికేడ్ వ్యవస్తను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అలాగే ఎన్నికల సామాగ్రి పంపిణీ (డిస్ట్రిబ్యూషన్/ రిసెప్షన్) సెంటర్‌ను విశాలమైన మిని స్టేడియంలో ఏర్పాటు చేయాలని, ఆయా కేంద్రాల వద్ద భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ రాజేందర్ గౌడ్, తహసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీ రాములు, సీ.ఐరామ్‌లాల్, మున్సిపల్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్డేపల్లి పుర సమరం రసవత్తరం

- చైర్మన్ గిరిపై ప్రధాన పార్టీల ఫోకస్
- త్రిముఖ పోటీలో నెగ్గేదెవరో?
- కార్యకర్తలకు మందు, విందులతో మచ్చిక...!




**అలంపూర్, జనవరి 30 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లాలోని, అలంపూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న.. వడ్డేపల్లి పురపాలక సంఘం ఎన్నికల్లో ఈసారి రెండు ప్రధాన పార్టీలతో పాటు పేరుగాంచిన ఓ అనుచర వర్గం మధ్య బిగ్ ఫైట్ నెలకొంది. దీంతో మున్సిపల్ ఎన్నికలు రసవత్తరమైన పోటీ నెలకొనే పరిస్థితులు తలెత్తాయి. చైర్మన్ పదవే లక్ష్యంగా ప్రధాన పార్టీలతో మరో బలమైన నేత విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ జరుగుతుంది. వడ్డేపల్లిలో మొత్తం 10 వార్డులకు సంబంధించి అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బరిలో నిలిపింది. వారందరు కాంగ్రెస్ పార్టీ లో చేరారు.దీంతో ఆ పార్టీకి పెరిగి గెలుపు అవ కాశా లు అధికార పార్టీ ఇక గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ మాత్రం అలంపూర్లో గెలుస్తుంది అని ప్రజలు చర్చిం చుకున్నట్లు తెలుస్తుంది? ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే ప్రాతినిత్యం వహిస్తున్న ఈ ప్రాంతంలో మరొకసారి పురపాలక ఎన్నికల్లో జెండా ఎగరేసి తమ బలాన్ని నిరూపించు కోవాలని చూస్తోంది.ప్రతిపక్ష పార్టీ అయిన బీఆర్ఎస్ ఎలాగైనా పీఠం దక్కించుకోవాలనే లక్ష్యంతో బలమైన నాయకత్వం కలిగిన నాయకులను బరిలో దింపింది. కాగా మాజీ జడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు తన అను చర వర్గంతో ఇటీవలే తెలంగాణ జాగృతి అధ్య క్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకు న్నారు. వడ్డేపల్లి లో ఆయనకున్న ప్రత్యేక ఇమేజ్ తో తన అనుచర వర్గాన్ని తెలంగాణ జాగృతి పార్టీ తరఫున బరిలో నిలుపుతోంది. వారందరు కాంగ్రెస్ పార్టీలో చేరారు.దీంతో ఆ పార్టీకి పెరిగి గెలుపు అవ కాశాలు అధికార పార్టీ గత ఆరేళ్ల నుంచి ఎలాంటి పదవిలో లేకపోవడంతో ఈసారి ఎలాగైనా చైర్మన్ పీఠం దక్కించుకోవాలని ముమ్మరంగా ప్రచార జోరు మా వర్గం కొనసాగిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో ఇటీవలే బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి మొగ్గు చూపారు.వారందరు కాంగ్రెస్ పార్టీ లో చేరారు.దీంతో ఆ పార్టీకి పెరిగి గెలుపు అవ కాశా లు అధికార పార్టీ వైపే కనిపిస్తున్నట్లు ప్రజల్లో చర్చ జరు గుతుంది.ఈ బలమైన త్రిముఖ పోటీలో చైర్మన్ పీఠం ఎవరికి దక్కుతుందోనని ఉత్కంఠ పట్టణ ప్రజల్లో నెలకొంది.

**మందు విందులతో భారీగా ఖర్చు?**

ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని బరిలో నిలిచిన ఆశావాహులు ఇప్పటికే ఓటర్లను ఆకట్టుకునేందుకు వార్డుల వారిగా మందు విందులతో మచ్చిక చేసుకున్నట్లు తెలుస్తోంది.నామినేషన్ వేసేందుకు వెళ్తున్న క్రమంలో అభ్యర్థులు పెద్ద ఎత్తున విందులు మద్యం పంపిణీకి భారీ ఖర్చుగా చేస్తున్నట్లు, తెలుస్తుంది? ఈ ఉత్కంఠ హోరాహోరీ పోరులో ఎవరు గెలుస్తారో అన్న చర్చ వడ్డేపల్లి పట్టణ ప్రజల్లో తీవ్రంగా జరుగుతుంది. ఓటర్లు ఎవరికి మద్దతు చూపుతారో తెలియాలంటే ఫిబ్రవరి 13 వరకు వేచి చూడాల్సిందే.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతవ్వడం ఖాయం: మాజీ మంత్రి హరీష్ రావు

- మెదక్ కాంగ్రెస్‌కు బిగ్ షాక్
- బీఆర్ఎస్ గూటికి సీనియర్ నేత సుప్రభాత్ రావు
- మున్సిపల్ ఎన్నికల వేళ హస్తం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ
- కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి హరీష్ రావు
- ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలపై ఎగిరేది గులాబీ జెండానే

**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 30 (జనంసాక్షి):** రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లోనే కాదు, ఆ పార్టీ సొంత నాయకుల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు గారి నివాసంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి,మెదక్ సీనియర్ నాయకులు కంఠరెడ్డి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో సుప్రభాత్ రావు తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ లో చేరారు. వారికి హరీష్ రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మెదక్ నియోజకవర్గంలోని రామాయంపేటలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సి. సుప్రభాత్ రావు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి, బీఆర్ఎస్ లో చేరారు. సుప్రభాత్ రావు గత 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఎన్ఎస్‌యుఐ నుంచి పీసీసీ సెక్రటరీ వరకు వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ. .అందుకే అభివృద్ధిని కాంక్షించే కరుడుగట్టిన కాంగ్రెస్ వాది సుప్రభాత్ రావు లాంటి సీనియర్ నాయకులు కాంగ్రెస్ ను వీడి బీఆర్ఎస్ లో చేరుతున్నారని పేర్కొన్నారు. రామాయంపేటలో సుప్రభాత్ రావు చేరికతో పార్టీ మరింత బలోపేతం అయ్యిందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రామాయంపేటలో ఎగిరేది గులాబీ జెండానే అని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. పార్టీని నమ్ముకుని వచ్చిన వారికి సముచిత స్థానం, గౌరవం ఉంటాయని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను, బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ గారి హయాంలో పట్టణ ప్రగతి తో మన పట్టణాలు, మున్సిపాలిటీలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. పచ్చదనం, పరిశుభ్రత, మెరుగైన సౌకర్యాలతో కళకళలాడిన పట్టణాలు.. నేడు కాంగ్రెస్ పాలనలో నిధులు లేక, నిర్వహణ లేక పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వచ్చాక ప్రగతి పూర్తిగా పడకేసిందని, మళ్ళీ మంచినీటి సమస్యలు, పారిశుధ్య సమస్యలు మొదలయ్యాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని హరీష్ రావు అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరిట రేవంత్ రెడ్డి అన్ని వర్గాలను మోసం చేశారు ఉన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని, ఉమ్మడి మెదక్ జిల్లాలో జరగబోయే అన్ని మున్సిపాలిటీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయబోయేది, విజయ ఢంకా మోగించేది బీఆర్ఎస్ పార్టీనే అని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను, వైఫల్యాలను గడప గడపకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సుప్రభాత్ రావు గారి రాకతో రామాయంపేటలో బీఆర్ఎస్ తిరుగులేని శక్తిగా మారిందని, కార్యకర్తలంతా ఐకమత్యంతో పనిచేసి మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి కేసీఆర్ గారికి కానుకగా ఇవ్వాలని కోరారు. పార్టీని నమ్ముకుని వచ్చిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి బీఆర్ఎస్ కుటుంబం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని హరీష్ రావు గారు భరోసా ఇచ్చారు.

**సుప్రభాత్ రావు మాట్లాడుతూ..**



కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలకు, నాయకులకు సరైన గుర్తింపు లేదని, కేవలం గ్రూపు రాజకీయాలకే పరిమితమైందని సుప్రభాత్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ తోనే సాధ్యమని, కేసీఆర్ గారు,హరీష్ రావు గారి నాయకత్వంపై నమ్మకంతోనే తాను బీఆర్ఎస్ లో చేరానని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రామాయంపేటలో గులాబీ జెండా ఎగురవేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలి

### కలెక్టర్ పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో జనవరి 30(జనంసాక్షి):** ఆధార్ పనిచే యని కేంద్రాల్లో శిబిరాలు ఏర్పాటు చేయాల ని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నా యక్ ఆదేశించారు. నారాయ ణపేట జిల్లా కలెక్టరేట్ కార్యా లయంలో జిశుక్రవారం కలె క్టర్ సిక్తా పట్నాయక్ అధ్య క్షతన డి ఎల్ ఏ ఎమ్ సి సమావేశం జరిగింది.ఈ సమావేశానికి రాష్ట్ర ఆధార్ ప్రాజెక్ట్ అసిస్టెం ట్ మేనేజర్ దామోదర్ , అసిస్టెంట్ కలెక్టర్ శ్రీను రెవెన్యూ ,అడిషనల్ డి.ఎస్.పి కమిటీ సభ్యులం దరూ హాజరయ్యారు.ఈ సమావేశంలో చర్చించిన అంశాలుఎన్ బియు పెండె న్సీ యుడైస్ పాఠశాల వారీగా పెండెన్సీ,ఆధార్ కేంద్రాలు పనిచేయని మండలాల్లో శిబిరాలను ఏర్పా టు చేయించడానికి సూచనలు ఇచ్చారు.ప్రతి ఏఈకె కేంద్రంలో కొత్త రేటు చార్టులు చెల్లుబాటు అయ్యే సహాయక పత్రాల జాబితా ప్రదర్శన చెయ్యాలి అని ఆదేశించారు.అలాగే డిసిపిఓడిఎస్డబ్ల్యూఓ ని సహాయక పత్రాల ధృవీ కరణ , సంతృప్తతతో పాటు అనాథ వ్యక్తు ల కోసం ప్రత్యే క శిబి రాలను నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అద నపు కలెక్టర్ రెవిన్యూ శ్రీను డి.ఎస్.పి లింగయ్య, ఎల్ . డి.యం. విజయ్ కుమార్,ఈ డి.యం.విజయ్,సంబంధిత అధికారులు .పాల్గొన్నారు.

## బిజెపి తోనే అభివృద్ధి సాధ్యం



- పుర ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టండి
- ఎం పి.డి.కే.అరుణ

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి):** కేంద్రం ఇచ్చిన నిధులతోనే పట్టణాల అభివృద్ధి సాధ్యమని మున్సిపాలిటీ ఎన్నికల్లో బిజెపికి పట్టం కట్టాలనిపాల మూరు పార్లమెంట్ సభ్యులు డి.కే.అరుణ అన్నారు.శుక్రవారం నారాయణ పేటలో బిజెపిరాష్ట్రనాయకులునాగురావు నామాజీ ,కే.రతంగ్ పాండు రెడ్డి, జిల్లా బిజెపి జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ ఇంఛార్జి శ్రీకాంత్‌తో కలిసి విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎన్నికలు నామినేషన్ నేటితో ముగిసింది, నారాయణపేట మున్సిపాలిటీలో 24 వార్డులు ఉండగా12 ఆన్ రిజర్వుడు, 8 బీసీ 3 ఎస్సి ఒకటి ఎస్టీ కాగా అందులో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం జరిగింది, బిజెపి అభ్యర్థులను గెలిపించి నారాయ ణపేట మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగరవేయాలని పట్టణ ప్రజలను కోరుతున్నాను. గతంలో బిజెపి అభ్యర్థులను గెలిపించిన మున్సిపాలిటీ చైర్మన్ కూడా అప్పటి అధికార పార్టీలో అభివృద్ధి పేరు చెప్పి పార్టీ మారారు. హామీలు అమలు చేయకుండా అధికార పార్టీలో ఉంటే అభివృద్ధి జరుగుతుందా అని ప్రలోభాలు పెట్టి ఇతర పార్టీలో ఉంటే నిధులు రావాలని భయపెట్టి పార్టీలో చేర్చుకున్నారు. నారాయణపేట మున్సిపల్ అభివృద్ధికి 34 కోట్ల అమృత పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చిందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి నా వంతు పూర్తి కృషిని అందజేస్తాను, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని ఉన్న అన్ని మున్సిపాలిటీలో ప్రజలు బిజెపిని గెలిపించాలని కోరారు. అభివృద్ధి లక్ష్యంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం కృషి చేస్తుంది, మున్సిపాలిటీ లలో కేంద్రం ద్వారా వచ్చిన నిధులు, ప్రజల నుంచి వచ్చిన పన్నుల ద్వారా మాత్రమే అభివృద్ధి జరుగుతుందనీ అన్నారు.అమృత్ పథకంలో అభివృద్ధి పనులకు కేంద్రం తన వాటా ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా పెండిం గ్ లో పెడుతుందనీ అన్నారు.అన్ని వర్గాల ప్రజలకు లబ్ది జరిగే లక్ష్యంతో మోదీ సర్కార్ పని చేస్తుం దన్నారు.వికసిత్ భారత్ లక్ష్యంతో 2047 నాటికి ప్రపం చ దేశాల సరసన అభివృద్ధి చెందిన దేశంగా నిలిపేందుకు పని చేస్తున్నారన్నారు.ప్రధాని మోదీ లక్ష్యం నెరవేర్చే విధం గా మున్సిపాలిటీల అభివృద్ధి చేసే అవకాశం బీజేపీ కి ఇవ్వాలని కోరారు.నారాయణపేట జిల్లాలో బీజేపీ కి మంచి ఆదరణ ఉందనీ ప్రజల విశ్వాసం కాపాడు కుంటామని అన్నారు.ఈసమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి,కోశాధికారి సిద్ది వెంకట్ రాములు,ఎన్నికల ఇంఛార్జి శ్రీకాంత్,కేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్,జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రఘు రామయ్య గౌడ్,నాయకులు మిర్చి వెంకటయ్య,సత్య రఘుపాల్ , పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్ పాల్గొన్నారు.

## రహదారుల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- రోడ్డు ప్రమాదాలను నివారించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** రహదారుల పెండింగ్ పనులు పూర్తి చేసి, రోడ్డు ప్రమాదాలను నివారించాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో రహదారుల అధికారులు,పోలీస్ అధికారులు ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. రహదారుల పెండింగ్ పనులు పూర్తి చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలనీ, గుంతలు పూడ్చాలని ,రోడ్లపై సి సి కెమెరాలు,సిగ్నల్స్,సైన్ బోర్డులు, యు టర్నింగ్ పాయింట్స్ లు, సోలార్ బల్బులు, లాంటి మొదలగు పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం మత్తు పదార్థాలను నిరోధించాలి మత్తు పదార్థాలను నిరోధించాలని, మత్తు పదార్థాలపై నిఘా పెంచాలని, పాఠశాల ,కళాశాల స్థాయిలో విద్యార్థులకు మత్తు పదార్థాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం పోక్సో చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టం, ముఖ్యమైన సహాయ హెల్ప్ నంబర్ల పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పీ మహేందర్,ఈ ఈ వేణు, డిడబ్ల్యూవో హిమా భార్గవి, రోడ్డు రవాణా అధికారులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

## కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్




**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె కంట్రోల్ రూమ్ యొక్క పనితీరును పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మున్సిపల్ ఎన్నిక లకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి అధికారులకు అందించాలని అన్నారు. కం౹ టోల్ రూమ్ కి ఏవీ అయినా ఫిర్యాదుల వచ్చి నయ అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి సాయిబాబా అధికారులు,. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఎంపీడీ టెక్నికల్ అఫీషియల్‌గా

### ఎంపికైన పిడి బి.రూప



**మక్తల్, జనవరి 30 (జనంసాక్షి):** ఈనెల 31 నుండి ఫిబ్రవరి 4 వరకు హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలో జరుగు 35వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఖో ఖో బాల బాలి కల పోటీలకు మక్తల్ మండలంలోని కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, ఖో ఖో ఎన్ ఐ ఎస్ కోచ్ బి.రూప ఎంఏ, ఎంపీడీ తెలంగాణ రాష్ట్రం తరఫున టెక్నికల్ అఫీషి యల్ గా ఎంపికైన ఏకైక మహిళ పిడి బి.రూప అని పాఠశాల జిహెచ్‌ఎం వెంకటయ్య తెలిపారు. ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సుధాన్ షు మిట్టల్, జనరల్ సెక్రటరీ ఉపకార సింగ్ విర్క్ ద్వారా నియామక పత్రం అందినట్లు హెచ్ ఎం వెంకటయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ బి.రూప మాట్లాడుతూ ఇండియా ఖోఖో ఫెడరేషన్ వారు, తెలంగాణ రాష్ట్ర అసోసి యేషన్ వారు నాపై నమ్మకంతో నన్ను జాతీయస్థాయి ఖోఖో టెక్నికల్ అఫీషియల్ గా నియమించినందుకు వారికి రుణపడి ఉంటానని, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జాతీయ స్థాయి ఖోఖో క్రీడలకు టెక్నికల్ అఫీషియల్ గా ఎంపికైన ఫిజికల్ డైరెక్టర్ బి.రూపను తెలంగాణ రాష్ట్ర ఖో ఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రాఘవరెడ్డి, ఎన్ కృష్ణమూర్తి, మహేందర్, పోచప్ప, అడ్వైజర్ బి. గోపాలం, ఉమ్మడి మహబూ బ్నగర్ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఒబేదుల్లా కొత్వాల్, విలియం కర్ని సర్పంచ్ దత్తు, హర్ష ఫౌండేషన్ అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి, బాబుల్ రెడ్డి ,హెచ్‌ఎం వెంకటయ్య, మల్లేశ్వర్ రెడ్డి, గంగాధర్, రఘువీరారెడ్డి, చక్రధర్, బలరాం, రవి, ఉపాధ్యాయ బృందము, గ్రామ ప్రజలు అభినందించారు.

## మునిసిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్ నగర్ టౌన్ జనవరి 30 (జనంసాక్షి):** శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రిసైడింగ్,సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, త్వరలో జరగనున్న మునిసిపల్ ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉన్నందున, ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా తమ విధులను నిర్వర్తించాలని సూచించారు. శిక్షణా కార్యక్రమాన్ని పూర్తిగా శ్రద్ధగా విని, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర అవగాహన పొందాలని తెలిపారు. ఏవైనా సందేహాలు ఏర్పడితే, ప్రిసైడింగ్ అధికారులకు అందజేసిన కరదీపికను హ్యాండ్ బుక్ జాగ్రత్తగా అధ్యయనం చేసి, చట్టబద్ధంగా, స్వేచ్ఛాయుతంగా మరియు నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే, తమకు కేటాయించిన పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు సకాలంలో చేరుకొని, ఫారం-12కు సంబంధించిన అన్ని ఎన్నికల సామగ్రిని పూర్తిగా పరిశీ లించి, ఏవైనా లోపాలు ఉన్నాయా లేదా నిర్ధారించుకోవాలని సూచించారు. తమకు కేటాయించిన సిబ్బందిని సమన్వయంతో సమీకరించి, అందరూ కలిసికట్టుగా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శివేంద్ర ప్రతాప్, మాస్టర్ శిక్షకులు బాలు యాదవ్ బైకాని, నాగరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## జడ్చర్ల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి
- రూ.1.15 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**జడ్చర్ల, జనవరి 30 (జనంసాక్షి):** జడ్చర్ల నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు సంజీవయ్య కాలనీలో రూ. 1.15 కోట్ల ముడ నిధులతో చేపట్టిన నూతన సిమెంట్ కాంక్రీట్ (సిసి) రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రతి పనిలో అత్యున్నత నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఏవైనాలోపాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరిస్తూనే, ప్రజలకు ఇబ్బంది కలగకుం డా నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జడ్చర్ల మున్సిపాలిటీని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి , ఇంజనీరింగ్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రైతులను కార్మికులను ఆప్యాయంగా పలకరించిన మాజీ మంత్రి



**వనపర్తి బ్యూరో (జనంసాక్షి):** వనపర్తి మార్కెట్ యార్డుకు వేరుశనగ పంట తెచ్చిన,రైతులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు.మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి చిట్యాల దగ్గర ఉన్న మార్కెట్ యార్డ్‌ను శుక్రవారం సందర్శించారు. నిరం జన్ రెడ్డి మార్కెట్‌లో ఉన్న వేరుసెనగ, ధాన్యరాశులను పరిశీలించి, దిగుబడి,మద్దతు ధర గూర్చి మహిళా రైతులను అడిగి తెలుసుకున్నారు. మహిళా రైతులు ఈ సంవత్సరం దిగుబడి పెరిగిందని, మద్దతు ధర కూడా సం తృప్తిక రంగా వచ్చిందని, మీ హాయంలో పుష్కలమైన సాగునీళ్ళు రావడం వల్లే సాధ్యం అయిందని, తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. హమాలీ, దడవాయి,చాట కూలీలను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసు కున్నారు.అనంతరం ట్రేడర్లతో సమావేశమై పలు విష యాలు చర్చించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి ,ట్రేడర్స్,కమిషన్ ఏజెంట్ల, మిల్లర్ల, హమాలీ, దడవాయి చాట కూలీల,రైతులను తమ,తమ వార్డులో ఉన్న బి.ఆర్.ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన వాళ్లు తమరి హయాములో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, కచ్చితంగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

## తాడ్వాయి- మేడారం మధ్య ట్రాఫిక్ జామ్



**మేడారం, జనవరి 30(జనం సాక్షి) :** మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా వచ్చిన భక్తులు తిరిగి ఆర్టీసీ బస్సుల్లో వెళుతున్న క్రమంలో శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల కొద్ది రహదారి లో వాహనాలు నిలిచి ఉండడంతో అసహనానికి గురయ్యారు. సకాలంలో ట్రాఫిక్ క్లియర్ చెయ్యక పోవడం తో ఇబ్బందులు పడ్డారు. వివిధ ప్రాంతాల నుంచి మేడారం కు వస్తున్న వాహనాలు, మేడారం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్ళే వాహనాలు నిలిచి ఉండడం వల్ల వందలాది బస్సుల్లో ఉన్న ప్రయాణికులు ట్రాఫిక్ జామ్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడం తో బస్సులో ఉన్న ప్రయాణికులు ఉక్కు పోత తో ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ జామ్ క్లియర్ చెయ్యాలని కోరారు.

# నేతలకు మొదలైన గుబులు

- అధికార పార్టీపైనే కాంగ్రెస్ రెబల్ అభ్యర్థుల నామినేషన్‌ల దాఖలు
- అభ్యర్థులకు బీ-ఫామ్
- అందజేయని మూడు ప్రధాన పార్టీల నేతలు
- పరకాల మున్సిపాలిటీ కైవసం మాది అంటే మాది అంటున్న మూడు ప్రధాన పార్టీలు




**హనుమకొండ ప్రతినిధి జనవరి 30 (జనం సాక్షి) :** మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల పర్వం నేటితో ముగిసింది హనుమకొండ జిల్లా లో ఒకే ఒక మున్సిపాలిటీ పరకాల ఉండడంతో అన్ని ప్రధాన పార్టీల నేతలు పరకాల వైపే మున్సిపాలిటీ కైవసం కోసం పరుగులు తీస్తున్నారు. నేతలు పరకాల లోనే గుడారాలు ఏర్పాటు చేసుకొని ప్రచారాలు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఒకవైపు కాంగ్రెస్ పార్టీకి పరకాల మున్సిపాలిటీ ఎన్నికలు తలనొప్పిగా మారేలా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది అధికార పార్టీ అధిష్టానం అనుమతి తీసుకోకుండానే కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. ప్రతిపక్ష పార్టీ అయినా బిఆర్ఎస్ పార్టీ 22 స్థానాలకు అభ్యర్థులను నామినేషన్ దాఖలు చేయించడం జరిగింది కానీ కొన్ని స్థానాలలో బి.ఆర్ఎస్ రెబల్ అభ్యర్థులు కూడా నామినేషన్లు దాఖలు చేసుకోవడం జరిగింది బిజెపి పార్టీలో కూడా బిజెపి రెబల్ అభ్యర్థులు కొన్నిచోట్ల నామినేషన్లు దాఖలు చేసుకున్నారు. మూడు ప్రధాన పార్టీలకు రెబల్ అభ్యర్థులతో తలనొప్పులు వచ్చేలా ఉన్నాయి పార్టీల బీఫామ్ ఎవరికి ఇవ్వాలి ఎవర్ని బుజ్జగించాలో అనే సముచిత ఆలోచనలు నేతలు తలలు పట్టుకుంటున్నారు మూడు ప్రధాన పార్టీల నేతలు ఏ ఒక్క అభ్యర్థికి బి ఫాం అందజేయలేదు బీఫామ్ ఇచ్చిన నేతకు పార్టీ నాయకులు కట్టుబడి ఉండకుంటే పార్టీ తీసుకునే నిర్ణయం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందనిమూడు ప్రధాన పార్టీల నేతలు రెబల్ అభ్యర్థులకు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు చర్చలు జరుగుతున్నాయి కొన్ని పార్టీల రెబల్ అభ్యర్థులు ససేమి అంటూ ఇండిపెండెంట్ గానైనా నిలబడడానికి సిద్ధమే అని సిద్ధమవుతున్నారు పార్టీ అటువంటి సస్పెండ్ చేసిన మేము పోటీకి నిలబడడం ఖాయమని నామినేషన్ దాఖలు చేసిన అందరూ రెబల్ అభ్యర్థులు వాపోతున్నారు. పరకాల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందా..!లేక ప్రతిపక్ష పార్టీ అయినా బి ఆర్ ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుందా..! లేక పరకాలలో ఎమ్మెల్యే ఎన్నికలలో అధిక ఓట్లు సంపాదించిన బిజెపి కైవసం చేసుకుంటుందా..! అనే ఆలోచనలో మూడు ప్రధాన పార్టీల జిల్లా నేతలంతా పరకాల వైపే ఎదురుచూస్తున్నారు. నేతల ధీమా అంతా పరకాల మున్సిపాలిటీ మాది అంటే మాది అనే ధీమాతో ఉన్నారు.

## తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించిన గూడూరు ఎస్ఐ



**మహబూబాబాద్ ప్రతినిధి, జనవరి 29 (జనం సాక్షి) :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం చింతల గట్టు వట్టి వాగు సమీపంలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతరలో తప్పిపోయిన ఓ చిన్నారిని గూడూరు ఎస్సై గిరిధర్ రెడ్డి మానవీయతతో తల్లిదండ్రులకు చేరదీశారు. జాతర సందర్భంగా జన సమూహంలో దారి తప్పిన చిన్నారిని గుర్తించిన ఎస్సై గిరిధర్ రెడ్డి వెంటనే పోలీసు సిబ్బందితో కలిసి ఆమెను భద్రంగా ఉంచారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అనౌన్స్‌మెంట్ మైక్ ద్వారా చిన్నారి తండ్రి పేరును ప్రకటిస్తూ, "మీ కుమార్తె సురక్షితంగా మా వద్ద ఉంది" అని ప్రకటన చేశారు. కొద్దిసేపటి తర్వాత చిన్నారి తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని తమ కుమార్తెను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు గూడూరు ఎస్సై గిరిధర్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల భద్రతకు పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని ఈ ఘటన మరోసారి చాటింది.

## తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించిన ఎమ్మెల్యే గండ్ర



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మేడారంలోని సమ్మక్క, సారలమ్మ తల్లులకు శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నిలువెత్తు బంగారం సమర్పించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, పద్మ(గణపురం మాజీ జడ్పీటీసీ) దంపతులు వనదేవతలను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా తల్లులకు చెల్లించే మొక్కులో భాగంగా ఎమ్మెల్యే కాంటాలో కూర్చోగా 71కిలోల బంగారం తూకం వేసి సమర్పించారు. గిరిజన సంప్రదాయం ప్రకారం బెల్లాన్ని బంగారంలా భావించి సమర్పించడం మేడారం జాతరలో ముఖ్యమైన ఆచారమని, శ్రీ సమ్మక్క - సారలమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే దంపతులు మొక్కుకున్నారు.

### గట్టమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు..

మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ తల్లుల దర్శనంకు ముందు ఎమ్మెల్యే దంపతులు ములుగు పట్టణానికి సమీపంలోని గట్టమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే దంపతులకు అధికారులు, పూజారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు. మేడారం గిరిజన జాతరకు వెళ్లే భక్తులకు గట్టమ్మ ఆలయం గేట్ వే ఆఫ్ మేడారం గా ప్రసిద్ధి చెందింది.

### కమలాపూర్ సమ్మక్క సారలమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు..

భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామ శివారులో జరుగుతున్న శ్రీ సమ్మక్క - సారలమ్మ మినీ మేడారం జాతరలో ఎమ్మెల్యే దంపతులిద్దరూ పాల్గొని, వన దేవతలను దర్శించుకుని మొక్కులను చెల్లించారు. కాగా, జాతర కమిటీ నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దంపతులకు శాలువాలు కప్పి డప్పు చప్పుళ్ళతో స్వాగతం పలికారు. కమలాపూర్ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

## ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి రద్దు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మున్సిప‌ల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ కొనసా గుతున్న నేపథ్యంలో, ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా యంత్రాంగం మొత్తం పురపాలక ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసునట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి యంత్రాంగానికి సహకరించాలని ఆయన సూచించారు.

## సబ్ జైల్ సందర్శించిన డిజి సౌమ్య మిశ్రా




**హనుమకొండ ప్రతినిధి జనవరి 30 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా పరకాల సబ్ జైలు ను శుక్రవారం జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖైదీలకు వసతుల సౌకర్యాలను, ఖైదీల నుండి అడిగి తెలుసుకుని వారికి కావలసిన అవసరాలను, కావాల్సిన మౌలిక సౌకర్యాలు ఏర్పరచుటలో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. అనంతరం జైలు ప్రాంగణంలో సమగ్రంగా పరిశీలించారు. అనంతరం నర్సంపేట సబ్ జైల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ డిప్యూటీ జైలర్ గడ్డం దైనమ్మ ఈనెల 31 తో పదవి విరమణ చేస్తుండడంతో ముందస్తుగా వారు చేసిన సేవలకు అభినందన తెలుపుతూ ప్రభుత్వపరంగా వారికి అందవలసిన బెనిఫిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఐజి సంపత్, డిఎస్ జే ఓ వెంకటస్వామి , పరకాల జైలు సూపరిండెంట్ ప్రభాకర్, సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం..



**వరంగల్ ప్రతినిధి, జనవరి 30 (జనంసాక్షి):** పురపాలక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం 2వ సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అనుసరించాల్సిన విధి విధానాలు, ఎన్నికల ఖర్చుల నియంత్రణపై చర్చించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఎన్నికల ఖర్చులకు సంబంధించిన రేట్ చార్ట్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కో పార్టీ అభ్యర్థి లక్ష రూపాయల కంటే ఎక్కువ ఖర్చు చేయకూడదని స్పష్టం చేశారు. అలాగే చేసిన ప్రతి ఖర్చును లెక్కల రూపంలో నమోదు చేసి, సంబంధిత అధికారులకు సమర్పించాల్సిందిగా సూచించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, డీపీవో కల్పన, బీఎస్పీ పార్టీ తరఫున హరిశంకర్, వైఎస్సార్‌సీపీ తరఫున రజినీకాంత్, బీఎస్పీ పార్టీ తరఫున అనిల్ కుమార్, ఏఐ ఎం ఐ ఎం నుండి సయ్యద్ ఫైజుల్లా, తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అగ్రం పహాడ్ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే



**ఆత్మకూరు (జనంసాక్షి) :** ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ వన దేవతలు శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం మొక్కులు తీర్చుకొని, తల్లుల దీవెనలు భక్తులకు ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమ్మక్క - సారలమ్మ తల్లులు ఆశీస్సులతో పరకాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, మరింతగా అభివృద్ధి చెంది ప్రజలు సుభిక్షంగా ఉండాలని అన్నారు. పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిన సిబ్బందిని అభినందించారు.

## గుర్రంపేట జాతరను సందర్శించిన కలెక్టర్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మండల పరిధిలోని గుర్రంపేటలో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ మిని మేడారం జాతరను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయ సంప్రదాయం ప్రకారం మేళ తాళాలతో స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారం చెల్లించారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రత, పారిశుధ్యం, త్రాగునీరు, వైద్య సేవలు సమర్థవంతంగా అందించాలని సూచించారు. జాతరను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ హరికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్, అధికారులు, ఆలయ సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీజీ వర్ధంతి



**బెల్లంపల్లి, జనవరి 30, (జనంసాక్షి) :** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2ల ఆధ్వర్యంలో శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం సత్యం, అహింస అనే ఆయుధాలతో జీవిత చరమాంకం వరకు పోరాడి దేశానికి స్వాతంత్రం రావడంలో కీలక పాత్ర పోషించిన ఆ మహనీయుని సేవలు మరువలేనివని అన్నారు. మహాత్మా గాంధీ చూపిన బాటలో మనమంతా నడవాలని ఆకాంక్షించారు. ఆయనను స్మరించుకుంటూ కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎంఎ రేష్మా, గజెల్లి మోహన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సూపర్డెంట్ పి శ్రీనివాస్, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ఆలయంలో మేడారం భక్తుల రద్దీ



**కాళేశ్వరం , జనవరి 31 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం ఆలయం శుక్రవారం మేడారం భక్తుల రాక సందర్భంగా సందడిగా మారింది. మేడారం జాతర సందర్భంగా సమ్మక్క సారక్క లకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు మేడారం నుండి తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం ఆలయానికి చేరుకొని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకుంటున్నారు.తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర,చత్తీస్ గడ్ ప్రాంతాల భక్తులు తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం ఆలయాన్ని దర్శించుకుని తిరిగి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.

## 2026 కేంద్ర బడ్జెట్‌లో నిర్మల్ రైల్వే లైన్‌కు నిధులు కేటాయించాలి

- కన్వీనర్ ఎం సి.లింగన్న




**నిర్మల్ బ్యూరో, జనవరి 30 (జనంసాక్షి) :** ఆదిలాబాద్-నిర్మల్-ఆర్మూర్-హైదరాబాద్ రైల్వే లైన్‌కు 2026 కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని రైల్వే లైన్ సాధన కమిటీ చైర్మన్ ఎంసీ లింగన్న డిమాండ్ చేశారు గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. నిర్మల్ మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు కోసం గతంలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులు, ఎంపీలు, రాజ్యసభ సభ్యులను కలిసి వినతులు సమర్పించినట్లు తెలిపారు.గత బడ్జెట్ లో నిధులు కేటాయించలేదు,ఈసారి అయినా 2026 బడ్జెట్‌లో నిధులు విడుదల చేసి నిర్మల్ ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ ప్రధాన కార్యదర్శి యాటకారి సాయన్న ముదిరాజ్, సెక్రటరీ గొజ్జ జనార్ధన్, జాయింట్ సెక్రటరీలు రాఘవులు, చాంద్ పాషా, మూర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జనవరి 30 (జనంసాక్షి):** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలో ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎన్నికల సందర్భంగా జరుగుతున్న పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో ఏర్పాటు చేసిన 265 పోలింగ్ కేంద్రాలకు గాను 265 మంది పి.ఓ. లతో పాటు 20 శాతం అదనంతో 53 మంది రిజర్వ్ పిఓలు, 265 మంది ఏపిఓలతో పాటు 20 శాతం అదనంతో 53 మంది ఏపిఓలు, 795 మంది ఓపిఓలతో పాటు 20 శాతం అదనంతో 159 మంది ఓపీవోలను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో ఏర్పాటు చేసిన 68 పోలింగ్ కేంద్రాలకు గాను 68 మంది పిఓలతో పాటు 20 శాతం అదనంతో 14 మంది రిజర్వ్ పీవోలు, 68 మంది ఏపీవోలతో పాటు 20 శాతం అదనంతో 14 మంది ఏపిఓలు, 204 మంది ఓపీవోలతో పాటు 20 శాతం అదనంతో 41 మంది ఓపీవోలను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులలో ఏర్పాటు చేసిన 36 పోలింగ్ కేంద్రాలకు గాను 36 మంది పీవోలతో పాటు 20 శాతం అదనంతో 7 మంది రిజర్వ్ పీవోలు, 36 మంది ఏపీవోలతో పాటు 20 శాతం అదనంతో 7 మంది ఏపీవోలు, 108 మంది ఓపీవోలతో పాటు 20 శాతం అదనంతో 22 మంది ఓపీవోలను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులలో ఏర్పాటు చేసిన 45 పోలింగ్ కేంద్రాలకు గాను 45 మంది పి.ఓ. లతో పాటు 20 శాతం అదనంతో 9 మంది రిజర్వ్ పీవోలు, 45 మంది ఏపీవోలతో పాటు 20 శాతం అదనంతో 9 మంది ఏపీవోలు, 135 మంది ఓపీవోలతో పాటు 20 శాతం అదనంతో 27 మంది ఓ.పి.ఓ.లను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులలో ఏర్పాటు చేసిన 15 పోలింగ్ కేంద్రాలకు గాను 30 మంది పీవోలతో పాటు 20 శాతం అదనంతో 6 మంది రిజర్వ్ పీవోలు, 30 మంది ఏపీవోలతో పాటు 20 శాతం అదనంతో 6 మంది ఏపీవోలు, 90 మంది ఓపీవోలతో పాటు 20 శాతం అదనంతో 18 మంది ఓపీవోలను రాండమైజేషన్ జరిగిందని తెలిపారు. సిబ్బంది తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అధికారులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరికల జోష్

- ముున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్‌లో భారీ చేరికలు
- మెదక్ బల్దియా పై ఎగిరేది బిఆర్ఎస్ జండానే
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్ రెడ్డి



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 30 (జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. పట్టణంలోని పలు వార్డులకు చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ లో చేరారు.వార్డ్ నెంబర్ 10 నుండి కాంగ్రెస్ నాయకులు చింతల శ్రీను, కిషన్, మంద శేఖర్ తో పాటు 20 మంది కార్యకర్తలు,మహిళలు కూడ అలాగే వార్డు నెం 27 నుండి పల్లె రాణి బాలరాజ్ లంతో పాటు 20 మంది కార్యకర్తలు, వార్డ్ నెంబర్ 31 ఆర్కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు వరాల. రాములు, రణధీర్ , కంచర్ల శ్రీధర్, యాదగిరి, నరేష్ మంగలి మహేష్, ఆకుల రాహుల్ పాటు 30 మంది కార్యకర్తలు పద్మ దేవేందర్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ లో చేరారు.వీరికి పద్మ దేవేందర్ రెడ్డి, మెదక్ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ గులాభి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ..బిఆర్ఎస్ లో చేరిన వారిని అభినందించి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలు తప్ప ఈ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి ఒకటి కూడా నెరవేర్చలేదన్నారు. రానున్న కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రావాలని, మళ్లీ కేసిఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. పార్టీలో యువకుల చేరికతో భవిష్యత్ రాజకీయాలకు శుభ పరిమాణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల. మల్లికార్జున్ గౌడ్,పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ. ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ ఆర్కే.శ్రీనివాస్, నాయకులు లింగా రెడ్డి,కందేల. నర్సింలు,కసాపురం మధు,శ్రీనివాస్ గౌడ్, కృష్ణ,కిరణ్,రవి భువన్,చంద్ పాషా తదితరులు ఉన్నారు.

# మహిళలు,పిల్లల కోసమే భరోసా కేంద్రం

- ఫోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి
- అదనపు ఎస్పీ మహేందర్




**మెదక్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** నెలవారి తనిఖీల్లో భాగంగా శుక్రవారం మెదక్‌లోని భరోసా కేంద్రాన్ని జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, భరోసా కేంద్రం తెలంగాణ మహిళా పోలీస్ భద్రతా విభాగం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు.భరోసా కేంద్రం పూర్తిగా మహిళల, పిల్లల సంక్షేమానికి, ముఖ్యంగా ఫోక్సో కేసులపై ప్రత్యేక దృష్టితో పని చేస్తోంది. బాధితులకు రక్షణ, సహాయం, పునరావాసం, అలాగే సంపూర్ణ న్యాయ సహాయం అందించడమే భరోసా కేంద్రం ప్రధాన బాధ్యత అని, ఎఫ్ ఐ ఆర్ దశ నుంచి తీర్పు వచ్చే వరకు బాధితులకు మరియు వారి కుటుంబాలకు లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ శ్వేత సంపూర్ణ న్యాయ సహాయం అందిస్తున్నారని, బాధితుల కోసం ప్రభుత్వ పరిహారం అందేలా కూడా చర్యలు తీసుకుంటున్నాం అని అదనపు ఎస్పీ అన్నారు. అదేవిధంగా న్యాయ సహాయంతో పాటు కౌన్సిలింగ్ థెరపీ, అవసరమైన సందర్భాల్లో వైద్య సహాయం కూడా అందించబడుతోందని, తనిఖీ సమయంలో రిజిస్టర్లు, న్యాయ సమాచారాన్ని సమీక్షించారు. దర్యాప్తులో ఉన్న లోపాలు, బాధితుల ఫిర్యాదులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఫాలో-అప్ కౌన్సిలింగ్, కోర్టు విచారణలు, మరియు సెక్షన్ 180 బి ఎన్ ఎస్ ఎస్ ప్రకారం వాంగ్మూలాల నమోదు పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.కౌన్సిలింగ్ గది బాధితులకు సురక్షితంగా, అనుకూలంగా ఏర్పాటుచేసిన వాతావరణాన్ని అదనపు ఎస్పీ గారు అభినందినందించారు. భరోసా బృందం అంకితభావంతో విధులు నిర్వహించడం అభినందనీయని అదనపు ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సౌమ్య, లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ శ్వేత, సపోర్ట్ పర్సన్ భార్గవి, , నర్స్ సౌందర్య, రిసెప్షనిస్ట్ శ్రీలత, డీఈఓ లావణ్య పాల్గొన్నారు.



## క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

**సూర్యాపేట (జనంసాక్షి):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో సైతం రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, జాతీయస్థాయిలో రాణించినకి ఉన్నత విద్యను అభ్యసించడానికి, ఉపాధి రంగంలో క్రీడా రిజర్వేషన్ ఉంటుందని శ్రీ వెంకటేశ్వ ర డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం.సురేష్ రాజ్, సెక్రటరీ బి.సురేందర్ రెడ్డి అన్నారు.ఆల్ ఇండియా 85వ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎయిడెడ్ కళాశాలలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో గెలుపొందిన విద్యార్థులను శుక్రవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ వి.వెంకటేశులుతో కలిసి అభినందించారు.గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటాలని సూచించారు.యాజమాన్యం కళాశాల అభివృద్ధికి తోడ్పడుతుందని, విద్యార్థులు కళాశాల కల్పిస్తున్న అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఆర్ శాస్త్రి, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పితే..పెనుప్రమాదమే..!



ఆ వంతెన పై వాహన చోదకులు అదుపు తప్పితే పెనుప్రమాదమే రెప్పపాటులో వాగులోకె.. ప్రాణాలు గాల్లో కలిసిపోయినట్లే ఖమ్మం దేవరపల్లి స్టేట్ హైవే పెనుబల్లి మండలం విఎం బంజర్ సమీపంలో హైవే పై ఉన్న వంతెనపై ఏర్పాటు చేసిన సైడ్ వాల్స్ పూర్తిగా పాడైపోయి కనుమరుగయినాయి,దింతోవంతెన ప్రమాదకరంగా మారింది, సంబంధిత అధికా రుల నిర్లక్ష్యం మూలంగా పెను ప్రమాదాలకు నోళ్ళు తెరిసినట్టుగా ఈ వంతెన దర్శనమిస్తుంది. "చేతులు తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా " కాకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అనాధ శవాలకు అంత్యక్రియలు



**ఖమ్మం, (జనంసాక్షి):** ఖమ్మం జి ఆర్ పి పోలీస్ పరిధిలోని ఇటీవల గుర్తుతెలియని ఇద్దరు మగ వ్యక్తులు రైలు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసులు మృత దేహాలను ప్రభుత్వ వైద్యశాలలో మార్చరిలో భద్రపరిచారు. ఇప్పటివరకు మృతదేహాల కొరకు ఎవరూ రానందున అనాధ మృతదేహాలుగా భావించిన రైల్వే పోలీస్ వారు మృతదేహాలను అంత్యక్రియల నిమిత్తం అన్నం ఫౌండేషన్ కి అప్పగి ంచారు. అన్నం ఫౌండేషన్ సభ్యులు మృతదేహాలను ప్రభుత్వ వైద్యశా ల మార్చరీ నుండి రైల్వే పోలీసులు వైద్యశాల సిబ్బంది సమక్షంలో స్వాధీనం చేసుకొని నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామానికి తరలించి దహన సంస్కారాలు చేశారు. ఈ కార్యక్రమంలో అన్నం పౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## అట్టహాసంగా సిపిఐ అభ్యర్థుల నామినేషన్

### పాల్గొన్న భాగం హేమంతరావు, దండి సురేష్



**ఖమ్మం రూరల్, (జనంసాక్షి):** ఎదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 28, 29, 30, 31,32 ,24 ,19, 16, 3 వార్డులకు సిపిఐ అభ్యర్థులు శుక్రవారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. తొలుత ఎర్రజెండాల రెపరెపల నడుమ ద్విచక్ర వాహన ర్యాలీగా నామినేషన్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థుల నామినేషన్లలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, మెడకంటి చిన్న వెంకటరెడ్డి, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, నాయకుడు చిన్న సైదిరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపాలిటీ నాయకులు, యువజన సంఘం సభ్యులు, మహిళా సమైక్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 7 లక్షల విలువైన గంజాయి పట్టివేత





- ఆలయ భూముల్లో గంజాయి సాగు..
- 685 గంజాయి మొక్కలు ధ్వంసం...
- 17.741 కేజీల ఎండు గంజాయి స్వాధీనం..
- 8 97 కేజీల గంజాయి గింజలు.
- ఒకరిపై కేసు నమోదు..

**నారాయణఖేడ్ (జనంసాక్షి):** ఆలయ భూముల్లో గంజాయి సాగు.. సంగారెడ్డి జిల్లా పంచగామలో ఘటన చోటు చేసుకుంది. ఎక్సైజ్ హరికృష్ణ, డీసీ మెదక్ నవీన్ చంద్ర ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం పంచగామ విఠలేశ్వర ఆలయ పరిసరాల్లో గంజాయి కలకాలం ఆలయ భూముల్లో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సాగు చేశారు. పక్క సమాచారంతో దాడి చేసిన ఎక్సైజ్ పోలీసులు. 15 కిలోల ఎండు గంజాయి తో పాటు 685 గంజాయి మొక్కలను ధ్వంసం చేసిన ఎక్సైజ్ పోలీసులు.. గంజాయి సాగులో ఓ స్వామీజీ హస్తము ఉన్నట్లు సమాచారం రహస్యంగా విచారణ చేస్తున్న విచారణ చేశారు. శుక్రవారం దాడులు నిర్వహిం చారు. గ్రామానికి చెందిన ఆవుటి నాగయ్య తన వ్యవసాయ భూమిలో అంతర్ పంటగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నడని సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. ఆవుటి నాగయ్య తన వ్యవసాయ భూములు పత్తి పంటలు అంతర్ పంటగా గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడు అట్టి గంజాయి మొక్కలను లెక్కించగా 685 గా ఉన్నాయి. అతని వద్ద 17.741 కేజీల ఎండు గంజాయి, 897 కేజీల గంజాయి గింజలు, 30 వేల రూపాయల నగదు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని సిబ్బంది సాయంతో మొక్కల ను తొలగించారు. స్వామీజీ నీఅరెస్టు చేసి కేసు నమోదు నమోదు చేశామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. కార్యక్రమం లో సిఐ శంకర్, ఎస్సైలు జి.హనుమంతు, డి.అనుదీపు, కానిస్టేబుల్ అంజిరెడ్డి, అరుణ జ్యోతి, రాజేష్, శివ కాంత్ పాల్గొన్నారు.

## హాలియాలో కాంగ్రెస్ బాకీ కార్డు విడుదల

### నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యుడు నోముల భగత్ కుమార్



**హాలియా, జనవరి 30 (జనంసాక్షి):** హాలియా పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలును గుర్తు చేస్తూ బాకీ కార్డును నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యుడు నోముల భగత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఎన్నికల సమన్వయకర్త తిప్పన విజయ సింహ రెడ్డి, రాష్ట్ర మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవల్లి విజేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు సాధం సంపత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, గత టీఆర్ఎస్ పాలనలో రైతుబంధు, రైతుబీమా, దళిత బంధు, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చినట్లు గుర్తు చేశారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన ఈ పథకాలు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడ్డాయని తెలిపారు.

**బిఆర్ఎస్ పార్టీలో చేరికలు**

హాలియా కిరాణం అసోసియేషన్ అధ్యక్షులు చిట్టిపోలు శ్రీనివాసు ఎల్లారెడ్డి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భీమనపల్లి గ్రామంలో పర్మిషన్ లేకుండా అక్రమ కట్టడాలు



**మర్రిగూడ, జనవరి 30 (జనంసాక్షి):** నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి గ్రామ శివారులో గల 581 సర్వే నెంబర్లో ప్రభుత్వ అధికారుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధం గా భీమనపల్లి గ్రామంలో కోళ్ల ఫారం నిర్మాణం చేపట్టారని గ్రామస్తులు మర్రిగూడ ఎంపీడీవో కు భీమనపల్లిగ్రామ సెక్రటరీకి గ్రామ ప్రజలు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు అతనిపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఎవరిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికే కోళ్ల ఫారం షెడ్డు అక్రమంగా నిర్మించిన షెడ్డుతో భీమనపల్లి గ్రామస్తులు పాదాచార్యులు, దుర్వాసనకు దోమలకు ,ఈగలకు, పాముల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా నిర్మిస్తున్న కోళ్ల షెడ్డును నిలిపివేయాలని అధికారులకు భీమనపల్లి గ్రామ ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిల్లా అలివేలు, కృష్ణయ్య, మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దోమల వెంకటయ్య యాదవ్, అచ్చి నీ సైదులు, కర్నాటి వెంకట్ గౌడ్, అంబల్ల రవి, ఐత రాజు రమేష్ ,పక్రుద్దీన్ ,పగిళ్ల సైదులు, పంతంగి మహేష్ పాల్గొన్నారు.




## ముగిసిన భద్రతా వారోత్సవాలు

**మేళ్లచెరువు (జనంసాక్షి):** స్థానిక మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేళ్లచెరువు నందు 37వ జాతీయ రోడ్డు భద్రతవారోత్సవాలు ముగింపు సభ ఘనవిజయంగా జరిగినది ఈ సభకు ముఖ్య అతిథిగా డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఉమ్మడి నల్గొండ సూర్యాపేట జిల్లా డాక్టర్ చీ.వాణి ,యూనిట్ హెడ్ యన్ శ్రీనివాసరావు , జిల్లా రవాణా అధికారులు ,జయ ప్రకాశ్ రెడ్డి, లావణ్య మేడం, ఎస్ కే జిలాని మోటార్ ట్రాన్స్పోర్ట్ ఇన్స్పెక్టర్ కోదాడ మరియు ఆర్టిఏ ఆఫీసర్స్ సిబ్బంది. భద్రత విభాగం వారు అందరి చేత రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలోని గత నెల రోజులుగా భద్రత వారోత్సవాలు పురస్కరించుకుని ఫ్యాక్టరీలోని వివిధ రకాలైనటువంటి కాంపిటీషన్స్ నిర్వహించారు ఈ నిర్వహించినటువంటి కాంపిటీషన్స్‌కి బహుమతుల ప్రధానం చేశారు. అదేవిధంగా కంపెనీ ఎంప్లాయిస్ ,స్కూల్ చిల్డ్రన్స్ స్కిప్టులు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధికారులు , యునైటెడ్ శ్రీనివాసరావు తమ అమూ ల్యమైన సందేశాన్ని తెలియజేశారు. ఈ జాతీయ రోడ్డు భద్రతవా రోత్స వాలు పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటిస్తూ 100% రోడ్ యాక్సిడెంట్ నివారించాలని అందరికీ ఆయన తెలియజేశారు.

## కోదాడ "పుర "పోరులో నామినేషన్ల జోరు



**కోదాడ, జనవరి 30 (జనంసాక్షి):** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేడి తారాస్థాయికి చేరింది. మున్సిపాలిటీలకు నామినేషన్ల గడువు శుక్రవారం 30వ తేదీ సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ముఖ్యంగా కోదాడ మున్సిపాలిటీకి అభ్యర్థులు భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేస్తూ సందడి చేశారు. కోదాడ మున్సిపాలిటీలోని 35 వార్డులకు గాను, ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలతో పాటు వామపక్షాలు, జనసేన, స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్ పత్రాలు సమర్పించారు. చివరి రోజు అభ్యర్థులు తమ అనుచరులతో కలిసి భారీ ర్యాలీలుగా వచ్చి నామినేషన్లు వేయడంతో మున్సిపల్ కార్యాలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. మొదటి రోజే కొన్ని నామినేషన్లు దాఖలు కాగా, చివరి రెండు రోజుల్లో ఆ సంఖ్య విపరీతంగా పెరిగింది. 31వ తేదీ నుండి నామినేషన్ల పరిశీలన ప్రారంభమవుతుంది. మూడో తేదీ మధ్యాహ్నా 3 గంటల వరకు నామినేషన్లు ఉపసంహరణ చేసుకోవచ్చు! ప్రధాన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేయడంతో కోదాడ మున్సిపాలిటీ ప్రజలలో సర్వత్ర ఆసక్తి పెరిగింది. నామినేషన్ల నేపథ్యంలో అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేస్తున్నారు.

# మున్సిపాలిటీలో భగ్గుమన్న వర్గపోరు

### టికెట్ దక్కలేదని కాంగ్రెస్ నాయకుడు ఆత్మహత్యాయత్నం



**చండూరు జనవరి 30 (జనంసాక్షి):** మునుగోడు నియోజక వర్గం చండూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీలో "ఆల్ ఈజ్ వెల్" అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రకటించిన 24 గంటలు కూడా గడవకముందే పరిస్థితి తలకిందులైంది. చండూరు మున్సిపాలిటీలో అధికార పార్టీలోని వర్గ విభేదాలు ఒక్కసారిగా రచ్చకెక్కాయి. పార్టీ టికెట్ (బీ-ఫామ్) దక్కలేదన్న మనస్థాపంతో ఓ కార్యకర్త ఆత్మహత్యా యత్నానికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. ఎమ్మెల్యే ప్రకటనకు భిన్నంగా.. నియోజకవర్గంలో కాం గ్రెస్ పార్టీలో ఎలాంటి గ్రూపు తగాదాలు లేవని ,కార్యకర్త లంతా ఏకతాటిపై ఉన్నారని గురువారం రోజు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియా ముఖంగా ప్రకటించారు. కానీ, ఆ ప్రకటన వెలువడిన మరునా డే చండూరు మున్సిపాలిటీ టికెట్ల కేటాయింపు వ్యవహారం పార్టీలోని అసమ్మతిని బట్టబయలు చేసింది. ఆత్మ హత్యా యత్నం చేసిన బూతరాజు వేణు చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆయన సతీమణి భూతరాజు లత ఆశావ హులుగా ఉన్నారు. ఆమె భర్త వేణు పార్టీ కోసం ఎంతోకాలంగా పనిచేస్తున్నారు. అయి తే, చివరి నిమిషంలో పార్టీ అధిష్టానం వారికి బీ-ఫామ్ నిరాకరిం చింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన వేణు శుక్రవా రం రోజు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశారు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థాని కులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

# ఐటీసీ కర్మాగారంలో చోరీకి యత్నం

### స్టోర్ డిపార్ట్మెంట్లో సెక్యూరిటీ సిబ్బందికి చిక్కిన దొంగలు



**బూర్గంపహాడ్ జనవరి 30 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటీసీ కర్మాగారంలో శుక్రవారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసేందు కు ప్రయత్నించి సెక్యూరిటీ సిబ్బందికి దొరికిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివ రాల ప్రకారం... ఐటీసీ కర్మాగారంలోని స్టోర్ డిపార్ట్మెం ట్లో చోరీ చేసేందుకు ముగ్గురు వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా ప్రవేశించి సామాగ్రిని అపహరించే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది, కార్మికులు వారిని వెంబడించి చాకచక్యంగా పట్టుకుని ఐటీసీ సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లగా పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టుకున్న దొంగలను పోలీసులకు అప్పగించారు. ఐటీసీ కర్మాగారం లోకి బయటివ్యక్తులు ప్రవేశించడం అంత సులభం కాదు. ఈ చోరీకి పాల్పడిన వ్యక్తులు బయటివారా...? కర్మాగారంలో పనిచేసేవారా..? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా పటిష్ట భద్రత కలిగిన ఐటీసీ కర్మాగారంలో నిరంతరం పనిచేసే సీసీ కెమెరా లు, సెక్యూరిటీ సిబ్బందిని దాటుకుని దొంగలు లోనికి ప్రవేశించి చోరీచేయడానికి యత్నించడం పట్ల సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఐటీసీ యాజమాన్యం భద్రతను మరింత కఠినతరం చేయా ల్సిన అవసరం ఉందని కార్మికులు అభిప్రాయపడుతున్నారు.

## మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా అడుగులు వేద్దాం



**కొండమల్లేపల్లి, జనవరి 30 (జనంసాక్షి):** కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం మండల ఆర్యవైశ్య సంఘం, పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్, యువజన సంఘం సంయుక్తంగా జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. అహింసను ఆయుధంగా సత్యాన్ని మార్గంగా చేసుకొని భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయుడు మహాత్మాగాంధీ అని వారు కొనియాడారు. మహాత్మా గాంధీ జీవితం మనకు ధైర్యం, సహనం, మానవత్వం నేర్పిన అమూల్యమైన పాఠమని గాంధీజీ ఆదర్శాలను మన జీవితాల్లో ఆచరించడమే వారికి నిజమైన ఘన నివాళి అని అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా నిర్వహించే అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వీరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నీలా లక్ష్మయ్య, దాచేపల్లి నరేందర్, ముచ్చర్ల కరుణాకర్, నేలంటి వెంకటేశ్వర్లు, మారం వెంకటేశ్వర్లు, స్వప్న, నీరజ, రమ, బూరుగు శ్రీకాంత్, నీలా విజయ్, నీలా ప్రవీణ్, దాచేపల్లి వెంకటయ్య, వెంకటేశ్వర్లు, వాసా తిరుపతయ్య, దొడ్డి నగేష్, దొడ్డి రమా, స్వాతి, కర్నాటి స్వప్న, హేమలత, పద్మ, ఆలంపల్లి విజయ్, బచ్చు సత్యనారాయణ, అమ్మనబోలు యాదయ్య, గందె రాము పాల్గొన్నారు.




# మైక్రోసాఫ్ట్‌కు ఏఐ దెబ్బ

## ఈఎంఐ ఆలస్యమైతే

**న్యూఢిల్లీ:**బ్యాంకు లేదా ఆర్థిక సంస్థ నుంచి రుణం తీసుకున్నప్పుడు క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించాలి. కానీ, అనుకోని పరిస్థితుల్లో రుణ వాయిదా (ఈఎంఐ) చెల్లింపులో విఫలమైతే.. ఏంటి పరిస్థితి.. ఈ ఒక్క పొరపాటు భవిష్యత్తులో ఇబ్బంది పెడుతుందా? అనేది చాలామందికి ఆందోళన కలిగిస్తుంది. ఈ నేపథ్యంలో ఈఎంఐని చెల్లించకపోతే ఏం జరుగుతుంది? క్రెడిట్ స్కోరుపై ఎలాంటి ప్రభావం పడుతుంది? తెలుసుకుందాం..మన దేశంలో చాలామందికి నగదు ప్రవాహం మారుతూ ఉంటుంది. జీతం పడటం ఆలస్యం కావడం, అనుకోని వైద్య ఖర్చులు లేదా ఇతర అత్యవసరాలు వల్ల నెలవారీ చెల్లింపుల చక్రం దెబ్బతినే అవకాశం ఉంది. ఈఎంఐను నిర్ణీత తేదీనాడు చెల్లించనప్పుడు.. ఆ తర్వాత రుణదాత ఎంత వేగంగా, బాధ్యతగా స్పందించారన్నదే దీర్ఘకాలిక ప్రభావాన్ని




నిర్ణయిస్తుంది.ఒక్కసారి వాయిదాను తప్పినంత మాత్రాన బ్యాంకులు రుణగ్రహీత సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయవు. క్రెడిట్ బ్యూరోలు ఒక వ్యక్తి దీర్ఘకాలిక చెల్లింపు ప్రవర్తనను గమనిస్తాయి. కానీ, అప్పుడప్పుడు జరిగే పొరపాట్లను ప్రామాణికంగా తీసుకోవు. ఒక ఈఎంఐ ఆలస్యమైనప్పటికీ, 30 రోజుల్లోపు దాన్ని చెల్లించిన వారి క్రెడిట్ స్కోరుపై పెద్దగా ప్రభావం ఉండదు. లేదా తాత్కాలికం మాత్రమే. అదే పనిగా ఆలస్యం చేయడం లేదా స్పందించకుండా మౌనంగా ఉండిపోవడం వల్ల జరిమానా పడుతుంది. రికవరీ చర్యలు, క్రెడిట్ స్కోరు శాశ్వతంగా పతనం కావడం వంటివి జరుగుతాయి.

**ఏం చేయాలి?**

ఈఎంఐ తప్పిన సందర్భంలో చేయాల్సిన ముఖ్యమైన పని.. బ్యాంకును సంప్రదించడం.. రుణగ్రహీతలు వెంటనే తమ రుణదాతను సంప్రదించి, తమ పరిస్థితిని వివరించాలి. అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలను అన్వేషించాలి.మంచి చెల్లింపుల చరిత్ర ఉన్న రుణగ్రహీతలకు.. చెల్లింపు తేదీని మార్చడం, పాక్షిక చెల్లింపులు లేదా తాత్కాలిక ఉపశమన పద్ధతుల ద్వారా బ్యాంకులు వెసులుబాటు కల్పిస్తాయి. చాలామంది భయంతోనో, సరైన సమాచారం లేక.. బ్యాంకులను సంప్రదించరు. ఒక్క ఈఎంఐ చెల్లించకపోతే క్రెడిట్ చరిత్ర దెబ్బతింటుందని భావిస్తారు. కానీ, ఇది అపోహే. మరో ముఖ్యమైన విషయం.. వాయిదాలను చెల్లించకపోతే, అపరాధ రుసుములు, వడ్డీలతో భారం పెరిగిపోతుంది. దీనివల్ల వచ్చే నెల మరింత ఒత్తిడి ఎదురవుతుంది. ఆదాయంలో అనిశ్చితి ఉండే గిగ్ వర్కర్లు, తొలిసారి రుణం తీసుకున్న వారికి ఇది పెద్ద సవాలుగా మారుతుంది. కాబట్టి, వాయిదాలను చెల్లించకపోవడం ఆర్థిక ఇబ్బందిగా కాకుండా, ఒక హెచ్చరికగా భావించాలి. సరైన సమయంలో స్పందించడం, పారదర్శకంగా ఉండటం ఎప్పుడూ అవసరం.

## గంటల్లోనే రూ.36 లక్షల కోట్లు ఆవిరి

**న్యూఢిల్లీ:**ప్రముఖ టెక్‌దిగ్గజం మైక్రోసాఫ్ట్ స్టాక్ మార్కెట్‌లో కొన్ని గంటల్లోనే భారీగా నష్టాన్ని చవిచూసింది. కంపెనీ షేరు విలువ ఒక దశలో 12 శాతం కుంగింది. దాంతో ఆ సంస్థ విలువలో 400 బిలియన్ డాలర్ల మదుపర్ల సంపద ఆవిరైంది. భారతీయ కరెన్సీలో ఈ మొత్తం రూ.36 లక్షల కోట్లు. స్టాక్ మార్కెట్ చరిత్రలో ఒక్క రోజులో ఈ స్థాయిలో పతనం కావడం ఇది రెండోది. గతేడాది జనవరిలో చైనాకు చెందిన డీప్‌సీక్ ఏఐ మోడల్ ప్రవేశంతో చిప్ తయారీ సంస్థ ఎన్విడియా 593 బిలియన్ డాలర్లను కోల్పోయింది.2020 మార్చి తర్వాత మైక్రోసాఫ్ట్ ఈ స్థాయిలో నష్టాలను చవిచూడడం ఇదే తొలిసారి. 1986లో ఈ టెక్ సంస్థ ఐపీఓకు వచ్చిన తర్వాత ఈ స్థాయి నష్టాలను చూడటం చాలా తక్కువ. కృత్రిమ మేధపై కంపెనీ చేస్తున్న వ్యయాలతో ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారు. కృత్రిమ మేధ, కొత్త సాంకేతికతపై చేస్తున్న ఖర్చులపై ఇప్పటికే భారీగా చర్చ నడుస్తోంది. గతేడాది పెట్టిన భారీ పెట్టుబడులకు ఏమేరకు ప్రతిఫలాలు అందాయో తెలుసుకోవాలని వాటాదార్లు





భావిస్తున్నారు. మైక్రోసాఫ్ట్ తన క్లౌడ్, ఏఐ విభాగాలపై పెట్టుబడుల్లో 66 శాతం పెరుగుదల కనిపించింది. ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో ఈ విషయం వెల్లడైంది. కానీ మైక్రోసాఫ్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ అజ్యూర్ వృద్ధి గత త్రైమాసికంతో పోలిస్తే మందగించింది. ఇది మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. రాబోయే ఏడాది కాలంలో డేటా సెంటర్ల మీద గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి కంపెనీలు భారీ పెట్టుబడులు పెట్టనున్నాయి. దానికోసం గూగుల్ తప్ప మిగతా కంపెనీలన్నీ రుణాల బాట పట్టనున్నాయి. ఏఐతో తమకు స్వర్ణయుగం వస్తుందనే ఆశతోనే అప్పులు చేస్తున్నాయి. ఓపెన్ ఏఐ సంస్థ రానున్న సంవత్సరాల్లో 1.4 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరం అవుతాయని చెబుతోంది. అయితే 2030కి గానీ లాభాలు రావని ఇప్పటికే వెల్లడించింది. ఈ ఎదురు చూపులు మదుపర్లను నిరాశకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది.


## బడ్జెట్‌కు ముందు నష్టాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలు నష్టాల్లో ముగిశాయి. బడ్జెట్ ముందు మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. ముఖ్యంగా ఐటీ, మెటల్ స్టాక్స్‌లో విక్రయాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. దీనికితోడు రూపాయి విలువ పతనం, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.సెన్సెక్స్ ఉదయం 81,947.31 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,566.37) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాలు కొనసాగాయి. చివరికి 296.59 పాయింట్ల నష్టంతో 82,269.78 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98.25 పాయింట్ల నష్టంతో 25,320.65 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.02గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రధానంగా నష్టపోయాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్‌బీఐ, ఐటీసీ, బీఈఎల్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 5060 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






## పారిస్ కోచర్ వీక్‌లో ఆదిత్య బిర్లా 'ఇంద్రియా' ఆభరణాలు..



**పారిస్:**ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన జ్యువెల్లరీ సంస్థ 'ఇంద్రియా' ఆభరణాలను తొలిసారి పారిస్ కోచర్ వీక్‌లో ప్రదర్శించారు. ప్రముఖ డిజైనర్ గౌరవ్ గుప్తా భాగస్వామ్యంతో రూపొందించిన ఈ ఆభరణాలను పలువురు మోడళ్లు ధరించి ర్యాంప్‌పై మెరిశారు. అర్ధనారీశ్వరుడి నుంచి స్ఫూర్తి పొంది డ్యుయాలిటీస్ కాన్సెప్ట్‌లో డిజైనర్ ఈ ఆభరణాలను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఇంద్రియా మార్కెటింగ్ హెడ్ శాంతిస్వరూప్ పండా మాట్లాడుతూ.. "గౌరవ్ గుప్తా సహకారంతో మన సంస్కృతి, సంప్రదాయాలను వినూత్నంగా ప్రపంచానికి పరిచయం చేయడం గర్వంగా ఉంది" అని ఆనందం వ్యక్తంచేశారు. 'ఇంద్రియా' జ్యువెల్లరీ బ్రాండ్‌ను ఆదిత్య బిర్లా గ్రూప్ 2024 జులైలో ప్రారంభించింది.

## ఫాస్టాగ్.. ఎల్‌పీజీ..

### బడ్జెట్ రోజు నుంచే ఈ మార్పులు!

**న్యూఢిల్లీ:**ఫిబ్రవరి 1.. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టే రోజు. గతేడాది బడ్జెట్‌లో ఆదాయపు పన్ను పరిమితిని పెంచి మధ్యతరగతికి బిగ్ బూస్ట్ ఇచ్చిన మోదీ సర్కారు.. ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు జీఎస్టీ రూపంలోనూ ఊరట కల్పించింది. ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇచ్చేందుకు ఈసారి బడ్జెట్‌లో ప్రకటనలు ఏమైనా ఉంటాయోమో చూడాలి. అవి కూడా కొత్త ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్ 1 నుంచి) అమల్లోకి వస్తాయి. అంతకంటే ముందు బడ్జెట్ రోజు నుంచే (ఫిబ్రవరి 1) అమల్లోకి వచ్చే కొన్ని మార్పులున్నాయి. అవేంటో చూసేయండి..ఫాస్టాగ్‌కు సంబంధించి కొత్త విధానం ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానుంది. కొత్తగా జారీ చేసే ఫాస్టాగ్‌లకు నో యువర్ వెహికిల్ (కేవైవీ) విధానాన్ని కేంద్రం రద్దు చేసింది. సాధారణంగా ఫాస్టాగ్ జారీ చేసిన తర్వాత నో యువర్ వెహికిల్ వివరాలు నమోదుచేయాల్సి ఉంటుంది. దీనివల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కేంద్రం దృష్టికి రావడంతో ఫిబ్రవరి 1 నుంచి జారీ చేసే కార్డులకు ఈ విధానం నుంచి మినహాయింపు ఇచ్చారు. లూజ్ ఫాస్టాగ్, ఫాస్టాగ్ తప్పుగా జారీ, దుర్వినియోగం లాంటి ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో మాత్రం వాహనాలకు ఈ కేవైవీ తప్పనిసరి.

# నిమిషానికి రూ.5 లక్షల కోట్లు ఢమాల్!

## బంగారం విలువలో భారీ హెచ్చుతగ్గులు

**న్యూఢిల్లీ:**అంతర్జాతీయ అనిశ్చితులతో గత కొన్ని రోజులుగా అసా ధారణంగా పెరుగుతున్న బంగారం ధర.. గురువారం రాత్రి అనూహ్యంగా ఒడుదొడులకు లోనైంది. గంటల వ్యవధిలో దారుణంగా ఊగిసలాడింది. కేవలం ఒక ట్రేడింగ్ సెషన్‌లోనే పసిడి మార్కెట్ విలువ ఏకంగా 5.5 ట్రిలియన్ డాలర్ల హెచ్చుతగ్గులకు గురైందంటే.. ప్రపంచ కమొడిటీ మార్కెట్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు..!ఒక్క రోజులో బంగారం మార్కెట్ విలువ ఈ స్థాయిలో మార్పులు రావడం చరిత్రలో ఇదే తొలిసారి. ఈ మేరకు క్యాపిటల్ మార్కెట్స్ కామెంటరీ ప్లాట్‌ఫామ్ 'ది కోబెయిసీ లెటర్' తమ 'ఎక్స్' ఖాతాలో దీనిపై పోస్ట్ చేసింది. ఈస్ట్రన్ టైమ్ ప్రకారం గురువారం ఉదయం 9.30 గంటల నుంచి 10.25 గంటల మధ్య ఈస్ట్రన్ టైమ్ ప్రకారం గురువారం ఉదయం 9.30 గంటల నుంచి 10.25 గంటల మధ్య (భారత కాలమానంలో రాత్రి 8-9 గంటల మధ్య) బంగారం మార్కెట్ విలువ 3.2 ట్రిలియన్ డాలర్లు కుంగింది. అంటే నిమిషానికి 58 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.5 లక్షల కోట్లు) చొప్పున ఆవిరైంది.అయితే, ఈ నష్టాల పరంపర




ఎంతోసేపు కొనసాగలేదు. గురువారం ఉదయం 10.25 గంటల (ఈస్ట్రన్ టైమ్ జోన్‌లో) తర్వాత నుంచి మార్కెట్ ముగిసే సాయంత్రం 4 గంటల మధ్య బంగారం విలువ మళ్లీ పుంజుకుంది. ఈ వ్యవధిలో పసిడి మార్కెట్ విలువ మళ్లీ 2.3 ట్రిలియన్ డాలర్లకు పైగా పెరిగింది. అంటే మొత్తంగా ఒక ట్రేడింగ్ సెషన్‌లో 5.5 ట్రిలియన్ డాలర్ల మేర హెచ్చుతగ్గులకు లోనైనట్లు 'ది కోబెయిసీ లెటర్' వెల్లడించింది. 2008 నాటి ఆర్థిక మాంద్యం సమయంలోనూ బంగారం ఈ స్థాయిలో ఊగిసలాడలేదని పేర్కొంది.

### ఒక్కరోజే రూ.30వేలు దిగొచ్చిన వెండి..

*అంతర్జాతీయ పరిణామాలతో గత కొంతకాలంగా రాకెట్ వేగంతో దూసుకెళ్తోన్న బంగారం, వెండి ధరలు శుక్రవారం తగ్గుముఖం పట్టాయి. మదుపర్ల లాభాల స్వీకరణతో భారీగా దిగొచ్చాయి. హైదరాబాద్ విపణిలో ఉదయం 11.30 గంటల సమయంలో 24 క్యారెట్ల మేలిమి పసిడి 10 గ్రాముల ధర రూ.1,74,700 పలికింది. గురువారం రాత్రి ఈ ధర రూ.1,79,700 ఉండగా.. నేడు దాదాపు రూ.5 వేల మేర తగ్గింది. ఇక, వెండి ధర కూడా భారీగా పడిపోయింది. నిన్న రాత్రి హైదరాబాద్ విపణిలో రూ.3,99,600 వద్ద స్థిరపడిన వెండి ధర శుక్రవారం ఉదయానికి రూ.3,70,000కు దిగొచ్చింది. అంటే.. దాదాపు రూ.30వేల మేర తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్లలోనూ ఈ లోహాల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఔన్సు పసిడి ధర 5,189 డాలర్లు, ఔన్సు వెండి ధర 110 డాలర్లు పలుకుతోంది.అటు ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లోనూ బంగారం, వెండి ధరలు భారీగా పడిపోయాయి. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి డెలివరీకి వెండి ఫ్యూచర్స్ ధర శుక్రవారం రూ.12,169 తగ్గి రూ.3,87,724గా ఉంది. గురువారం ఈ ధర ఒక దశలో రూ.4.20 లక్షల వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని తాకి చివరకు రూ.3,99,893 వద్ద ముగిసింది.*

### ఊగిసలాటకు కారణమేంటి?

భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్యయుద్ధాల నేపథ్యంలో కరెన్సీ స్థిరత్వంపై ఆందోళనలు, ద్రవ్యోల్బణ భయాలు, వడ్డీరేట్లపై అస్పష్టత వంటి అనేక కారణాలతో ఈ మధ్య మదుపర్లు బంగారం, వెండి లోహాల్లో పెట్టుబడులను సురక్షిత సాధనంగా భావించారు. దీంతో వీటి ధరలకు రెక్కలొచ్చాయి. అయితే, గరిష్ఠాల వద్ద సంస్థాగత మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో గురువారం వీటి విలువ ఒక్కసారిగా తగ్గింది. దీనికితోడు కంప్యూటర్ ఆధారిత ఆటోమెటిక్ అల్గారిథమ్ ట్రేడింగ్ కూడా ధరల కదలికలను తీవ్రంగా ప్రభావితం చేసిందని మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు. నేటి రోజుల్లో బంగారం ట్రేడింగ్ అనేది భౌతిక బంగారం డిమాండ్ మీద మాత్రమే ఆధారపడట్లేదని, ఈటీఎఫ్‌లే మార్కెట్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంటున్నారు. నిన్నటి ట్రేడింగ్‌లో కేవలం బంగారం మాత్రమే కాకుండా.. వెండి, ప్లాటినం విలువల్లోనూ భారీ హెచ్చుతగ్గులు కన్పించాయి.

## చైనా-బ్రిటన్ సంబంధాల్లో కొత్త అధ్యాయం

### జిన్‌పింగ్‌తో స్టార్మర్ భేటీ

బీజింగ్: సుస్థిర, సుదీర్ఘ, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ నిర్ణయించుకున్నారు. ప్రపంచ శాంతి, సుస్థిరతలకు తమ రెండు దేశాల మైత్రి కీలకమని అభిప్రాయపడ్డారు. మూడు రోజుల చైనా పర్యటనలో భాగంగా బుధవారం బీజింగ్‌లో అడుగు పెట్టిన స్టార్మర్ గురువారం..ఇక్కడ గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీ దాదాపు 80 నిమిషాలు కొనసాగింది. గ్రీన్‌లాండ్ అంశంలో ఐరోపా దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రకరకాలుగా ఒత్తిడి తెస్తున్న తరుణంలో స్టార్మర్.. బీజింగ్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఎనిమిదేళ్ల తర్వాత బ్రిటన్ ప్రధాని చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి. బ్రిటన్, చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయం మొదలైందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ప్రధాన దేశాలు అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలని..లేకపోతే ప్రపంచం ఆటవిక రాజ్యంగా మారే ప్రమాదం ఉందని పరోక్షంగా అమెరికాను ఉద్దేశించి జిన్‌పింగ్ వ్యాఖ్యలు చేశారు. తాము ఇతర దేశాలకు హాని కలిగించబోమని ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు పేర్కొనడం గమనార్హం. దాదాపు 10 ఒప్పందాలపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి. వీసా లేకుండా బ్రిటన్ పౌరులు చైనాలోకి ప్రవేశించేందుకు బీజింగ్ అంగీకరించిందని స్టార్మర్ తెలిపారు.

## అతడి భార్య అందంగా ఉందని పదవి

### ట్రంప్ విచిత్ర వ్యాఖ్యలు

**వాషింగ్టన్:**అమెరికా ఇంటీరియర్ సెక్రటరీగా డగ్ బర్గమ్‌ను నియమించారు అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఈ నియామకంపై ట్రంప్ స్పందిస్తూ విచిత్ర వ్యాఖ్యలు చేశారు. బర్గమ్ భార్య చాలా అందంగా ఉందని, అందుకే ఆయనకు పదవి ఇచ్చినట్లు వెల్లడించారు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో బర్గమ్, ఆయన సతీమణి అక్కడే ఉండటం గమనార్హం.మాదకద్రవ్యాల కట్టడి లక్ష్యంగా ఓ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వుపై ట్రంప్ గురువారం (అమెరికా కాలమానం ప్రకారం) సంతకం చేశారు. అనంతరం ఓవల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధ్యక్షుడు మాట్లాడుతూ.. "బర్గమ్, అతని భార్య క్యాథరిన్ గుర్రపు స్వారీ చేస్తున్న వీడియో చూశా. అందులో ఆమె చాలా ఆకర్షణీయంగా కనిపించారు. ఆమె ఎవరని నా సిబ్బందిని అడిగా. ఈ జంట గురించి వారు వివరించగానే నాకో అభిప్రాయం ఏర్పడింది. ప్రధానంగా ఆ కారణంతోనే డగ్‌కు పదవి ఇచ్చా. డగ్ బర్గమ్ విజయవంతమైన బిజినెస్ మ్యాన్. నార్త్ డకోటాకు రెండుసార్లు గవర్నర్‌గా పనిచేశారు. అయితే, బర్గమ్ విజయం వెనక ఆయన భార్య పాత్ర కీలకంగానే ఉండి ఉంటుంది. అద్భుతమైన జంట" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.అయితే, ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో ట్రంప్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. మహిళలను కించపరిచేలా ఆయన మాటలు ఉన్నాయంటూ పలువురు విమర్శించారు. కాగా.. ట్రంప్ గతంలోనూ పలుమార్లు మహిళల విషయంలో అభ్యంతరకర పదజాలం ఉపయోగించిన సంగతి తెలిసిందే.



## ఆటిజం చికిత్సలో స్టెమ్‌సెల్స్ థెరపీ వాడొద్దు

ప్రభావంతమైందని నిరూపించేందుకు తగిన శాస్త్రీయ ఆధారాలు లేవని అభిప్రాయపడింది. థెరపీల్లో ఉపయోగించే స్టెమ్ సెల్స్‌ను డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940లో 'డ్రగ్స్'గా పేర్కొన్నంత మాత్రాన చికిత్సలో దీన్ని ఉపయోగించలేమని పేర్కొంది.రోగులు, సంరక్షకులు చికిత్స ప్రయోజనాలు ఆశిస్తుంటారని.. ఇటువంటి నేపథ్యంలో దీన్ని ఉపయోగించడం అనైతికం, వైద్య నిబంధనల ఉల్లంఘనే అవుతుందని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఇప్పటికే ఈ తరహా చికిత్స తీసుకుంటున్న రోగులకు విషయానికొస్తే.. వాణిజ్య ప్రయత్నంగా వీటిని కొనసాగించలేమని స్పష్టం చేసింది. అయితే, వీరిని క్లినికల్ ట్రయల్స్ చేస్తున్న కేంద్రాలకు తరలించేంత వరకు ఎయిమ్స్ అధికారులతో సంప్రదించి ఉత్తమ పరిష్కార మార్గాలు చూపాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖను ఆదేశించింది.

## భారత్ నుంచి అమెరికా నేతలకు అందిన గిఫ్ట్‌లు ఇవే..

**న్యూయార్క్:** భారత్ నుంచి మన నేతలు విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు మర్యాదపూర్వకంగా అక్కడి నేతలకు బహుమతులు తీసుకువెళ్తుంటారు ప్రధాని మోదీ సహా భారత్‌కు చెందిన నేతలు అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ఇతర నేతలకు ఇచ్చిన గిఫ్ట్‌ల జాబితాను ఆ దేశ విదేశాంగశాఖ విడుదల చేసింది. 2024 క్యాలెండర్ సంవత్సరానికి చెందిన ఈ లిస్ట్‌లో 2024లో మోదీ.. బైడెన్‌కు బహూకరించిన 'స్టెర్లింగ్ సిల్వర్ మెటల్ ట్రైన్ సెట్', మాజీ ప్రథమ మహిళ జిల్ బైడెన్‌కు అందజేసిన కశ్మీర్ పాష్మీనా షాల్, యూఎస్ మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు ప్రధాని మోదీ ఇచ్చిన 'లార్డ్ కృష్ణ రాస్ లీలా సిల్వర్ బాక్స్‌లను నేషనల్ ఆర్కైవ్స్‌లో భద్రపరిచినట్లు తెలుస్తోంది.భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికా మాజీ రక్షణ కార్యదర్శి లాయిడ్ ఆస్టిన్‌కు బహుమతిగా ఇచ్చిన 'నటరాజ కాంస్య విగ్రహం', భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ అప్పటి అమెరికా జాతీయ భద్రతా వ్యవహారాల అధ్యక్షుడి సహాయకుడు జాకబ్‌కు ఇచ్చిన బహుమతులు గురించిన వివరాలను కూడా ఈ జాబితాలో ప్రస్తావించారు. 2023లో మోదీ, బైడెన్‌కు బహుమతిగా ఇచ్చిన గంధపుచెక్కతో చేసిన ఒక పెట్టె, స్కార్ఫ్, కుంకుమ పువ్వు, టీ పొడి ఉన్న చెక్క పెట్టె,



ది టెన్ ప్రిన్సిపల్ ఉపనిషద్స్ అనువాద పుస్తకం వివరాలను కూడా ఈ లిస్ట్‌లో పొందుపరిచినట్లు యూఎస్ విదేశాంగ శాఖ వెల్లడించింది. వాటిలో గంధపు చెక్క పెట్టె, స్కార్ఫ్, మరో చెక్క పెట్టెను యూఎస్ నేషనల్ ఆర్కైవ్స్ (ఔంఖీం)లో భద్రపరిచినట్లు తెలిపింది. పాడయ్యే వస్తువులు అయిన కుంకుమ పువ్వు, టీ పొడిని స్టేట్స్ సీక్రెట్ సర్వీస్ విధానాలకు అనుగుణంగా పారవేసినట్లు జాబితాలో పేర్కొంది.

## నెలసరి పరిశుభ్రత కూడా ప్రాథమిక హక్కే

న్యూఢిల్లీ(జనంసాక్షి):మహిళల ఆరోగ్యం విషయంలో సుప్రీంకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. నెలసరి పరిశుభ్రత కూడా ప్రాథమిక హక్కేనని స్పష్టంచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు, గోప్యతా హక్కులో ఇది అంతర్భాగమని తీర్పులో పేర్కొంది. ఈ క్రమంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, పాఠశాలలకు పలు ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచిత శానిటరీ ప్యాడ్స్ అందించాలని, కనీస పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని కోరుతూ దాఖలైన పిటిషను విచారించిన సుప్రీంకోర్టు.. తాజాగా తీర్పు వెలువరించింది. అన్ని పాఠశాలల్లో విద్యార్థినులకు పర్యావరణహితమైన శానిటరీ ప్యాడ్స్‌ను ఉచితంగా అందించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. "ఈ తీర్పు న్యాయవ్యవస్థలో భాగమైన వారికోసం మాత్రమే కాదు. సహాయం అడిగేందుకు సంకోచించే విద్యార్థినులు, నిధుల కొరత కారణంగా సహాయం చేయలేని స్థితిలో ఉన్న ఉపాధ్యాయుల కోసం కూడా. నిస్సహాయ స్థితిలో ఉన్నవారిని మనం ఎలా రక్షిస్తున్నామనే దానిని పురోగతిగా పరిగణిస్తారు" అని సుప్రీం ధర్మాసనం తీర్పులో భాగంగా వ్యాఖ్యానించింది.

**నెలసరి సమస్యలకు 'సీడ్ సైక్లింగ్'!**

విద్యార్థులు, విద్యార్థినులకు వేర్వేరుగా టాయిలెట్స్ ఉండేలా చూడాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దివ్యాంగుల అవసరాలకు తగినట్లుగా ప్రత్యేక టాయిలెట్లు ఉండాలని పేర్కొంది.



## నామినేషన్లను సజావుగా సాగే విధంగా చూడాలి

- ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్

**రాయికల్ జనంసాక్షి :** శుక్రవారం రాయికల్ మున్సిపాలిటీలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ మాట్లాడుతూ... నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసి నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయా వార్డులకు దాఖలైన నామినేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటిని, అప్పిళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాఖలైన నామినేషన్ల వివరాలను జాగ్రత్తగా పరిశీలించి వెంట వెంటనే రోజు వారీగా టీ. పోల్ యాప్ లో అప్ లోడ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, వారి సందేహాలు నివృత్తి చేయాలని అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించుటకు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో రాయికల్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

**2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**




**మంథని, (జనంసాక్షి) :** గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష!తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని లోని ఆర్డీఓ కార్యాలయంలో 2027 గోదావరి నది పుష్కరాల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. 2027 జూన్ 26 నుంచి 2027 జూలై 7 వరకు గోదావరి నదికి 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా పుష్కరాలు జరుగుతాయని, దీనికి సంబంధించి మన జిల్లాలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అవసరమైన ఘాట్ నిర్మాణం, రోడ్డు విస్తరణ, లైటింగ్, ఇతర ఏర్పాట్లు, ఆలయాల అభివృద్ధికు ప్రతిపాదనలు తయారు చేసి వీలైనంత త్వరగా సమర్పించాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, ఈఈ ఆర్అండ్‌బి భావ్ సింగ్, ఈఈ మిషన్ భగీరథ ఇంట్రా శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి ఆమడ దూరం



- తాండూర్ మున్సిపల్ 36 వార్డులు కాంగ్రెస్ కైవసం
- మున్సిపల్ పీఠం కాంగ్రెస్‌దే
- బిఆర్ఎస్ జంగిల్ రాజకీయాలు మానుకోవాలి
- అభివృద్ధిపై చర్చకు సిద్ధం


**తాండూరు, జనవరి 30:** బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి ఆమడ దూరమైందని, తాండూరు మున్సిపల్ లో అన్ని స్థానాలను క్లీన్ స్వీప్ చేసి కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ నామినేషన్ల చివరి రోజు అభ్యర్థులతో కలిసి రెండో విడత నామినేషన్ పత్రాలు సమర్పించిన అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబద్ధతతో తాండూరును అభివృద్ధి పథంలో నిలిపామని, గత బీఆర్ఎస్ పాలనలో ఆధిపత్య పోరుతో పట్టణాన్ని భ్రష్టు పట్టించారని ఎమ్మెల్యే విమర్శించారు. చైర్మన్ అధికారాలను నిర్వీర్యం చేసిన ఘనత బీఆర్ఎస్ దేనని మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ ఇళ్లు, తెల్ల రేషన్ కార్డులు, సన్న బియ్యం వంటి పథకాలు తీసుకొచ్చామని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఓడిపోతామన్న భయం బీఆర్ఎస్‌కు పట్టుకుందని, అభివృద్ధిపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం తాండూ రు ప్రాంతానికి జీవనాడి అయిన కాగ్నా నది నుంచి త్రాగునీరు అందిస్తామని, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగు పరుస్తామని హామీ ఇచ్చారు. 130 సంవత్సరాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీలో పద్ధతి ప్రకారమే అధిష్టానం ఆదేశాల మేరకు కౌన్సిలర్లు చైర్మన్‌ను ఎన్నుకుంటారని స్పష్టం చేశారు. మెజార్టీ స్థానాలు గెలిచి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఉన్నారు.



## ఫోర్జరీ సంతకాల వెనుక పెద్ద తలలు ఎవరివి?

**హాజిపల్లిలో వెలుగులోకి ప్రభుత్వ అధికారి సంతకం ఫోర్జరీ ఉదంతం**

- నకిలీ స్టాంప్‌తో పత్రాలు.. రిజిస్ట్రేషన్.. బ్యాంక్ లోన్
- ఆదర్శ గ్రామంగా పేరుగాంచిన హాజిపల్లిలో రెచ్చిపోయిన అక్రమార్కులు
- హాజిపల్లిలో సంచలన ఫోర్జరీ కుంభకోణం..సమగ్ర విచారణ డిమాండ్



**షాద్ నగర్ జనవరి 30 (జనం సాక్షి) :** ఏకంగా ప్రభుత్వ అధికారి సంతకాన్నే ఫోర్జరీ చేసి, నకిలీ స్టాంపులతో పత్రాలు సృష్టిం చి రిజిస్ట్రేషన్లు, బ్యాంక్ లోన్ల వరకు వ్యవహారాన్ని నడిపించిన తీరు ఇప్పుడు స్థానికంగా సంచలనం రేపుతోంది. ఈ వ్యవహారంలో అసలు సూత్రధారులు ఎవరు పాత్రధారులు ఎవరు అనే కోణంలో చర్చ జోరుగా సాగుతోంది.

**అసలేం జరిగింది**

గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండానే ఒక ఇంటి నిర్మాణం చేపట్టారు. అయితే, ఆ నిర్మాణానికి పంచాయతీ అనుమతి ఉన్నట్లు చూపించేందుకు నిందితులు ఏకంగా పంచాయతీ కార్యదర్శి (సెక్రటరీ) సంతకాన్ని ఫోర్జరీ చేశారు. అంతేకాకుండా, అధికారిక ముద్రను (స్టాంప్) కూడా నకిలీది తయారు చేసి పత్రాలపై ఉపయోగించారు.

**రిజిస్ట్రేషన్.. లోన్ మంజూరు.. అంతా మాయాజాలం!**

ఈ నకిలీ పత్రాల ఆధారంగానే సదరు ఇంటిని ఒకరి నుంచి మరొకరికి రిజిస్ట్రేషన్ కూడా చేయించడం గమనార్హం. ఫోర్జరీ పత్రాలను అసలైనవిగా నమ్మించిన అక్రమార్కులు, ఒక అడుగు ముందుకు వేసి బ్యాంకు నుంచి భారీ మొత్తంలో లోన్ కూడా మంజూరు చేయించుకున్నారు. పత్రాల పరిశీలనలో బ్యాంకు యాజమాన్యం విఫలమైందా? లేక అక్రమార్కుల మాయాజాలం అంతలా పనిచేసిందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది అస్సలు ఈ వ్యవహారంలో

**సూత్రధారులు ఎవరు? పాత్రధారులు ఎవరు?**

ఈ ఫోర్జరీ ఉదంతం బయటపడటంతో గ్రామస్థులు విస్తుపోతున్నారు. కేవలం ఒకరిద్దరితో సాధ్యం కాదని ఈ భారీ కుంభకోణం వెనుక రాజకీయ పలుకుబడి ఉన్న 'పెద్దల' హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- నకిలీ స్టాంపులు తయారు చేయించింది ఎవరు?
- అధికారి సంతకాన్ని హుందాగా ఫోర్జరీ చేసిన ఆ 'నైపుణ్యం' కలిగిన వ్యక్తులు ఎవరు?
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మరియు బ్యాంకుల్లో ఈ పత్రాలు యథేచ్ఛగా ఎలా చెల్లాయి?

**అధికారుల స్పందన:**

విషయం వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ అధికారి సంతకాన్నే ఫోర్జరీ చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా, వ్యవస్థలను తప్పుదోవ పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆదర్శ గ్రామంగా ఉన్న హాజిపల్లి పేరును పాడుచేస్తున్న ఈ 'ఫోర్జరీ' ముఠా గుట్టు రట్టు కావాలంటే సమగ్ర విచారణ జరగాల్సిందే.

## దుర్భర జీవితం అనుభవిస్తున్నాం

- ఎమ్మెల్యే మక్కాన్సింగ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు
- సింగరేణి మారు పేర్లు విజిలెన్స్ ఎంక్వయిరీ బాధితులు

**గోదావరిఖని, జనంసాక్షి :** ఎన్నో ఏళ్లుగా మా ఉద్యోగాలు మాకు వస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నాం కానీ మా భవిష్యత్తు రోజురోజుకు అడ్డా కూలీల కంటే అధ్వానంగా మారుతుందని సింగరేణి కార్మికుల మారు పేర్లు విజిలెన్స్ ఎంక్వయిరీ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మా ఆవేదనను పలుమార్లు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ దృష్టికి తీసుకెళ్లగా కనికరించి మా పట్ల అసెంబ్లీలో ప్రస్తావించి న్యాయం చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. గతంలో గోలేటి నుండి మణుగూరు వరకు నిర్వహించిన పాదయాత్రతో అధికారులు, కార్మిక సంఘాల దృష్టికి మా బాధను తీసుకెళ్లామని అన్నారు. ఎన్నో ఏండ్ల పోరాటంతో మేము చేసిన ప్రయత్నం సానుకూల స్పందన వస్తుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల మంత్రి శ్రీధర్ బాబు, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, ఐఎన్ టీయూసీ సెక్రెటరీ జనరల్ జనప్రసాద్, గుర్తింపు సంఘం ఏఐటిసి నాయకుల చొరవతో మాకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాము అన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో సింగరేణి మారు పేర్లు విజిలెన్స్ ఎంక్వయిరీ బాధితుల సమస్య పరిష్కారం అయ్యేలా సింగరేణి కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు మాకు న్యాయం చేస్తారని కూడా ఆశిస్తున్నాము. ఈ సమావేశంలో జక్కుల శ్రవణ్, వంగ సంతోష్, లక్క శ్రవణ్ గౌడ్, పార్థ పెల్లి హరీష్,బనద రాజు, వద్దర్ల బాపు, ఓం ప్రకాష్, ప్రదీప్, రమేష్, శ్రీకాంత్, రాజయ్య తదితరులు ఉన్నారు

## నీకు, నీగురువు కేసీఆర్‌కు రాజకీయ పునర్జన్మను ఇచ్చింది ముస్లింలే

- ఖబర్దార్ కౌశిక్ రెడ్డి నీకు తుర్కోడా అనే దమ్ము వచ్చిందా ?
- బహిరంగ క్షమాపణ చెప్పకుంటే బట్టలు ఊడదీస్తాం.
- వ్యక్తిగతంగా విమర్శలు చేసుకో, కానీ కులం పేరుతో తుర్కోడని కించపరిస్తే నాలుక చీరేస్తాం.
- సిపి గౌష్ ఆలంపై ముస్లింలను ఉద్దేశించి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించిన ఎంఐఎం నేత గులాం అహ్మద్ హుస్సేన్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 30 (జనంసాక్షి) :**
కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ను ఉద్దేశించి బహిరంగంగా తుర్కోడని అసభ్య పదజాలంతో వీధి రౌడీ మాదిరిగా కించపరిచే వ్యాఖ్యలు చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని, ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ రాష్ట్ర ప్రభుత్వానికి, అసెంబ్లీ స్పీకర్ కు, ఒక ప్రకటనలో శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఖబర్దార్ కౌశిక్ రెడ్డి నీకు తురుకోడని దమ్ము ఎలా వచ్చిందని తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పకుంటే నీ బట్టలూడదీస్తామని సిపి పై చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని తీవ్రంగా ఖండించారు. కౌశిక్ రెడ్డిలో ఇన్నాళ్లు దాగి ఉన్న ఆర్ఎస్ఎస్ భావజాలం, ముస్లిం వ్యతిరేక ఆలోచన బయటపడిందన్నారు. కౌశిక్ రెడ్డి మదమెక్కినట్లు మాట్లాడితే ముస్లింలందరూ ఏకమై గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నీకు, రాజకీయ జన్మ ప్రసాదించిన కేసీఆర్ కు కేటీఆర్ కు, రాజకీయ పునర్జన్మను ఇచ్చింది ముస్లింలేనని గుర్తుపెట్టుకోవాలన్నారు. కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకొని ముస్లిం సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పకుంటే తెలంగాణలో కౌశిక్ రెడ్డిని తిరగనివ్వమని హెచ్చరించారు. నీ దాదాగిరి ఇంట్లో చూపెట్టుకోవాలి కానీ ముస్లింల మీద కాదని, వ్యక్తిగతంగా విమర్శలు చేసుకోవాలి గాని, కులం పేరుతో తురుకోడు అని కించపరిస్తే నాలుక చీరేస్తామన్నారు. రాబోయే రోజుల్లో కౌశిక్ రెడ్డికి రాజకీయ సమాధి కట్టేందుకు ముస్లింలందరూ ఏకమై, బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసి, ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ముస్లిం సమాజానికి గులాం అహ్మద్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే హోదాలో కౌశిక్ రెడ్డి తురుకోడని వ్యాఖ్యలు చేయడం ఎమ్మెల్యే పదవికి కళంకం తెచ్చాడన్నారు. ఎవరి పై పడితే వారిపై నోటి దురుసు ప్రయోగిస్తే ఊరుకున్నారు. కానీ ముస్లిం సమాజం కౌశిక్ రెడ్డిని ఉరికిచ్చి కొడుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధిగా ఉన్న కౌశిక్ రెడ్డి హుందాతనంగా మెలగాలి కానీ చిల్లర మాటలు మాట్లాడడం అవివేకానికి నిదర్శనం అన్నారు. తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## మణికొండలో పారిశుద్ధ్య సిబ్బందికి ఉచిత నేత్ర వైద్య శిబిరం

**రాజేంద్రనగర్, జనవరి 30 (జనంసాక్షి) :** నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండలో సిలికాన్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బందికి ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ టీ. కృష్ణమోహన్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ నేత్ర వైద్య శిబిరం ద్వారా పారిశుద్ధ్య సిబ్బందికి కంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి సర్కిల్ వైద్య అధికారి డా. కె.ఎస్. రవి, సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ డైరెక్టర్లు ముకేశ్ చోప్రా, ఎన్. వెంకటేష్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరాం పాల్గొన్నారు. శిబిరంలో సిలికాన్ ల్యాబ్స్ ఉద్యోగులు అనుభూతి వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు వాలంటీర్లుగా సేవలందించారు.



## మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు





- శాంతియుత, నిష్పక్షపాత ఎన్నికలే లక్ష్యం
- నామినేషన్ కేంద్రాలను పర్యవేక్షించిన ఎస్పీ రాజేష్ చంద్ర

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 30 (జనం సాక్షి) :**
కామారెడ్డి, జనవరి 30: మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజు నేపథ్యంలో కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర సందర్శించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. బారికేడ్లు, క్యూ లైన్లు, భద్రతా సిబ్బంది మోహరింపును స్వయంగా పరిశీలించిన ఆయన విధుల్లో ఉన్న అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.
నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉందని ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా గుంపులుగా రావడం, నినాదాలు చేయడం, ర్యాలీలు నిర్వహించడంపై నిషేధం ఉందని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయం వైపు వచ్చే రహదారులపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే ఉంచాలని, ప్రధాన కూడళ్ల వద్ద నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. జిల్లాలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఎస్పీ తెలిపారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో కామారెడ్డి టౌన్ ఎస్‌హెచ్‌ఓ నరహరి, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఇంఛార్జి కలెక్టర్ ఇలా త్రిపాఠి**

కామారెడ్డి, జనవరి 30: కామారెడ్డి మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ వార్డు ఎన్నికలకు ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఇంఛార్జి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి సందర్శించి పరిశీలించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో గత బుధవారం నుంచి మూడు రోజులుగా నామినేషన్ల స్వీకరణ సజావుగా జరుగుతోందని తెలిపారు. ఈ ప్రక్రియను ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనల ప్రకారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ల ఉపసంహరణ జనవరి 31న జరుగనుండగా, ఫిబ్రవరి 11న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.
ఇప్పటివరకు అందిన నామినేషన్ల సంఖ్య, నియమించిన ఆపరేటర్ల వివరాలు, అభ్యర్థుల సంఖ్య, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాల ఏర్పాటు, శిక్షణ తరగతుల నిర్వహణ, వెబ్‌కాస్టింగ్ సదుపాయం, ప్రింటింగ్ ప్రెస్ వివరాలు, బ్యాలెట్ బాక్సుల సరఫరా తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్, అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, ఆర్డీఓ వీణ, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, తహసీల్దార్ జనార్ధన్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ వర్క్ ఫోర్స్‌గా తెలంగాణ యువత


- స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ పై ప్రత్యేక దృష్టి
- ఆర్థిక వ్యవస్థను శాసించేది మూలధనం కాదు.. నైపుణ్యమే
- 'ఫీస్టా 2026' సదస్సులో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



మంథని, (జనంసాక్షి) : తెలంగాణ యువతను ప్రస్తుత అంతర్జాతీయ స్థాయి అవసరాలకు అనుగుణంగా 'గ్లోబల్ వర్క్ ఫోర్స్'గా తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆ దిశగా యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. శుక్రవారం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్ లో నిర్వహించిన 'ఫ్యూచర్ ఆఫ్ ఇంటెలిజెంట్ అండ్ ఎవాల్వ్ స్ట్రాటజీస్ ఇన్ టాలెంట్ అక్విజిషన్(ఫీస్టా) 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ఆర్థిక వ్యవస్థ గమనాన్ని శాసించేది మూలధనం కాదని, నైపుణ్యం మాత్రమేనన్నారు. నిరంతరం నేర్చుకునే తత్వం ఉన్న చోటే ప్రతిభ నిలుస్తుందని, అదే వృద్ధికి అసలైన ప్రాతిపదిక అన్నారు. భారత వృద్ధి రేటు సుమారు 7 శాతం వరకు ఉండొచ్చని తాజాగా విడుదలైన కేంద్ర ఆర్థిక సర్వే అంచనా వేసిందన్నారు. ఇది శుభపరిణామని, అయితే... ఈ వృద్ధిని నిలబెట్టుకోవాలంటే కేవలం బడ్జెట్ కేటాయింపులు సరిపోవని, సంస్థాగత సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. కృత్రిమ మేధపై ఆధారపడటం కంటే, దానిని సమర్థవంతంగా వాడుకునేలా సంస్థలు రూపాంతరం చెందాలని, లేకపోతే... దీర్ఘకాలంలో సవాళ్లు ఎదురయ్యే ప్రమాదముందన్నారు. కేవలం ఉద్యోగాలను సృష్టించే రాష్ట్రంగానే కాకుండా, పరిశ్రమలకు భవిష్యత్తు భాగస్వామిగా మార్చేలా తెలంగాణను తీర్చి దిద్దుతున్నామన్నారు. అత్యుత్తమ మానవ వనరులకు కేరాఫ్ అడ్రస్ గా తెలంగాణను నిలపడంలో ఏఐ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ, ఐకాం, లైఫ్ సైన్సెస్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటర్నేషన్ స్కూల్స్ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ, జాతీయ టెక్ కంపెనీలకు చెందిన హెచ్ ఆర్ హెడ్స్, సోషల్ టాలెంట్ ఫౌండర్ జానీ క్యాంప్ బెల్, క్యారలాన్ గ్లోబల్ సొల్యూషన్స్ ఎండీ పవన్ సచ్ దేవా, క్రౌడ్ స్ట్రైక్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ మీనన్, ప్రముఖ నటి, రచయిత్రి మందిరాబేడీ, ఫీస్టా 2026 ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు హరికృష్ణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ పోరాటాలను చెరిపివేయాలని కుట్ర చేస్తున్న బిజెపి

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి
- స్వాతంత్ర పోరాట యోధుల విలువలు తెలియని పార్టీ బిజెపి
- మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్



**కరీంనగర్, జనవరి 30 (జనంసాక్షి) :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ హాజరై పలువురు నాయకులతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... మోహన్ దాస్ కరం చంద్ గాంధీ ఈ దేశ స్వాతంత్రం కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తరిమి కొట్టడంలో కీలకపాత్ర వహించిన గొప్ప నాయకులు, ఉద్యమంలో భాగంగా ఈ దేశంలోని ప్రజలందరినీ సంఘటితం చేసి అహింస మార్గంలో స్వాతంత్రాన్ని సాధించిన మహనీయులు వారు చేసిన పోరాటాలు, ఉద్యమాలు త్యాగాలతో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలు గుర్తించి ఇప్పటికి వారిని కీర్తిస్తున్నాయన్నారు. కానీ నేడు ఈ దేశంలో భారతీయ జనతా పార్టీ మహాత్మా గాంధీ చేసిన పోరాటాలను ప్రజల హృదయాల నుండి చెరిపివేయాలని కుటీల ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ... గాంధీ భారత దేశ స్వతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించేయడమే కాక ఆనాటి అన్ని వర్గాలను కూడా కట్టుకొని ఉప్పు సత్యాగ్రహంతో పాటు బ్రిటిష్ ఉత్పత్తులన్నిటినీ నిరాకరించి స్వదేశీ అనే విధానానికి ఆనాడే అంకురార్పణ చేసిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీ, వారు చూపిన మార్గంలో శాంతి మార్గంలో అహింసా మార్గంలో ప్రజలందరూ నడవాలని, ఆ నాయకున్ని స్మరించుకుంటూ 2004లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు పెడితే నేడు బిజెపి ఆ పేరును జి రామ్ జి అనే పేరుగా మారుస్తుందని, నాడు స్వాతంత్ర ఉద్యమ సమయంలో ఉద్యమం తర్వాత కాంగ్రెస్ పార్టీ తప్ప ఈ దేశంలో బిజెపి అనే పార్టీలేనే లేదు, స్వతంత్ర పోరాట విలువలు గాని స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న నాయకుల విలువలు కానీ తెలియని పార్టీ బిజెపి, అందుకే నేడు మహాత్మా గాంధీ పేరును తొలగించాలని బిజెపి కుట్ర చేస్తుందన్నారు. ఆ ప్రయత్నం చేయడం ఈ దేశ ప్రజలను అవమానించడమే అవుతుందని, ఇప్పటికైనా బిజెపి మేల్కొని ఆ మహాత్ముని పేరు కొనసాగించాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ సంబంధంతో వ్యక్తి హత్య

## బిల్కల్ గ్రామంలో పొలం దగ్గర బండారాళ్లతో తలపై మోదీ హత్య



మర్పల్లి జనవరి 30 (జనం సాక్షి): అక్రమ సంబంధం కలిగిన మహిళకు దూరంగా ఉంటున్నాడని ఒక వ్యక్తిని హత్య చేసిన సంఘటన మర్పల్లి మండలం బిల్కల్ గ్రామంలో శుక్రవారం జరిగింది. మర్పల్లి ఎస్సై గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బిల్కల్ గ్రామానికి చెందిన చేరాల నర్సింలు గౌడ్(39) అనే వ్యక్తి దారుణ హత్యకు గురి అయ్యాడు. హతుడు పంట పొలం దగ్గర కాపలా ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు బండ రాళ్లతో తలపై బలంగా మోదీ హత్య చేశారు. ఈ విషయమై హతుడి భార్య చీరాల వసంత ఫిర్యాదు మేరకు మరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన బిల్కల్ గ్రామంలో తీవ్ర సంచలనం సృష్టించింది. బెల్కల్ గ్రామానికి చెందిన బేగారి నరసమ్మతో తన భర్తకు గత 8 సంవత్సరాలుగా అక్రమ సంబంధం ఉందని హతుడి భార్య వసంత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్తకు అనేకసార్లు చరవాణిలో మాట్లాడిందని తాను ఒకసారి చరవానిలో మాట్లాడితే నిన్ను హత్య చేసి నీ భర్తను దక్కించుకుంటానని తనను బెదిరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే తన భర్త గత రెండు మూడు నెలలుగా అక్రమ సంబంధం కలిగిన నర్సమ్మతో దూరంగా ఉంటున్నాడని తెలియజేసింది. తన వల్ల తన భర్త అక్రమ సంబంధం కలిగిన నరసమ్మకు దూరం ఉంటున్నాడని ఆక్రోసాన్ని పెంచుకున్న నరసమ్మ తన భర్తను హత్య చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేసింది. రాత్రిపూట భోజనం చేసి పంట కాపలకు వెళ్లిన తన భర్తను వారే హత్య చేసి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మరుపల్లి ఎస్సై అబ్దుల్ రవుఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని మరుపల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం శవాన్ని బంధువులకు అప్పగించారు.

# ముగిసిన నామినేషన్ల పర్వం

## అభ్యర్థులను ప్రకటించని ప్రధాన పార్టీలు

- బి ఫామ్‌లు ఎవరిని వివరించేనో...!
- నామినేషన్ విత్ డ్రాల కోసం కోసం ప్రారంభమైన రాయ 'బేరాలు'..

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 30 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొదటి ఘట్టం నామినేషన్ల దరఖాస్తుల గడువు శుక్రవారం సాయంత్రంతో ముగిసింది.నామినేషన్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ ప్రధాన పార్టీలు ఇప్పటి వరకు తమ అభ్యర్థులను ప్రకటించలేదు. ఇప్పటికే పలు వార్డుల్లో ఒక్కో పార్టీ నుంచి సుమారు రెండు నుంచి నలుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసి ఉన్నారు. బీ ఫాం ఎవరిని వరిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. కాగా పార్టీ పెద్దలు, బరిలో నిలవాలనుకుంటున్న నాయకులు ఒకరి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు వేసిన చోట బుజ్జగింపుల పర్వం ప్రారంభించారు. ఇందుకోసం నామినేషన్లను విత్ డ్రా చేసుకోవాలంటూ రాయ 'బేరాలు' నడుపుతున్నారు. భవిష్యత్తులో అవకాశాలు లభిస్తాయంటూ హామీ ఇస్తున్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో 28 వార్డులు ఉన్నాయి.వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభం అయిన నాటి నుంచి తమకు అనుకూలమైన రిజర్వేషన్ వచ్చినచోట ఆశావాహులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నోటిఫికేషన్ వచ్చిన క్రమంలో రెట్టింపు ఉత్సాహంతో బరిలో ఉంటున్నామని చాటిచెప్పారు. అయినప్పటికీ ఆయా పార్టీలు తమ అభ్యర్థులని ప్రకటించకుండా వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి.ఇక్కడే పలువురు ఆశావాహులు తమకు టికెట్ వస్తుందో లేదోనని ముందస్తుగానే ఇతర పార్టీలోకి చేరడం లేదా స్వతంత్ర అభ్యర్థిగా ఉండేందుకు రంగం సిద్ధం చేసుకుని నామినేషన్లను దాఖలు చేశారు.



### చివరి రోజు నామినేషన్ల కోలాహలం..

చివరి రోజు నామినేషన్లు దాఖలు చేసేందుకు అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయానికి రావడంతో కోలాహలం నెలకొంది. మరి కొంతమంది రెండవ సెట్టు మూడో సెట్టు దాఖలు చేశారు. మొదటి రోజు 16 నామినేషన్లు, రెండో రోజు 90,మూడో రోజు 154 నామినేషన్లు వచ్చాయి. నామినేషన్ ప్రక్రియ సమయం ముగిస్తుండడంతో అభ్యర్థులు నామినేషన్లు సమర్పించేందుకు పోటీపడ్డారు.మూడు రోజులలో 260 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వీటిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు 80 మంది నామినేషన్లు వేయగా, బిఆర్ఎస్ పార్టీకి చెందిన అభ్యర్థులు 69 నామినేషన్లు వేయగా, బిజెపికి చెందిన అభ్యర్థులు 64 మంది నామినేషన్లు దాఖలు చేశారు. సిపిఐ, జనసేన, ఏఐఎస్ఎఫ్, ఇండిపెండెంట్ అభ్యర్థులు 57 మంది నామినేషన్లు వేశారు.

### ప్రారంభమైన బుజ్జగింపుల పర్వం..

నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. అనంతరం నామినేషన్ల పరిశీలన ఉపసంహరణ మిగిలి ఉంది. ఈలోగా బరిలో ఉంటున్న వారిని బుజ్జగించి తమకు రెబల్ పోటీ లేకుండా చూసుకునేందుకు పలువురు పావులు కలుపుతున్నారు. స్వతంత్ర అభ్యర్థులను సైతం విత్‌డ్రా చేసుకునేందుకు చర్చలు కొనసాగిస్తు న్నారు. మొత్తం 260 మంది నామినేషన్లలో ఇంతమంది తమ నామినేషన్ విత్ డ్రా చేసుకుంటారో, ఎంతమంది బరిలో ఉంటారో ఫిబ్రవరి మూడున తేలనుంది.

# బీఆర్ఎస్ ధర్మయుద్ధం.. కాంగ్రెస్ కర్మయుద్ధం

- మున్సిపల్‌లో కాంగ్రెస్ ఓటమి ఖాయం
- 36 వార్డుల్లో గులాబీ జెండా ఎగరేస్తాం
- కాంగ్రెస్ డబ్బు-మద్యం ప్రలోభాలు
- దౌర్జన్య పాలనకు గుణపాఠం



తాండూరు, జనవరి 30 (జనంసాక్షి) : బీఆర్ఎస్ పార్టీది ధర్మయుద్ధం.. కాంగ్రెస్ పార్టీది కర్మయుద్ధమని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించిన రోహిత్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం పై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.
కాంగ్రెస్ పార్టీ డబ్బు, మద్యంతో ప్రజలను మభ్యపెట్టి ప్రలోభాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి చేసిందని, కాంగ్రెస్ నాయకులు దౌర్జన్య పాలనకు పాల్పడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో తాండూరు ప్రశాంతంగా ఉండగా.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో దౌర్జన్యాలు పెరిగాయని ఆరోపించారు. అభివృద్ధి బీఆర్ఎస్ పాలనలోనే సాధ్యమని.. కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తమని విమర్శలు గుప్పించారు. రోహిత్ రెడ్డి సహాయంతోనే మనోహర్ రెడ్డికి డీసీసీబీ చైర్మన్ పదవి దక్కిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌లో ఉండి ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చేరి బీఆర్ఎస్‌ను దూషించడం తగదని మండిపడ్డారు. మున్సిపల్ పీఠం బీఆర్ఎస్ కైవసం ఖాయమని.. తాటాకు చప్పట్లకు అదిరేది లేదు, బెదిరేది లేదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను తరిమికొడతారని.. ఆరాచక పాలన కాంగ్రెస్‌దేనని విమర్శించారు. 36 వార్డుల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మనోహర్ రెడ్డి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని.. బీఆర్ఎస్ నేతలపై దాడులు సరికాదని మండిపడ్డారు. వ్యాపారులు, ఉద్యోగులకు కాంగ్రెస్ ఇబ్బందులు కలిగిస్తోందని ఆరోపించారు. ఇసుక మాఫియా కొనసాగుతోందని.. ఎర్రమట్టి తరలింపుతో గుట్టలు మాయమవుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ఖేల్ ఖతం.. మున్సిపల్ ఎన్నికల తర్వాత మూట కట్టుకుని వెళ్లిపోవాలని హెచ్చరించారు. విమర్శలు చేయడం కాదు.. దమ్ముంటే అభివృద్ధిలో పోటీపడాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పరుగులు పెట్టిందని.. సీనియర్ నాయకులు త్వరలో బీఆర్ఎస్‌లో చేరతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజుగౌడ్, బీఆర్ఎస్ ఎన్నికల ఇంఛార్జి శ్రీశైల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మీ, కోట్రిక నాగలక్ష్మీ, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌కు షాక్.. డాక్టర్ సంపత్ కుమార్ రాజీనామా

- పైలెట్ రోహిత్ రెడ్డిని కలిసిన సంపత్ కుమార్
- మున్సిపల్ ఎన్నికలపై చర్చ.. బీఆర్ఎస్‌లో చేరిక యోచన
- వ్యక్తిగత కారణాలు.. పార్టీలో ఆదరణ లేకపోవడం

తాండూరు, జనవరి 30 (జనం సాక్షి) : తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బీవీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్ కుమార్ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. వ్యక్తిగత కారణాలతోపాటు పార్టీలో తనకు తగిన ఆదరణ లభించడం లేదని రాజీనామాకు ప్రధాన కారణంగా డాక్టర్ సంపత్ కుమార్ పేర్కొన్నారు. కొన్ని రోజులు పార్టీ రాజకీయాలకు దూరంగా ఉంటానని, ఏ పార్టీలో చేరాలనే విషయాన్ని పదేపదే ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.
రాజీనామా తర్వాత డాక్టర్ సంపత్ కుమార్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిని కలిశారు. రోహిత్ రెడ్డి సాదరంగా ఆహ్వానించి చిరునవ్వుతో మిఠాయిలు తినిపించారు. అనంతరం మున్సిపల్ ఎన్నికలపై చర్చించారు. రోహిత్ రెడ్డి వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థి నర్సింలు తదితరులు ఉన్నారు.

# రోడ్డు ఆక్రమణలపై ట్రాఫిక్ సీఐకి ఫిర్యాదు

- 20 కాలనీల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- తక్షణ చర్యలు తీసుకోవాలి
- లెక్చరర్స్ కాలనీ డివిజన్ జేపీసీ



హయత్ నగర్, జనవరి 30 (జనం సాక్షి) : లెక్చరర్స్ కాలనీ డివిజన్, ఎల్బీనగర్ నియోజకవర్గం, ఆటోనగర్ సర్కిల్ పరిధిలోని సుమారు 20 కాలనీల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వనస్థలిపురం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ని కలిసి రోడ్డు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. ఆటోనగర్ ప్రధాన రహదారి అనుబంధ రోడ్లపై ఫ్రూట్ విక్రేతలు అనధికారికంగా బండ్లు ఏర్పాటు చేయడం, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు, ఆటోలు, లోడింగ్ వాహనాలు రోడ్లపై అడ్డంగా నిలిపివేయడం వల్ల తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని వారు వివరించారు. ఈ కారణంగా రోడ్డు ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గట్టుమల్లు దృష్టికి తీసుకువచ్చారు. ఈ రోడ్డు ఆక్రమణల వల్ల పాఠశాల పిల్లలు, మహిళలు, వృద్ధులు రోడ్డు దాటలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అంబులెన్స్‌లు, ఇతర అత్యవసర వాహనాలు ఆలస్యంగా చేరుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇప్పటికే పలు చిన్న, పెద్ద ప్రమాదాలు చోటుచేసుకున్నాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సమస్యపై స్పందించిన వనస్థలిపురం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రోడ్డు ఆక్రమణలను తొలగించడం, అక్రమంగా వాహనాలు నిలిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం, ట్రాఫిక్ సజావుగా నడిచేలా అవసరమైన చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వాతి రెసిడెన్సీ కాలనీ అధ్యక్షులు సీమా సోమనాథ్, లెక్చరర్స్ కాలనీ అధ్యక్షులు కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, బాలాజీ నగర్ అధ్యక్షులు మోహన్ రెడ్డి, పవనగిరి కాలనీ ఫేస్ 1-బి సాయిలు, పవనగిరి కాలనీ ఫేస్ 2 అధ్యక్షులు బి కృష్ణ మూర్తి, సిరి హిల్స్ కాలనీ అధ్యక్షులు రవీంద్ర రెడ్డి, ఎల్లారెడ్డి రెడ్డి కాలనీ - ఫేజ్ 2 అధ్యక్షులు కె. శ్రీనివాస్, లక్ష్మీ భవానీ కాలనీ అధ్యక్షుడు సత్యం పాల్గొన్నారు.

# పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

## తహశీల్దార్ కృష్ణయ్య, సీఐ భూపాల్ శ్రీధర్




చేవెళ్ల,జనవరి 30 (జనంసాక్షి): సమాజంలో ఎవరి హక్కులకు భంగం కల్గించొద్దని తహశీల్దార్ కృష్ణయ్య, సీఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. చేవెళ్లలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కృష్ణయ్య మాట్లాడుతూ...పౌర హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కుల వివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించాలని, అన్ని కులాలు, వర్గాలవారు సోదరభావంతో మెలగాలని సూచించారు. పౌర హక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.కులమతాలకు అతీతంగా అందరూ కలిసి ఉంటేనే పౌరహక్కులను సమానంగా అనుభవిస్తారని తెలిపారు. సమాజంలో కుల వివక్షను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దళితులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు తోటి వారు సహకరించాలన్నారు.
అన్ని గ్రామాల్లో పౌరహక్కుల దినోత్సవాన్ని జరుపుకొని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫర్ హాస్టల్ వెల్ఫర్ అధికారి శ్రీపావని, డిప్యూటీ తహశీల్దార్ రాజేందర్, చేవెళ్ల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సున్నపు ప్రవీణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.




# అప్లికేషన్లు లేనిచోట అభ్యర్థులెక్కడ?

**గౌరవం దక్కకా దూరం అవుతున్న సీనియర్ నేతలు**

## కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్కంఠ రేపుతున్న దేవరకద్ర మున్సిపల్ ఎన్నికలు

### దేవరకద్ర హస్తం పార్టీలో 'సంతకం' ఎవరిది

మహబూబ్ నగర్ బ్యూరో జనవరి 30 (జనంసాక్షి) : మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని దేవరకద్ర, భూత్పూర్ మున్సిపాలిటీలకు జరుగుతున్న ఎన్నికలు కాంగ్రెస్ పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో జిల్లా కాంగ్రెస్ కమిటీ యట్నక్క భాగస్వామ్యం కోంత లేకపోవడం ఆభ్యర్థులతో చర్చలు సంప్రదింపులు సైతం ఏమాత్రం మెరపకపోవడం చర్చనీయంశంగా మారింది. ఈ క్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీకి, దేవరకద్ర ఏమ్మేల్యకు మధ్య సమన్వయం లోపించడంతో పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నాయి.

**వింత పరిస్థితి.. దరఖాస్తులు లేని అభ్యర్థిత్వం**

మున్సిపల్ స్థానాలకు పోటీ చేసే ఆశావహుల నుంచి జిల్లా కాంగ్రెస్ కమిటీ దరఖాస్తులను ఆహ్వానించగా, మహబూబ్‌నగర్ నగరం నుంచి భారీగా వినతులు వచ్చాయి. అయితే, ఆశ్చర్యకరంగా దేవరకద్ర మరియు భూత్పూర్ మున్సిపాలిటీల నుంచి ఒక్క అప్లికేషన్ కూడా జిల్లా కాంగ్రేస్‌కు అందలేదు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికే టికెట్ కేటాయించాల్సి ఉండగా, అసలు వినతులే లేని చోట డీసీసీ అధ్యక్షులు అభ్యర్థులను ఎలా ఖరారు చేస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. సీనియర్ నేతలంతా కూడ ప్రస్తుతం మున్సిపల్‌ఎన్నికలకు అంటిముట్టనట్లుగా ఉంటున్నట్లు తెలుస్తుంది.

**ఎమ్మెల్యే వర్సెస్ డీసీసీ అధ్యక్షుడి మధ్య కోల్డ్ వార్**

దేవరకద్ర ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ మధ్య సఖ్యత లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే తన అనుచరులను డీసీసీ అధ్యక్షుడిని కలవకుండా అడ్డుకుంటున్నారని, సొంతంగా అభ్యర్థులను ప్రకటించే యోచనలో ఉన్నారని పార్టీలో చర్చ జరుగుతోంది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే మరియు జిల్లా నాయకత్వం కలిసి పనిచేయకపోవడం పార్టీ విజయవకాశాలను దెబ్బతీస్తుందని సీనియర్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సీనియర్ నేతలు అంతా నియోజకవర్గ నేత ఓంటేద్దు పోకడలు నచ్చాక ఈ ఏన్నికలు దూరంగా ఉన్నట్లుగా తేలుస్తుంది.

**బీ-ఫామ్‌పై ఎవరి సంతకం**

ఇదే తరుణంలో అభ్యర్థులకు ఇచ్చే బీ-ఫామ్‌లపై సంతకం చేసే అధికారం ఎవరికి ఉంటుందనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నిబంధనల ప్రకారం డీసీసీ అధ్యక్షుడే సంతకం చేయాల్సి ఉన్నప్పటికీ, ఎమ్మెల్యేనే అంతా తానై వ్యవహరిస్తుండటంతో అభ్యర్థుల్లో గుబులు మొదలైంది. ఒకవేళ ఎమ్మెల్యే ఇచ్చిన బీ-ఫామ్‌ను డీసీసీ అధ్యక్షులు గుర్తించకపోతే పరిస్థితి ఏంటన్న ఆందోళనలో ఆశావహులు ఉన్నారు. ఈ అంతర్గత పోరును అధిష్టానం ఎలా పరిష్కరిస్తుందో అన్న చర్చ సాగుతుంది.

# కోట్లాది రూపాయలతో శేరిలింగంపల్లి అభివృద్ధి

- రూ.4.70 కోట్లతో మియాపూర్‌లో భూగర్భ డ్రైనేజ్ పనులు
- చందానగర్‌లో రూ.84 లక్షలతో యూజీడీ పనులు
- పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ శంకుస్థాపన.. సమగ్ర అభివృద్ధికి కృషి



శేరిలింగంపల్లి, జనవరి 30 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ హామీ ఇచ్చారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.4 కోట్ల 70 లక్షల 35 వేల ప్రభుత్వ నిధులతో భూగర్భ డ్రైనేజ్ (యూజీడీ) పైప్ లైన్ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. దోవా కాలనీ, శ్రీల గార్డెన్, న్యూ కాలనీ, శ్రీ లక్ష్మీ నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, టీఎన్ నగర్, ఎం.ఏ నగర్, ప్రశాంత్ నగర్, నాగార్జున ఎన్‌క్లేవ్, బీకే ఎన్‌క్లేవ్, రెడ్డి కాలనీ, మక్త మహబూబ్‌పేట విలేజ్, కృష్ణ సాయి ఎన్‌క్లేవ్, జనప్రియ వెస్ట్ సిటీ తదితర కాలనీల్లో ఈ పనులు చేపడతామని అరికెపూడి గాంధీ తెలిపారు. భూగర్భ డ్రైనేజ్ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, డివిజన్ కార్పొరేటర్లు, ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు ప్రత్యేక చొరవతో రూ.4.70 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. శ్రీల గార్డెన్ కాలనీలో రూ.25.50 లక్షలు, దోవా కాలనీలో రూ.96 లక్షలు, శ్రీలక్ష్మీ నగర్ కాలనీలో రూ.24.50 లక్షలు, న్యూ కాలనీలో రూ.35 లక్షలు, ఎఫ్‌సీఐ వీడియో కాలనీలో రూ.35.50 లక్షలు, టీఎన్ నగర్ కాలనీలో రూ.23 లక్షలు, ఎం.ఏ నగర్ కాలనీలో రూ.30.50 లక్షలు, ప్రశాంత్ నగర్ కాలనీలో రూ.23.50 లక్షలు, నాగార్జున ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.48 లక్షలు, బీకే ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.28.60 లక్షలు, రెడ్డి కాలనీలో రూ.22 లక్షలు, మక్త మహబూబ్‌పేట విలేజ్‌లో రూ.23 లక్షలు, కృష్ణ సాయి ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.28.20 లక్షలు, జనప్రియ వెస్ట సిటీ కాలనీలో రూ.24 లక్షలతో భూగర్భ డ్రైనేజ్ పనులు చేపట్టనున్నారు.
చందానగర్ డివిజన్ పరిధిలో శుభోదయం, శంకర్ నగర్ తదితర కాలనీల్లో రూ.84 లక్షలతో భూగర్భ డ్రైనేజ్ పనులకు డివిజన్ కార్పొరేటర్ మంజులా రఘునాథ్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో మియాపూర్ కార్పొరేటర్ పొలపాటి శ్రీకాంత్, హైదర్ నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం శ్రీమాన్ నారాయణ, మేనేజర్ సునీత రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు, స్థానికులు పాల్గొన్నారు.

# పల్లెల్లో జోరుగా గుడుంబా తయారీ

- బావోజీ తండాలో నాటు సారా తయారీదారుడి అరెస్ట్
- కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి



ఉర్కొండ జనవరి 30, (జనంసాక్షి) : నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండల పరిధిలోని అక్రమ మద్యం, సారా తయారీపై ఉక్కుపాదం మోపే దిశగా కల్వకుర్తి పోలీసులు,ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా దాడులు నిర్వహించారు. కల్వకుర్తి బృందం,నాగర్ కర్నూల్ డిటిఎఫ్ బృందాలు కలిసి శుక్రవారం ఊర్కొండ మండలంలోని రాంరెడ్డిపల్లి తండా,బావోజీ తండాలలో సారా నిల్వలు ఉన్నట్లు అందిన ముందస్తు సమాచారంతో అధికారులు ఈ దాడులు నిర్వహించారు.ఈ సోదాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 250 లీటర్ల ఎఫ్.జె వాష్‌ను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అలాగే నిందితుల వద్ద నుండి 30 కిలోల బెల్లం మరియు 30 కిలోల పటికను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశామన్నారు. నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తిని అంజి అనే వ్యక్తి నాటు సారా తయారు చేస్తూ పట్టుబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు,అరెస్టు చేశారు.శుక్రవారం ఊర్కొండ తహశీల్దార్ యూసుఫ్ అలీ ముందు హాజరుపరిచి నిందితుడు మళ్లీ ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండేలా తహశీల్దార్ సమక్షంలో బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు.వారు మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా,ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ అక్రమంగా మద్యం తయారు చేసినా చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. డిటిఎఫ్ సిఐ రాజ్యలక్ష్మి, ఎస్ఐ వివేక్, సిబ్బంది నార్యా, పరశురామ్,తిరుపతి రెడ్డి, ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
31 జనవరి 2026

# టీసాట్ డిజిటల్ కంటెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- బీఈడీ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించొచ్చు
- ఎడ్ సెట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు ప్రసారం చేసే ఎడ్ సెట్ ప్రసారాలను బీఈడీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డితో కలిసి ప్రసారాల వివరాలు తెలిపే షెడ్యూల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎడ్‌సెట్‌లో ఉన్నతమైన ర్యాంకులు సాధించేందుకు టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా బీఈడీ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రధాన్యత నిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. టి-సాట్ కంటెంట్ సోషల్ మీడియా ఫ్లాట్ ఫాం ద్వారా అందుబాటులో ఉంటుందని, తద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. తెలంగాణా ప్రభుత్వం నిర్వహించే ప్రతి పోటీ పరీక్షకు టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, మే నెలలో జరిగే ఎడ్ సెట్ పరీక్ష కోసం అభ్యర్థులను సిద్ధం చేసేందుకు ఫిబ్రవరి రెండో తేది నుండి మే 11వ తేది వరకూ రోజుకు నాలుగు గంటల పాటు 392 ఎపిసోడ్స్ ప్రసారం చేస్తున్నామన్నారు. బయాలజీ, ఫిజికల్ సైన్స్, మాథమేటిక్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టులతో 98 రోజుల పాటు టి-సాట్ విద్య, నిపుణ ఛానళ్లతో పాటు టి-సాట్ యాప్, యూట్యూబ్‌లో ప్రసారాలు కొనసాగుతాయి. పోటీ పరీక్షలకు డిజిటల్ కంటెంట్ అందించేందుకు కృషి చేస్తున్న సీఈవో వేణుగోపాల్ రెడ్డిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి-సాట్ ఎగ్జుక్యూటీవ్ డైరెక్టర్ ఎం.డి సాధిక్ పాల్గొన్నారు.

# వెదురు కర్రలే దైవాలుగా... గద్దెలే గర్భగుడులుగా...



- కోట్లాది హృదయాలను ఏకం చేస్తున్న మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర

**ములుగు బ్యూరో, జనవరి 30 (జనం సాక్షి):** వెదురు కర్రలే దైవాలుగా, గద్దెలే గర్భగుడులుగా, పసుపు-కుంకుమలే వజ్రాభరణాలుగా,బెల్లమే నిలువెత్తు బంగారంగా, ఒడిబియ్యమే పరమాన్నంగా,చీర ముక్క-రైక బట్టలే సారెలుగా మారి తల్లులకు సమర్పించే అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవం - మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర భక్తి పారవశ్యంతో అట్టహాసంగా కొనసాగుతోంది. వన దేవత... మన దేవత... జన దేవత అంటూ అపార విశ్వాసంతో కోట్లాది భక్తుల హృదయాలను ఏకం చేసే ఈ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన జాతరకు దేశం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తజనం మేడారానికి తరలివస్తున్నారు.

### భక్తులతో కిక్కిరిసిన జాతర ప్రాంగణం

జాతర ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడుతోంది. ఎటు చూసినా భక్తులే దర్శనమిస్తున్నారు. క్రమబద్ధంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో భక్తుల బారులు దర్శనానికి ఎదురుచూస్తుండగా, ప్రశాంత వాతావరణంలో తల్లుల దర్శనాలు సజావుగా కొనసాగుతున్నాయి. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలతో భక్తుల సందడి నెలకొనగా, గద్దెల వద్ద భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

### వైద్య బృందాలు, వాలంటీర్లు అప్రమత్తం ....

జాతర ప్రాంగణం అంతటా వైద్య బృందాలు అప్రమత్తంగా సేవలందిస్తుండగా, క్యూ లైన్ల వద్ద వాలంటీర్లు నిరంతరం భక్తులకు సహకారం అందిస్తున్నారు. భక్తుల రద్దీని తట్టుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు సమర్థంగా కొనసాగుతున్నాయి. మేడారం మహా జాతరకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి సుమారు 500 మంది ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు సేవలందిస్తున్నారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద, క్యూ లైన్లలో భక్తులకు సహాయం చేయడం, జంపన్న వాగు వద్ద సూచనలు ఇవ్వడం, తప్పిపోయిన భక్తులను శిబిరాలకు చేర్చడం వంటి సేవలతో వాలంటీర్లు జాతరలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

ప్రముఖుల దర్శనాలు...

ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నిలువెత్తు బంగారం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తల్లులను దర్శించుకున్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అమ్మవార్లను దర్శించుకున్నారు. మంత్రి సీతక్క, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారాయణ అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ గ్యారత్ వెన్ ఓవెన్ సమ్మక్క-సారలమ్మలకు తులాభారం సమర్పించి తల్లులను దర్శించుకున్నారు.





### భక్తుల ప్రశంసల జల్లు

ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి దర్శనాలు మరింత సులభంగా, వేగంగా జరుగుతున్నాయని, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ప్రశంసిస్తున్నారు. భక్తి, నమ్మకం, సంప్రదాయం, సంస్కృతి సమ్మేళనంగా ప్రభుత్వ సమర్థ నిర్వహణతో మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర సజావుగా సాగుతున్నది.

# పోలీసులపై 'పాడి' ప్రవర్తన గర్హనీయం

- తెలంగాణ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపిరెడ్డి యేదుల

**హైదరాబాద్ (జనంసాక్షి) :** వీణవంక మినీ సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పోలీసుల మీద చేసిన వ్యాఖ్యలను, వారి ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోపిరెడ్డి యేదుల తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేస్తున్న పోలీసుల పట్ల ఎమ్మెల్యే చేసిన అసభ్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా గుంపులుగా వెళ్లడమే కాకుండా, బాధ్యత గల ప్రజా ప్రతినిధి అయి ఉండి కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ వెళ్ళడానికి ప్రయత్నించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం దురదృష్టకరమన్నారు. అక్కడ ఉత్పన్నమయ్యే శాంతి భద్రతల పరిస్థితి గురించి, కోర్టు ఉత్తర్వుల గురించి పోలీసు అధికారులు ఎమ్మెల్యేకు పూర్తిగా వివరించినప్పటికీ వారు అనుచితంగా ప్రవర్తించడమే కాక మహిళా పోలీసు అధికారులపట్ల కూడా దురుసుగా ప్రవర్తించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం గర్హనీయమన్నారు. బాధ్యత గల ఎమ్మెల్యే అయ్యుండీ పోలీసు అధికారుల మత ప్రస్తావన తేవడం దారుణమన్నారు. పైగా అక్కడ ప్రత్యక్షంగా లేని కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను ఉద్దేశించి, మత ప్రస్తావన చేస్తూ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవని, బాధ్యత గల ప్రజా ప్రతినిధి అనేది మర్చిపోయి కేవలం పబ్లిసిటీ కోసం వివాదాలు సృష్టించడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడాన్ని ప్రజాస్వామిక వాదులు అందరూ ఖండించాలని కోరారు. గౌరవ ప్రజా ప్రతినిధులు తమ బాధ్యతల పట్ల మరింత గౌరవంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల పట్ల, శాంతి భద్రతల పట్ల నిబద్దతతో విధులు నిర్వర్తిసున్న తెలంగాణ పోలీసుల ఖ్యాతిని ఎవరూ విస్మరించలేరని, అలాంటి వ్యవస్థ మీద మత పరమైన వ్యాఖ్యలు చేయడం అత్యంత గర్హనీయమని అన్నారు. ఈ సంఘటనను పోలీసు వ్యవస్థ మనోబలాన్ని దెబ్బతీసే చర్యగా పరిగణిస్తామన్నారు. ఇలాంటి చర్యల పట్ల పోలీసు శాఖ తీవ్రంగా వ్యవహరిస్తుందని గుర్తుంచుకోవాలని, చట్ట ప్రకారం చర్యలకు తాము ఉపక్రమిస్తామని, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వెంటనే తన అసంగత, అసంబద్ధ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, పోలీసు అధికారులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# కంటతడి పెట్టిస్తున్న మృతుడి ఫోన్ కాల్ ఆడియో

- రక్షించాలంటూ వేడుకున్న ఇంతియాజ్
- నాంపల్లి ఫర్నీచర్ షాప్ అగ్నిప్రమాదంలో విషాద సంఘటన



**హైదరాబాద్, జనవరి 30 (జనంసాక్షి) :** నాంపల్లి ఫర్నీచర్ షాపులో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నెల 24న షాపులోని సెల్లార్‌లో చెలరేగిన మంటల్లో చిక్కుకుని ఐదుగురు మరణించారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి ఒక బాధితుడి కాల్ రికార్డింగ్ ఆడియో లీకైంది. మృతుల్లో ఒకరైన ఇంతియాజ్ అనే యువకుడు.. అగ్ని ప్రమాదం సంభవించిన తర్వాత తన స్నేహితుడికి ఫోన్ చేసి, రక్షించమని వేడుకున్నాడు. తాను మంటల్లో లోపల చిక్కుకున్నట్లు, బయటకు రావడానికి ఏమీ కనిపించడం లేదని స్నేహితుడికి చెప్పాడు. అందులోంచి బయటకు రావడానికి అన్ని దారులు మూసుకుపోయాయని ఫోన్లో చెప్పాడు. తనతోపాటు పిల్లలు కూడా ఉన్నట్లు తెలిపాడు. ప్రస్తుతం ఇంతియాజ్‌కు సంబంధించిన ఈ ఆడియో వైరల్ అవుతోంది. ప్రాణాలు కోల్పోవడానికి కొద్ది సేపటి ముందు కాల్‌లో అతడి ఆవేదన అందరినీ కలిచివేస్తోంది. చివరి క్షణాల్లో బాధితుల వేదన కూడా రికార్డయ్యింది. ఘటనకు సంబంధించి.. సెల్లార్‌లోని ఫర్నీచర్ షాపులో మంటలు చెలరేగి, భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో లోపల ఉన్న ఐదుగురు అందులో చిక్కుకుపోయారు. చుట్టూ పొగ, మంటల ధాటికి బయటికి రాలేకపోయారు. బయటికొచ్చే ఏ మార్గం లేకపోవడంతో అందులోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అందరూ బయటికొచ్చేశారు. లోపల గార్డు యాదయ్య కుమారులు ప్రణీత్, అఖిల్ ఉండిపోయారు. వారిని కాపాడేందుకు ఉస్మాన్ ఖాన్, ఆయన భార్య బేబి, ఇంతియాజ్ వెళ్లారు. చివరకు ఈ ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

# తెలంగాణలో ఏమీ సాధించుకోలేక పోయాం

- సమ్మక్క జాతరలో కవిత ఆవేదన



**ములుగు, జనవరి 30 (జనంసాక్షి) :** తెలంగాణ ఏర్పడిన తర్వాత 12 ఏండ్లలో ఏమీ సాధించుకోలేక పోయామని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో వేటిని కూడా సంపూర్ణంగా సాధించుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం కూడా జం గలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మను ఆమె దర్శించుకున్నారు. అంతకు ముందు గట్టమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిలువెత్తు బంగారాన్ని అందించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. అమ్మవార్లు వారి జాతి కోసం చేసిన పోరాటం చరిత్రాత్మకమని చెప్పారు. ఇవాళ తెలంగాణ జాతి కోసం అందరం నిలబడాల్సిన అవసరం ఉందన్నారు.

# లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్ఐ

**బెంగళూరు, జనవరి 30 (జనంసాక్షి) :** లంచం తీసుకుంటున్న ఘటనలు ఇటీవల చాలా పెరిగిపోయాయి. కిందిస్థాయి ఉద్యోగి నుంచి పైస్థాయి వరకు ప్రభుత్వ ఉద్యోగులు లంచం కేసుల్లో పట్టుబడుతున్నారు. లంచం తీసుకోవడం ద్వారా అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. చిన్న ఉద్యోగి దగ్గర కూడా కోట్లలో అక్రమాస్తులు బయట పడుతున్నాయి. ఇలాంటి ఘటనలు దేశవ్యాప్తంగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా బెంగళూరులో లంచం తీసుకుంటూ ఓ ఎస్సై అడ్డంగా దొరికాడు. వివరాల్లోకి వెళితే.. ఓ ఫ్రాడ్ కేసులో బిల్డర్ నుంచి రూ.4లక్షలు లంచం తీసుకుంటుండగా గురువారం బెంగళూరుకు చెందిన సబ్ ఇన్ స్పెక్టర్ ను కర్ణాటక లోకాయక్త పోలీసులు అరెస్ట్ చేశారు.

# రికార్డు చేసుకో.. మీ అక్కను చంపేస్తున్నా

- బావమరిదికి ఫోన్ చేసి మరీ భార్యను చంపిన దుర్మార్గుడు
- స్వాట్ కమాండో హత్య కేసులో దర్యాప్తులో వివరాలు వెల్లడి



**న్యూఢిల్లీ, జనవరి30 (జనంసాక్షి) :** దేశ రాజధాని నగర పోలీసు విభాగంలో స్వాట్ కమాండోగా పనిచేస్తున్న కాజల్ చౌధరి(27)ని ఆమె భర్త అంకుర్ డంబెల్‌తో కొట్టి చంపిన కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. మృతురాలి సోదరుడు నిఖిల్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. హత్యకు సంబంధించిన పలు కీలక విషయాలు వెల్లడించాడు. 'హత్యకు ముందు నా సోదరి కాల్ చేసి, తన భర్త వేధిస్తున్నట్లు చెప్పింది. అదే సమయంలో అక్కడే ఉన్న అంకుర్ ఆమె నుంచి ఫోన్ లాక్కొని రికార్డు చేసి పెట్టుకో.. పోలీసులకు ఆధారంగా పనికొస్తాయి. మీ అక్కను చంపుతున్నా అని బెదిరించాడు. ఆ సమయంలో అతడిని ఎంత సముదాయించడానికి ప్రయత్నించినప్పటికీ నా మాటలు వినలేదు. కొంతసేపటి తర్వాత అంకుర్ కాల్ చేసి, కాజల్ చనిపోయిందని.. గాజియాబాద్ ఆస్పత్రికి వచ్చి చూసుకొమ్మని చెప్పాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి వెళ్లగా గర్భిణి అయిన నా సోదరి మృతిచెంది ఉందని సోదరుడు నిఖిల్ బావురుమన్నాడు. 2023లో అంకుర్‌తో కాజల్ వివాహం అయిన సమయంలో పెద్ద మొత్తంలో కట్నం ఇచ్చామని, అయినా అత్తింటివారు అదనపు కట్నం కోసం తన కుమార్తెను వేధించేవారని మృతురాలి తల్లి ఆరోపించింది. రక్షణశాఖలో క్లర్కుగా పనిచేస్తున్న అంకుర్‌కు ఆర్థికపరమైన అంశాల్లో భార్య కాజల్‌తో తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 22న దంపతుల మధ్య గొడవ తీవ్రరూపం దాల్చడంతో విచక్షణ కోల్పోయిన అంకుర్ ఆమెపై దాడిచేసి, డంబెల్‌తో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కాజల్ గాజియాబాద్ ఆసుపత్రిలో అయిదు రోజులు మృత్యువుతో పోరాడి మంగళవారం మృతి చెందగా.. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంకుర్‌ను అరెస్టు చేసిన పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీలోని మోహన్ గార్డెన్ ప్రాంతంలో కాజల్-అంకుర్ నివాసంలో ఈ ఘటన జరిగింది. భర్త.. నిందితుడైన అంకుర్ తన భార్య కాజల్ తలని తలుపు ఫ్రేమ్‌కు బలంగా కొట్టి, ఆపై బరువైన డంబెల్ తో ఆమె తలపై దాడి చేశాడు. దాడి సమయంలో కాజల్ నాలుగు నెలల గర్భిణీ. ఆసుపత్రిలో ఐదు రోజులపాటు మృత్యువుతో పోరాడి, జనవరి 27న కమాండో కాజల్ కన్నుమూశారు. కట్నం వేధింపులే తమ బిడ్డ హత్యకు ప్రధాన కారణమని కాజల్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. నిందితుడు అంకుర్ చౌదరి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో క్లర్కుగా పనిచేస్తున్నాడు. పెళ్లిలో బుల్లెట్ బైక్, బంగారం ఇచ్చినప్పటికీ, కారు ఇవ్వలేదని అతను తరచూ కాజల్‌ను వేధించేవాడని తెలుస్తోంది. పోలీసులు.. నిందితుడు అంకుర్ చౌదరిని అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపారు. ముందుగా హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు.. కాజల్ మరణం తర్వాత దానిని హత్య కేసుగా మార్చారు. కాజల్-అంకుర్ దంపతులకు ఇప్పటికే ఒకటిన్నర ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆ బాబు కాజల్ తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు.

# ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

- వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ సమర్పణ
- అత్యధికసార్లు ప్రవేశ పెట్టిన మహిళా మంత్రిగా ఘనత



**న్యూఢిల్లీ, జనవరి 30 (జనంసాక్షి) :** నిర్మలా సీతారామన్ ఆర్థికమంత్రిగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1న ఆమె పార్లమెంటులో బడ్జెడెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశ పెట్టనున్న 9వ బడ్జెట్ ఇది. పార్లమెంటులో 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మాజీ మంత్రి పి.చిదంబరం సొంతం. 1996లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవగౌడ సారథ్యంలో మంత్రి చిదంబరం తొలిసారిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1997లో రెండోసారి, 2004-08 మధ్య కాలంలో వరుసగా ఐదు సార్లు, 2013, 2014ల్లో మరో రెండు సార్లు ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక లోక్‌సభలో అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. భారత్ కు సంబంధించిన తొలి బడ్జెట్‌ను 1860లో అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టారు. భారత మండలి సభ్యుడిగా ఆయన ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం, భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల పేరిట వలసపాలకులు ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక స్వాతంత్ర్యానం తరం, 1947 నవంబర్ 26న భారత దేశ ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డును మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. మొత్తం 10 బడ్జెట్‌లను ఆయన పార్లమెంటు ముందుకు తెచ్చారు. 1959-64 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిగా ఆరు సార్లు, ఆ తరువాత 1967-1969 మధ్య మరో నాలుగు సార్లు ప్రవేశపెట్టారు. ఇక ప్రణబ్ ముఖర్జీ కూడా వివిధ సందర్భాల్లో మొత్తం 8 బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. 1982-84 మధ్యకాలంలో వరుసగా మూడు సార్లు, ఆ తరువాత 2009-12 మధ్య వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరుసగా ఐదు సార్లు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు తొమ్మిదోసారి నిర్మలమ్మ బడ్జెట్‌తో ముందుకు రానున్నారు.

# పెళ్లి పేరుతో వేధింపులు.. అవమానాలు

- తట్టుకోలేక మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



**వరంగల్, జనవరి 30 (జనంసాక్షి) :** ఇద్దరు యువకులు వేధించడం, అవమానించడం తట్టుకోలేక ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యతండాకు చెందిన అనిత.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. అనితను తొర్రూరు మండలానికి చెందిన దూరపు బంధువు రాజేందర్ పెళ్లి చేసుకుంటానని నాలుగేళ్లుగా చెబుతూ వస్తున్నాడు. ఇటీవల అనిత డ్యూటీలో ఉండగా వీడియో కాల్ చేయమని చెప్పడం, ఎవరితోనో మాట్లాడుతున్నావంటూ రాజేందర్ ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. అతని వేధింపులు తట్టుకోలేక అనిత తన తల్లిదండ్రులతో చెప్పి బాధపడింది. రాజేందర్ పద్ధతి నచ్చక, తమ కూతురుని అతడికి ఇచ్చి పెళ్లి చేయడం కుదరదని తేల్చి చెప్పారు. అయినా అనితను పెళ్లి చేసుకుంటానంటూ బతిమలాడుతూనే ఉన్నాడు. మరోవైపు అనిత తన క్లాస్‌మేట్ అయిన జబ్బార్ లాల్‌ని ప్రేమించడం మొదలుపెట్టింది. ఇద్దరూ పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుందామని భావించారు. ఇటీవల జబ్బార్ కూడా మోసగాడని తేలింది. పెళ్లి చేసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని పదేపదే వేధించడం మొదలు పెట్టాడు. జబ్బార్ వేధింపులు తట్టుకోలేక మనస్తాపానికి గురైన అనిత ఈ నెల 27న రాజేందర్ కు ఫోన్ చేసి 'నువ్వు, జబ్బార్ నా జీవితంతో ఆడుకున్నారు, నన్ను వేధించారు, అవమానించారు, మీ వల్లనే నేను ఆత్మహత్య చేసుకుంటున్నా' అంటూ బాధపడింది. అనితకు ధైర్యం చెప్పాల్సిన రాజేందర్ నిర్లక్ష్యంగా 'చావు.. నీ ఇష్టం' అంటూ ఫోన్ కట్ చేశాడు. దాంతో అనిత తీవ్ర మనస్తాపానికి గురై గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ అనిత కన్నుమూసింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రాజేందర్, జబ్బార్ లపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370